ఈనాడు సూర్యాపేట

సోమవారం 21 ఆగస్టు 2017 16 పేజీలు

పథకం పారలేదు.. ఫలితం అందలేదు

సేంద్రియ సాగు బహుదూరం
శిక్షణతోనే మమ అనిపించిన అధికారులు
క్షేత్రస్థాయి అమలుపై కొరవడిన స్పష్టత
ఆసక్తి ఉన్నా.. ప్రోత్సాహం లేని అన్నదాతలు

ఈనాడు – సూర్యాపేట

రసాయన ఎరువులు లేకుండా, పూర్తిగా సేంద్రియ పద్ధతుల్లోనే పంట పండించేలా.. ఎన్డీఏ సర్కారు ప్రారంభించిన పరంపరాగ్ కృషి వికాస్ యోజన (పీకేవీవై) క్షేత్రస్థాయిలో అమలుకు బాలారిష్టాలు ఎదుర్కొంటోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు లేకపోవడం, ఈ పథకం అమలుపై వ్యవసాయ శాఖ అధికారుల్లో నిబద్ధత కొరవడటంతో సేంద్రియ వ్యవసాయంవైపు ఆసక్తి ఉన్నా రైతులకు ప్రోత్సాహం కరవైంది. దేశవ్యాప్తంగా వ్యవసాయ రంగంలో అన్నదాతలు ప్రస్తుతం అమలు చేస్తున్న విధానాల (విచ్చలవిడిగా పురుగు మందుల వాడకంతో భూమి సారం కోల్పోవడం, పెట్టుబడులు పెరిగి

(మిగతా 7లో)



సూర్యాపేటలో బోనంతో డీఎస్పీ సునీతామోహన్

బోన భాగ్యం 16లో

“ సాగర్ ఆధునికీకరణ పనుల్లో అవినీతి అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. ఎడమ కాల్వ పరిధిలోని మేజర్ కాల్వల మరమ్మతు పనులు పూర్తిస్థాయిలో చేపట్టడం లేదు. నామమాత్రంగా చేసి చేతులు దులుపుకుంటున్నారు. పనులు చేయకుండానే బిల్లులు పొందడానికి యత్నాలు చేస్తున్నారని సాక్షాత్తు ఆ శాఖలో పనిచేసే ఓ ఇంజినీరే ప్రాజెక్టు సీఈకి ఫిర్యాదు చేయడం గమనార్హం. దీంతో సాగర్ ఆధునికీకరణ పనులు ఏ మేరకు చేపడుతున్నారో.. పనుల పర్యవేక్షణ ఎలా ఉందో ఇట్టే అర్థమవుతోంది. ”

– కోదాడ రూరల్, నడిగూడెం–న్యూస్‌టుడే

అడ్డగోలుగా పని.. అడిగేవారెవరని..!

పరిశీలన

ఆధునికీకరణ పనుల్లో ఇష్టారాజ్యం

గుత్తేదారుల హవా.. కొరవడిన అధికారుల పర్యవేక్షణ

లైనింగ్ చేసిన కాలువలో భారీగా నిలిచిన వర్షపునీరు





కాలువ పక్కన ఉన్న ఈ గుంతల్లోనే మట్టిని తవ్వి కట్టలపై పోశారు

కోదాడ పరిధిలోని 8వ డిస్ట్రిబ్యూటరీలో జరుగుతున్న ఆధునికీకరణ పనులు అవినీతిమయంగా మారాయి. నాలుగేళ్ల క్రితం మంజూరైన నిధులతో పనులు చేయాల్సి ఉండగా అధికారుల నిర్లక్ష్యం, సాంకేతిక సమస్యలతో పనుల నిర్వహణ ఆలస్యమైంది. అన్ని డిస్ట్రిబ్యూటరీల్లో పనులు పూర్తైనా డీసీ-8లో మాత్రం ఇటీవలే కొన్ని మేజర్లలో పనులు ఊపందుకున్నాయి. కానీ గడువు సమీపిస్తుండటంతో హడావుడిగా

(మిగతా 7లో)

కొమరబండ మేజర్ కాల్వ పనుల్లో..




కొమరబండ మేజర్ కాల్వపై ఇలా మట్టి సరిచేసి వదిలేశారు. లైనింగ్ చేయలేదు

సాగర్ ఎడమ కాల్వకు అనుబంధంగా ఉన్న 13 బి కొమరబండ మేజర్ కాల్వ పరిధిలోని, మైనర్ కాల్వల పటిష్ఠం, లైనింగ్, సిమెంటు పనులకు రూ.2 కోట్లు మంజూరయ్యాయి. రెండేళ్లు దాటినా పనులు చేపట్టలేదు. ఇటీవల కాల్వ పరిధిలో గుత్తేదారు మట్టి పనులు చేపట్టారు. కట్టలపై ఉన్న కంపను తొలగించి, కట్టలను మొరంతో పటిష్ఠం చేయాలి. మేజర్ కాల్వ పరిధిలో 5 కి.మీ మేర లైనింగ్ పనులు చేపట్టాలి. కాల్వ గండ్లకు మరమ్మతు చేయాలి. తూములు మరమ్మతు చేసి, షట్టర్లు ఏర్పాటు చేయాలి. రెండేళ్ల నుంచి పట్టించుకోని గుత్తేదారు వేసవి సీజన్ పూర్తయిన తరువాత గత నెలలో పనులు ప్రారంభించారు. కాల్వ కట్టపై ఉన్న కంప చెట్లను తొలగించారు. కాల్వకట్ట మట్టినే సరిచేసి తవ్వుకుంటూ పోయారు. రామాపురం వద్ద కాల్వకు గతంలో గండి పడింది. అప్పుడు రైతులే తాత్కాలికంగా పూడ్చారు. ఆ గండి ఇప్పటికీ అలాగే ఉంది. కాల్వ కట్ట పటిష్ఠం కోసం బయట నుంచి మొరం తోలాలి. అలా చేయకుండా రామాపురంలో ఇళ్ల మధ్య ఉన్న ఖాళీ స్థలంలో గుంత తవ్వి మట్టి తీసి కాల్వకట్టకు పోశారు. కాల్వ పరిధిలో ఎక్కడా సీసీ పనులు చేపట్టలేదు. సాగర్ ప్రాజెక్టుకు నీరు చేరి కాల్వలకు నీరు విడుదల చేస్తే మరమ్మతు పనులకు ఆస్కారం ఉండదు. క్షేత్ర స్థాయిలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో గుత్తేదారు ఇష్టానుసారంగా పనులు చేస్తున్నారని ఆయకట్టు రైతులు ఆరోపిస్తున్నారు.

సాదాబైనామా.. తిరస్కరణకు చిరునామా

ఆమోదానికి దూరంగా సగానికి పైగా సర్వేనంబర్లు

అత్యధికంగా యాదాద్రి భువనగిరి జిల్లాలోనే..



రాజపేట తహసీల్దారు కార్యాలయంలో సాదాబైనామా దరఖాస్తులను పరిశీలిస్తున్న యాదాద్రి జేసీ రవినాయక్

రాజపేట – న్యూస్‌టుడే


కేవలం తెల్ల కాగితాలపై జరిపిన భూ క్రయ విక్రయాలకు చట్టబద్ధత కల్పించి చిన్న రైతులకు మేలు చేయాలనే ప్రభుత్వ లక్ష్యం అధికారుల తీరు కారణంగా ఏడాది కాలంగా సాగుతోంది. దివంగత ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చేతిరాత కాగితాలకు గుర్తింపు లభించగా.. తిరిగి రెండున్నర దశాబ్దాల తదుపరి రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ సదవకాశాన్ని కల్పించారు. సాదాబైనామాకు 1994 వరకు చట్టబద్ధత కల్పించారు. సాదాబైనామా ద్వారా కొనుగోలు చేసిన భూములకు పాసుపుస్తకాలు జారీ చేయాలన్న ప్రభుత్వ ప్రకటనతో సంబరపడిన రైతులు అధికారుల తీరు కారణంగా ఎదురుచూపులు తప్పడంలేదు. కాగితంపై ఒప్పందంతో కొనుగోలు చేసిన భూములను దశాబ్దాల తరబడి సాగుచేసుకుంటున్నా నిబంధనల సాకుతో రెవెన్యూ అధికారులు ఎక్కువ శాతం దరఖాస్తులను తిరస్కరించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఉమ్మడి నల్గొండ జిల్లాలో 1,68,386 సర్వే నెంబర్లకు సంబంధించి 1,32,728 దరఖాస్తులు రాగా అందులో 89,920 దరఖాస్తులను వివిధ కారణాల సాకుతో తిరస్కరించినట్లు తెలుస్తోంది. కేవలం 78,466 సర్వేనెంబర్లకు సంబంధించి మాత్రమే అంటే సగానికి తక్కువే అధికారులు భూయజమాన్య హక్కుపత్రాలతో పాటు పాసుపుస్తకాలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.

ఏడాది కాలంగా ఎదురుచూపులు..

తెల్లకాగితంపై రాసుకున్న భూక్రయవిక్రయాలకు చట్టబద్ధత కల్పించాలని

(మిగతా 7లో)

ఉమ్మడి నల్గొండ జిల్లాలో సాదాబైనామాల తీరుతెన్నులు..



ఆర్య వైశ్యులకు సముచిత స్థానం



ఆర్య వైశ్యులకు సీఎం కేసీఆర్ అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పిస్తారని మంత్రి జగదీష్‌రెడ్డి చెప్పారు. మిర్యాలగూడ మండలం అవంతీపురంలో ఆదివారం నిర్వహించిన ఆర్యవైశ్య వనమహోత్సవంలో ఆయన పాల్గొన్నారు. సూర్యాపేటకు చెందిన సుధాకర్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ మీలా సత్యనారాయణకు ఎంపీ గుత్తా, ఎమ్మెల్యే భాస్కర్‌రావు, తదితరులతో కలిసి మంత్రి జీవిత సాఫల్య పురస్కారం అందజేశారు. -16లో...

భారీ దారి దోపిడీ



చౌటుప్పల్ మండలం కైతాపురం వద్ద ఆదివారం తెల్లవారుజామున కంటైనర్‌లోని సిగరెట్లు దోపిడీకి గురికావడంతో వేలిముద్రలను సేకరిస్తున్న క్లూస్‌టీం అధికారులు.

– కథనం ప్రధాన సంచిక ..1లో

ధాన్యం కొనుగోళ్ల సొమ్ముతో భవన నిర్మాణం అభినందనీయం



కోదాడ పీఏసీఎస్‌లో మాట్లాడుతున్న ముత్తవరపు పాండురంగారావు

కోదాడ, న్యూస్‌టుడే: ఈ నెల 22న రూ.65 లక్షలతో నిర్మించిన కోదాడ పీఏసీఎస్ భవనం ప్రారంభోత్సవానికి మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి హాజరవుతున్నట్లు డీసీసీబీ ఛైర్మన్ ముత్తవరపు పాండురంగారావు తెలిపారు. ఆదివారం కోదాడ పీఏసీఎస్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమానికి టెస్కాబ్ ఛైర్మన్ రవీందర్‌రావు, నాబార్డ్, సహకార శాఖ, డీసీసీబీ ఉన్నతాధికారులు హాజరవుతారని పేర్కొన్నారు. కోదాడ పీఏసీఎస్ వారు ధాన్యం విక్రయించగా వచ్చిన లాభంతో ఈ భవన నిర్మాణం చేసుకోవడం అభినందనీయమన్నారు. సమావేశంలో సీఈవో మంద వెంకటేశ్వర్లు, నడిగూడెం ఛైర్మన్ డి.సురేష్‌ప్రసాద్, వైస్ ఛైర్మన్ కోటి నారాయణ, డైరెక్టర్లు పాల్గొన్నారు.

పశు సంతతిని పెంచాలి: జేసీ



బేతవోలు గ్రామంలో మాట్లాడుతున్న జేసీ సంజీవరెడ్డి

చిలుకూరు(బేతవోలు), న్యూస్‌టుడే: జిల్లాలో పశు సంతతిని పెంపొందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సంజీవరెడ్డి, జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి నర్సింహ రెడ్డి అన్నారు. ఆదివారం బేతవోలు గ్రామంలో ఉచిత పశువైద్యశిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. పెరుగుతున్న జనాభా ఆరోగ్యంగా ఉండాలంటే పశుసంతతే ప్రధాన కారణమన్నారు. కార్యక్రమంలో కోదాడ మార్కెట్ ఛైర్మన్ శశిధర్‌రెడ్డి, చిలుకూరు ఎంపీపీ నాగేంద్రబాబు, మండల తహసీల్దార్ దామోదర్‌రావు, గ్రామ సర్పంచి టి.పద్మ, ఎంపీటీసీ సభ్యురాలు మంగమ్మ, మాజీ ఎంపీపీ వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన ఇల్లు



తిరుమలగిరిలో కూలిన ఇల్లు

తిరుమలగిరి, న్యూస్‌టుడే: గత రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు తిరుమలగిరికి చెందిన జెల్లా మురళీకృష్ణ ఇల్లు కూలిపోయింది. తల్లిదండ్రులు లేని మురళీకృష్ణకు చెల్లెలు ఉంది. ఇల్లు కూలిపోవడంతో ప్రస్తుతం అతని పెద్దనాన్న ఇంట్లో తలదాచుకుంటున్నారు. కూలిన ఇల్లును స్థానిక వీఆర్వో శోభ పరిశీలించారు. వెంటనే ఇల్లు మంజూరు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

నెమలిని చంపిన నిందితుడి అరెస్టు



అటవీ బీటు అధికారి శివకుమార్‌కు నెమలి కళేబరాన్ని అందజేస్తున్న నిందితుడు, చిత్రంలో సీఐ శివరాంరెడ్డి, ఎస్సై శంకర్‌రెడ్డి

కొండమల్లేపల్లి, న్యూస్‌టుడే: జాతీయ పక్షి నెమలిని వేటాడి చంపిన నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటన ఆదివారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. సీఐ శివరాంరెడ్డి, ఎస్సై శంకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కొండమల్లేపల్లి బీసీ కాలనీకి చెందిన బిజిలి చంద్రయ్య ఆదివారం తెల్లవారుజామున మండలంలోని గాజీనగర్ శివారులో నెమలిని వేటాడి చంపాడని, అనంతరం గుర్తుపట్టకుండా నెమలి కళేబరాన్ని కాల్చి సంచిలో తీసుకుని ఇంటికి వచ్చినట్లు పోలీసులు తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నట్లు సీఐ చెప్పారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి నెమలి కళేబరాన్ని దేవరకొండ అటవీశాఖ బీటు అధికారి శివకుమార్‌కు అప్పగించినట్లు సీఐ పేర్కొన్నారు.

ఆర్పీ దందాలో మరో ఐదుగురి రిమాండ్

పోలీసులకు నేటికీ చిక్కని ప్రధాన సూత్రదారుడు సాధు



మునుగోడు పోలీస్‌స్టేషన్‌లో వివరాలను వెల్లడిస్తున్న ఎస్సై రాములు

మునుగోడు, న్యూస్‌టుడే: ఆర్పీ దందాకు సంబంధించిన ఐదుగురు సూత్రదారులను ఆదివారం రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సీఐ రమేష్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ రమేష్‌కుమార్, ఎస్సై రాములుతో కలిసి ఆ కేసుకు సంబంధించిన వివరాలను విలేకర్లకు వెల్లడించారు. కర్ణాటక రాష్టానికి చెందిన మహ్మద్ యూసుఫ్, ఆయన ఇద్దరు కుమారులు మహ్మద్ సాధు, పర్వాన్ మహ్మద్‌ఖాన్ అలియాస్ ప్రిన్స్ కొన్నాళ్ల క్రితం కుటుంబ సభ్యులుతో కలిసి హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. డబ్బును సులభంగా అక్రమంగా సంపాదించుకోవాలని ఆర్పీ దందాను ఎంచుకున్నారు. ఆ ఉద్దేశంతో 2006 సంవత్సరంలో హైదరాబాద్‌లోని టోలీచౌక్‌లో రేడియేషన్ పవర్ రాగి రాడ్డు దొరికిందని ఆకాశం నుంచి పడే పిడుగుతో ఆ రాడ్డుకు శక్తి వచ్చిందని దాని ద్వారా శాటిలైట్స్ ద్వారా భూమిలో నుంచి ఖనిజాలు గుర్తించవొచ్చని ప్రస్తుతం ఆ రాడ్డును లండన్‌లో మోటల్ ఎక్సైంజ్ కంపనీకి అమ్మేందుకు రూ.3 కోట్లు ఖర్చు చేశామని, ఆ కంపనీ తిరిగి రూ.2 లక్షల 94 వేల కోట్లు వస్తాయని దానికి భారత ప్రభుత్వం నుంచి అనుమతి రావాలంటే కొంచెం ఖర్చుతో కూడిన పని అని దానికి కొంత పెట్టుబడి పెట్టాలని ఎవరైనా పెట్టుబడికి సహకరిస్తే పెట్టినపెట్టుబడికి అదనంగా పదిరెట్లు ఎక్కువగా ఇస్తామని చెప్పి ఆర్పీ దందా పేరుతో రూ.కోట్లు వసూళ్లు చేసే పనిలో పడ్డారు. ఈ క్రమంలో 2016 సంవత్సరంలో మునుగోడు మండలంలోని సింగారం గ్రామానికి చెందిన అఫ్జల్‌కు ఓ పంక్షన్‌లో సాధు పరిచయం అయ్యాడు. ఆర్పీ దందా గూర్చి అఫ్జల్‌కు వివరించడంతో సులభంగా కోటీశ్వరుడు కావొచ్చని చెడు ఆలోచనతో అఫ్జల్ తమవంతు వాటాగా రూ.4.50లక్షలు సాధుకు అప్పచెప్పాడు. అంతేకాకుండా మునుగోడు మండలంలోని సింగారం గ్రామానికి చెందిన పిట్టల రఘు, మునుగోడుకు చెందిన నీల పుల్లయ్య, మునుగోడు గ్రామ పంచాయతీ పరిధిలోని జక్కలవారిగూడెంకు చెందిన జక్కల మల్లేష్, జక్కల లింగస్వామిలను అఫ్జల్ ఏజెంట్లుగా నియమించాడు. ఈ ఐదుగురు వ్యక్తులు లండన్ ఫొటోలు చూపిస్తూ మునుగోడు మండలంలో దాదాపుగా 50 మంది బాధితుల నుంచి సుమారుగా రూ.52 లక్షలకు పైగా డబ్బులు వసూళ్లు చేసి సాధుకు అప్పగించారు. కానీ డబ్బులు కట్టి నెలలు గడుస్తున్నా ఎందుకు రావడం లేదని అఫ్జల్‌తో పాటు ఏజెంట్ సభ్యులు సాధును ప్రశ్నించారు. దీంతో లండన్ నుంచి మా సోదరుడు ప్రిన్స్ వచ్చి చూస్తాడని సాధు చెప్పాడు. ప్రిన్స్‌ను హైదరాబాద్‌లో కలిసి అడగ్గా ఆర్పీ దందా అనేది ఉత్త మాటే డబ్బులు సులభంగా సంపాధించాలని ఈ దందాను ఎంచుకున్నట్లు వీరికి తెల్చిచెప్పారు. అంతేకాకుండా మీరు కూడా అలాగానే డబ్బులు వసూళ్లు చేసి మీరు సంపాదించుకోవాలని అఫ్జల్‌తోపాటు ఏజెంట్లకు ప్రిన్స్ చెప్పినట్లు సీఐ తెలిపారు. ఆదివారం అఫ్జల్, పిట్టల రఘు, నీల పుల్లయ్య, జక్కల మల్లేష్, జక్కల లింగస్వామిల వద్ద నుంచి రూ.1.10 లక్షలు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు.

పదిహేను వందల మందికి పైగా ఆర్పీలో పెట్టుబడి పెట్టిన బాధితులు..

ఆర్పీ దందా పేరుతో నేటి వరకు పదిహేను వందల మందికి పైగా బాధితుల నుంచి ఏజెంట్ల సహకారంతో సాధు కోట్ల రూపాయలు వసూళ్లు చేసినట్లు తెలిసింది. అసలు ప్రధాన కీలక సూత్రదారి సాధు మాత్రం దొరకడం కష్టంగా మారింది. సాధును పట్టుకునేందుకు సీసీఎస్ పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపడుతున్నారు. కీలక సూత్రదారుడు సాధు దొరికితేనే ఈ ఆర్పీ దందా పూర్తి వ్యవహారం బయట పడుతోందని తెలుస్తోంది. మరి పోలీసులు ఈ ఆర్పీ దందాను పూర్తిస్థాయిలో డొంకను కదిలిస్తారా లేదా అనే సందేహం ప్రస్తుతం ప్రజల్లో నెలకొంది. ఈ దందాను నమ్మి ఎంతో మంది అమాయక ప్రజలు లక్షలు ముట్టజెప్పి మౌనంగా ఉంటున్నారు. ముందుకు వచ్చి చెబితే తమకేమి అవుతుందేమోనని భయానికి బయటికి రావడానికి ధైర్యం చేయడం లేదని తెలుస్తోంది. పోలీసులు కీలక సూత్రదారుల నుంచి పూర్తిస్థాయిలో సొమ్మును రికవరీ చేసి బాధితులను ఆదుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రిన్స్ సైతం రిమాండ్

ఆర్పీ దందాలో రెండో సూత్రధారి అయిన పర్వాన్ అలియాస్ ప్రిన్స్‌ను గత శుక్రవారం నల్గొండలోని డీఎస్పీ సమక్షంలో అరెస్టు చేసి పోలీసులు రిమాండ్‌కు పంపించారు అతని వద్ద నుంచి నాలుగు బంగారపు ఉంగరాలు, ఒక మంగళసూత్రం, ఒక నక్లెస్, గొలుసు, నాలుగు ఇంటి స్థలాల రిజిస్టేషన్ల డ్యాక్లుమెంట్లుతో పాటు రూ.2.98లక్షలను స్వాధీనం పరుచుకొని ప్రిన్సును రిమాండ్‌కు పంపించారు.

నిరంతర కృషికి గుర్తింపు

జాతీయ పురస్కారానికి ప్రధానోపాధ్యాయుడి ఎంపిక



జనార్దన్

మర్రిగూడ, న్యూస్‌టుడే: విద్యా ప్రమాణాల సాధన కోసం అమలుచేస్తున్న సర్వశిక్షాభియాన్ విధానాలను అమలుచేసి సత్ఫలితాలను సాధించిన ఓ ప్రధానోపాధ్యాయుడికి కేంద్ర ప్రభుత్వం జాతీయ పురస్కారం ప్రకటించింది. నల్గొండ జిల్లా నాంపల్లి మండలం చిట్టంపహాడ్ గ్రామానికి చెందిన ప్రధానోపాధ్యాయుడు కొప్పుముడి జనార్దన్ ఈ ఏడాది జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం శివన్నగూడ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న జనార్దన్ సెప్టెంబర్ 5న జరిగే ఉపాధ్యాయ దినోత్సవంలో దేశ రాజధాని ఢిల్లీలో ఈ పురస్కారం అందుకోనున్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఏడుగురు ఎంపిక కాగా, అందులో జనార్దన్ ఒక్కరు కావడం విశేషం. మండల విద్యాధికారి సుధాకర్ పంపిన ప్రతిపాదనలకు కేంద్ర మానవ వనరులశాఖ ఆయనకు ఈ పురస్కారాన్ని ప్రకటించింది.

1984లో ఉపాధ్యాయ వృత్తిలో చేరిన జనార్దన్ గ్రామీణ ప్రభుత్వ పాఠశాలలలో చదువుకునే విద్యార్థులకు తనదైనశైలిలో బోధన చేసి మంచి గుర్తింపు పొందారు. స్పెషల్ టీచర్‌గా విధులలో చేరిన ఆయన నాంపల్లి, చింతపల్లి, మర్రిగూడ మండలాలలో పనిచేశారు. ఆయన ఎక్కడ పనిచేసినా విద్యార్థులకు ఆటపాటలతో కృత్యాధార, గుణాత్మక పద్ధతిలో విద్యనందించడానికి ప్రాధాన్యమిస్తున్నారు. పాఠశాల ఉపాధ్యాయుల సహకారంతో పాఠశాల అభివృద్ధికి తాము తయారుచేసిన ప్రణాళికలను మండల, జిల్లాస్థాయి అధికారులకు పంపేవారు. ప్రస్తుతం ఆయన పనిచేస్తున్న శివన్నగూడ పాఠశాల అభివృద్ధికి దాతలనుంచి పలు రకాల సహాయ సహకారాలను పొందడానికి కృషిచేశారు. ఇదే పాఠశాలలో చదువుకొని ఆర్థికస్తోమత కలిగి ఉన్నవారిని గుర్తించి పాఠశాల అభివృద్ధికి ఆయన సహాయ సహకారాలు ఆర్జించారు. గ్రామానికి చెందిన దాత డాక్టర్ ఇంద్రారెడ్డి పాఠశాలకు కుర్చీలు, బెంచీలు, ప్రయోగ పరికరాలు, విద్యార్థులకు రాత పుస్తకాలను అందించారు. స్థానిక సర్పంచి దేశిడి శ్రీలత పాఠశాలకు కుర్చీలు, బెంచీలు, ఎంపీపీ అనంతరాజుగౌడ్ వికలాంగులైన విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించేలా తగుచర్యలు తీసుకున్నారు. పాఠశాలకు కృష్ణాజలాలు లేకపోవడంతో స్థానిక సర్పంచిని కలుసుకొని పాఠశాలకు పైపులైన్, ట్యాంకు నిర్మాణపనులను చేపట్టారు.

1993లో ప్రభుత్వం తీసిన కొత్త చిగుళ్లు అనే డాక్యుమెంటరీ ఫిలింలో భార్య మంజులారాణితో కలిసి పనిచేసి బాల కార్మికుల వ్యవస్థ నిర్మూలన కోసం జిల్లా వ్యాప్తంగా పలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ఈ విషయమై 1997లో అప్పటి హోంశాఖ మంత్రి ఎలిమినేటి మాధవరెడ్డి నుంచి అవార్డు అందుకున్నారు. జాతీయ పురస్కారానికి ఎంపికైన జనార్దన్‌కు ఎంఈవో సుధాకర్, మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు ఆయనకు అభినందనలు తెలిపారు.

1991-93 వరకు అమలు జరిగిన చదువు వెలుగు కార్యక్రమంలో నిరక్షరాస్యులైన వయోజనులకు ఆటపాటలతో అక్షరాలు నేర్పించారు. రాత్రి సమయంలో గ్రామాలలో పర్యటించి కేంద్రాలను పర్యవేక్షించారు. ఇందుకుగాను ఆయన అప్పటి కలెక్టర్లు జనార్దన్‌రావు, నర్సింహారావు, నీలం సహానిల చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయనకు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కూడా దక్కింది.

బోధనలో పట్టుదల అవసరం:

కె.జనార్దన్, ప్రధానోపాధ్యాయుడు, శివన్నగూడ

విద్యా వ్యవస్థలో మార్పు సాధించాలన్న తపన ప్రతి ఉపాధ్యాయుడికి అవసరం. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సహకారంతోనే సత్ఫలితాలు సాధిస్తాం. 1988 నుంచి సర్వశిక్షా అభియాన్ సూచనలమేరకు బోధించేందుకు కృషిచేస్తున్నాను. విద్యార్థికి బోధనాంశాలతోపాటు, సామాజిక అంశాలు తప్పనిసరి. నా 35 ఏళ్ల ఉపాధ్యాయ వృత్తిలో ఈ పురస్కారం దక్కడం సంతోషాన్ని కలిగించింది.

క్షణాల్లో రూ.16వేలు మాయం చేసిన బాలుడు

నేరేడుచర్ల, న్యూస్‌టుడే: బంగారు దుకాణంలో ఓ వినియోగదారుడి జేబులోంచి బాలుడు రూ.16 వేలు చోరీ చేసిన ఘటన శనివారం నేరేడుచర్లలో జరిగింది. బాధితుడు ఆదివారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు, బాధితుడి వివరాల ప్రకారం.. కల్లూరుకు చెందిన కొంజేటి వెంకటేశ్వరరావు బంగారు ఆభరణం తీసుకెళ్లేందుకు కుటుంబ సభ్యులతో కలిసి మండల కేంద్రంలోని ఓ జ్యూయలరీ దుకాణానికి వెళ్లారు. ఇదే సమయంలోనే లోపలికి వచ్చిన బాలుడు వెంకటేశ్వరరావు చొక్కా జేబుకు కవర్ అడ్డు పెట్టి జేబులో ఉన్న రూ.16 వేలు చాకచక్యంగా తీసుకుని ఉడాయించాడు. దుకాణంలోని సీసీ కెమెరా ఫుటేజి పరిశీలనలో ఈవిషయం రూఢీ అయింది. ఆభరణానికి చెల్లించాల్సిన రూ.16 వేలు పైజేబులో పెట్టుకున్న వెంకటేశ్వరరావు కాసేపటికే డబ్బు మాయమైన విషయం గుర్తించినా అప్పటికే ఆ బాలుడు దుకాణం నుంచి బయటపడ్డాడు. బాలుడికి 15 ఏళ్లలోపే ఉంటాయని చెబుతున్నారు. ఆ బాలుడు స్థానికుడా? బయటి నుంచి వచ్చాడా? అన్నది విచారణలో తేలాల్సి ఉంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని స్టేషన్ ఇన్‌ఛార్జి గఫార్ తెలిపారు.


జూనూతుల పరిధిలో ఊటకుంటను తొలగించి చదునుచేసిన భూమి

ఊటకుంటలు మాయం

రియల్ ఎస్టేట్ మాయాజాలం

గుర్రంపోడు, న్యూస్‌టుడే: ఓవైపు నీటి వనరులను మిషన్‌కాకతీయ పథకంలో భాగంగా ప్రభుత్వం అభివృద్ధి చేస్తుంటే ఇక్కడ మాత్రం రియల్టర్లు ఊటకుంటలను ఒక్కొక్కటిగా తొలగిస్తున్నారు. భూగర్భ జలాలు పరిరక్షించుకునే యత్నంలో భాగంగా పదేళ్లక్రితం ఇక్కడి వ్యవసాయభూముల్లో నిర్మించిన ఊటకుంటలు ఒక్కొక్కటిగా మాయమవుతున్నాయి. రియల్ ఎస్టేట్ మాయాజాలానికి ఊటకుంటలు కరిగిపోతున్నాయి. గుర్రంపోడు మండలంలోని జూనూతుల క్లస్టర్‌లో పదేళ్లక్రితం భూగర్భ జలాల సంరక్షణకు ఊటకుంటలు నిర్మించారు. రైతుల పట్టా భూముల్లో వారి అనుమతి మేరకు ఊటకుంటలు నిర్మించారు. మండలంలోని జూనూతుల, మక్కపల్లి, సూల్తాన్‌పురం, ఠానేదార్‌పల్లి, కాచారం తదితర గ్రామాల పరిధిలోనే చిన్నవి, పెద్దవి కలిపి దాదాపు 150 వరకు ఊటకుంటలు ఉన్నాయని అంచనా. గత నాలుగేళ్లుగా దాదాపు 20 వరకూ ఊటకుంటలు మాయమవుతూ వచ్చినట్లు చెబుతున్నారు. ప్రభుత్వం అప్పట్లో కుంటకు రూ.2 నుంచి రూ. 5 లక్షలు నిధులు మంజూరు చేస్తే చాలా చోట్ల రైతులే వాటిని నామినేషన్ పద్ధతిన తమ పట్టాభూముల్లో ఊటకుంటలు తవ్వుకున్నారు. వరద ఎక్కువ వచ్చే చోట వాటికి అలుగులు కూడా నిర్మించుకున్నారు. అయితే ఇప్పటివరకూ వాటివల్ల కొంతవరకు భూగర్భజలాలు పెరుగుతూ వచ్చాయి. వర్షపాతం చాలా తక్కువగా ఉన్నా ఇక్కడ ఇంకా బోర్లు పోస్తున్నాయంటే ఊటచెరువుల వల్లేనని ఈప్రాంత రైతులు చెబుతుంటారు.


మక్కపల్లి పక్కన తొలగించి చదునుచేసిన యాసానోల్లకుంట

మా ఇళ్లు మునుగుతాయి

ఊరికి పైభాగంలో కుంటను తొలగించటంతో మా ఊరిలోకి వరదనీరు వస్తుంది. మా ఇళ్లన్నీ మునుగుతాయి. అసలే మా గ్రామంలో భూగర్భజలాలు చాలా తక్కువ. కుంట ఉన్నందుకు మాకు ఎంతో ఆసరాగా ఉండేది. ఇప్పుడు మరింతగా నీటి కరవు వస్తుంది.



– కుంభం సత్యనారాయణ, మక్కపల్లి


గట్టును చదును చేసిన దృశ్యం

రియల్ ఎస్టేట్ మాయాజాలంతో..

గత నాలుగైదేళ్లుగా ఈ ప్రాంతంలో రియల్ఎస్టేట్ వ్యాపారం జోరందుకుంది. దీంతో భూముల అమ్మకాలు, కొనుగోళ్లు ఊపందుకున్నాయి. భూములు చేతులు మారుతుండటంతో వాటిని చదునుచేయటం, వాటిల్లో ఉన్న ఊటకుంటలు కూడా తొలగించి భూములను అందంగా ముస్తాబు చేయటం సాధారణ విషయంగా మారింది. దీంతో ప్రభుత్వ లక్ష్యానికి గండి పడుతోంది. ప్రస్తుతం ఊటకుంటలు తొలగించి భూములు చదును చేసిన చోట వర్షంనీరు నిల్వ ఉండే అవకాశాలను కోల్పోయింది. మక్కపల్లికి ఎగువున ఉన్న యాసానోల్లకుంటను అప్పట్లో రూ.5 లక్షలు వ్యయం చేసి నిర్మించారు. గ్రామంలోనికి వరదనీరు వస్తుండటంతో పైబాగాన అప్పటి సర్పంచి ఈ కుంటను ప్రభుత్వనిధులతో నిర్మించారు. ప్రస్తుతం ఆభూమిని స్వంతదారులు అమ్ముకోవటంతో చేతులు మారింది. దానిని కొనుగోలు చేసిన వారు భూమిని చదునుచేసి అందులో ఉన్న కుంటను సమూలంగా తొలగించారు. కుంట లోతట్టును మట్టితో నింపేశారు. అందులోని చెట్లు తొలగించి గుంతలను పూడ్చారు. అయితే వర్షం వచ్చి భారీగా వరదనీరు వస్తే ఊరి నడిమధ్యన ఉన్న ఇళ్లన్నీ నీటితో మునిగిపోతాయని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జూనూతుల గ్రామపరిధిలో స్టేజీకి సమీపంలో పదేళ్లక్రితం అప్పటి సర్పంచి సత్తయ్య తన 8 ఎకరాల పట్టా భూమిలో పనికి ఆహారపథకంలో సుమారు రూ.5 లక్షలు ఖర్చు చేసి ఊటకుంటను నిర్మించారు. చాలా కాలం ఆ ఊటకుంటలో నీళ్లు నిలిచి సమీపంలోని బోర్లలో నీటిమట్టం గణనీయంగా పెరిగింది. ఆయన తన వ్యక్తిగత అవసరాలకు భూమిని అమ్ముకున్నారు. దీంతో కొనుగోలు చేసిన రియల్టర్లు ఊటకుంట, ఒక వ్యవసాయబావిని తొలగించి చదును చేశారు. మూడేళ్ల క్రితమే ఈవ్యవహారం వివాదాస్పదమైనా పట్టాభూమికావటంతో అధికారులు కూడా చర్యలు తీసుకోలేకపోయినట్లు సమాచారం. ఈవిషయమై పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం అధికారుల దృష్టికి తేగా అవి ఇప్పుడు తమ పరిధిలో లేవన్నారు. నీటిపారుదలశాఖ అధికారుల నుంచి అదేసమాధానం ఎదురైంది.

బాలికల విద్యాభ్యాసానికి సకల సౌకర్యాలు

చౌటుప్పల్ గురుకులాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కడియం

చౌటుప్పల్, న్యూస్‌టుడే: బాలికలు చదువుకునేందుకు అన్ని రకాల వసతులు, సౌకర్యాలు కల్పించాల్సిన అవసరముందని విద్యాశాఖ, ఉపముఖ్య మంత్రి కడియం శ్రీహరి తెలిపారు. చౌటుప్పల్‌లోని బాలికల గురుకుల పాఠశాలను ఆయన ఆదివారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. 'చౌటుప్పల్‌లోని బాలికల గురుకుల పాఠశాలలో చాలా సమస్యలున్నాయని ఇటీవల 'ఈనాడు' ప్రధాన పత్రికలో 'గురుకులాలే కొత్తవి.. కష్టాలు పాతవే..' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించిన ఆయన స్థానిక ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్, ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిలతో గురుకులాన్ని సందర్శించారు. మంత్రి నేరుగా విద్యార్థుల ఛాత్రావాసాల్లోకి వెళ్లారు. విరిగిన మంచాలతో, ట్రంకు పెట్టెలతో నిండిపోయిన ఛాత్రావాసాన్ని, గురుకులాన్ని మొత్తం తిరిగి పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేయించారు. ప్రిన్సిపల్, ఉపాధ్యాయులను దూరంగా పంపించి విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడారు. భోజనం, వసతి, సౌకర్యాలు, విద్యా బోధన ఎలా ఉందన్న విషయం ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి కడియం శ్రీహరి మాట్లాడుతూ, చౌటుప్పల్ గురుకుల పాఠశాల వాతావరణం బాగుందన్నారు. బడుగు, బలహీనవర్గాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడానికి కేసీఆర్ గురుకులాలను ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. సమస్యలను పరిష్కరించేందుకు నిధులు మంజూరు చేస్తున్నానని హామీనిచ్చారు. తనిఖీ సమయంలో స్థానిక జడ్పీటీసీ సభ్యుడు పెద్దిటి బుచ్చిరెడ్డి, సర్పంచి బొంగు లావణ్య, గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి సత్యనారాయణ, డీఈ యూసుఫ్, ప్రిన్సిపల్ రాధారాణి తదితరులున్నారు.


చౌటుప్పల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి, పక్కన ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్, ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

ప్రభుత్వ గురుకులంలో ఇంజినీరు కుమార్తె

చౌటుప్పల్, న్యూస్‌టుడే: ప్రభుత్వ గురుకులాల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నందుకే ఉన్నతాధికారులు తమ పిల్లలను ఇక్కడ చేర్పిస్తున్నారని భువనగిరి ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ తెలిపారు. ఆదివారం చౌటుప్పల్ గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన సమయంలో తబస్సుం అనే బాలికతో మంత్రి, ఎంపీ మాట్లాడారు. ఎక్కడి నుంచి వచ్చావు? ఇక్కడ చదువు ఎలా ఉంది? అని ఆరా తీశారు. తాను హైదరాబాద్ నుంచి వచ్చానని, ఇక్కడ చదువు చాలా బాగుందని బాలిక సమాధానమిచ్చింది. అక్కడే ఉన్న డివిజనల్ ఇంజినీర్ యూసుఫ్ ఈమె తన కుమార్తె అని మంత్రికి చెప్పారు. కార్పొరేట్ సంస్థలకు మించి గురుకులాల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నందుకు తన కుమార్తెను ఇక్కడ చేర్పించానని చెప్పడంతో మంత్రి, ఎంపీ అభినందించారు.


డివిజనల్ ఇంజినీర్ కుమార్తె తబస్సుంతో మాట్లాడుతున్న విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి, ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్

జ్ఞాపకాలను గుర్తు చేసుకున్న కలెక్టర్

సంస్థాన్ నారాయణపురం, న్యూస్‌టుడే: నారాయణపురం మండలంలోని సర్వేల్ గురుకుల పాఠశాలను పూర్వ విద్యార్థి అయిన సూర్యాపేట కలెక్టర్ సురేంద్రమోహన్ ఆదివారం సందర్శించారు. భవన నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి వచ్చిన సందర్భంగా పాఠశాల ఆవరణలో కాసేపు కలియతిరిగారు. తాను చదువుకున్న తరగతి గదులకు వెళ్లి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. 1982-85 మధ్య కాలంలో 8వ తరగతి నుంచి పదో తరగతి ఇదే గురుకులంలో చదువుకున్నానని ఆనందం వ్యక్తం చేశారు.


తాను చదువుకున్న తరగతి గదిని పరిశీలిస్తున్న కలెక్టర్ సురేంద్రమోహన్

విద్యతోనే సమాజంలో మార్పు

రాయినిగూడెం (సూర్యాపేట గ్రామీణం), న్యూస్‌టుడే: వయోజన విద్యాకేంద్రాలను గ్రంథాలయాలుగా ఉపయోగించుకోవాలని వయోజన విద్య ఉప సంచాలకులు ఆర్.వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం రాయినిగూడెం గ్రామంలోని గ్రామ పంచాయితీ కార్యాలయంలో ఉన్న వయోజన విద్యాకేంద్రంలో ఎన్ఐవోఎస్ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షను తీరును ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చి వృత్తి నైపుణ్యాలను పెంపొందించాలని కోరారు. విద్యతోనే సమాజంలో మార్పు వస్తుందని, నిరక్షరాస్యులు అక్షరాలు నేర్చుకోవడానికి వయోజన విద్యాకేంద్రానికి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచి ఎడ్ల గంగాభవాని, ఎంపీటీసీ సభ్యుడు ఏల్గూరి వెంకటేశం, మండల కోఆర్డినేటర్ రామసాని స్నేహలత, గ్రామ కోఆర్డినేటర్ ఎడ్ల వెంకన్న, సింగం నాగరాణి, ఎడ్ల వీరమల్లుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.


పరీక్ష తీరును పరిశీలిస్తున్న వయోజన విద్యా డీడీ ఆర్.వెంకటేశ్వర్లు, ప్రజాప్రతినిధులు

మోడల్ గురుకులంగా 'సర్వేల్'

సంస్థాన్ నారాయణపురం : సర్వేల్ గురుకుల విద్యాలయాన్ని దేశంలోనే మోడల్ రెసిడెన్షియల్‌గా చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందని కడియం శ్రీహరి తెలిపారు. ఆదివారం సంస్థాన్ నారాయణపురం మండలంలోని సర్వేల్ గురుకుల పాఠశాలలో రూ.18.61 కోట్లతో చేపట్టనున్న భవన నిర్మాణ పనులకు విద్యుత్తుశాఖ మంత్రి జగదీష్‌రెడ్డి, ఎంపీ బూర నర్సయ్యగౌడ్, ఎమ్మెల్యేలు కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, గాదరి కిషోర్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. హరితహారంలో భాగంగాపాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో స్థల దాత మద్దినారాయణరెడ్డి చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం కడియం శ్రీహరి మాట్లాడారు. దేశంలోని కేంద్రీయ, నవోదయ విద్యాలయాలకు సర్వేల్ విద్యాలయం స్ఫూర్తి అన్నారు. తెలంగాణ బడ్జెట్‌లో గురుకుల విద్యాలయ అభివృద్ధికి రూ.38 కోట్లు మంజూరు చేస్తే అందులో రూ.18.61 కోట్లు సర్వేల్ గురుకులానికి కేటాయించడం గొప్ప విషయమన్నారు. మంత్రి జగదీష్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పాటు కాకముందే సీఎం కేసీఆర్ కేజీ టూ పీజీ, రెండు పడకల ఇళ్ల నిర్మాణం చేపట్టాలని సూర్యాపేటలో జరిగిన సభలో హామీ ఇచ్చినట్లు మంత్రి గుర్తు చేశారు. విద్యాలయం అభివృద్ధికి ఎన్ని నిధులైనా మంజూరు చేయడానికి రాష్ట్రప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఎంపీ బూర నర్సయ్యగౌడ్ మాట్లాడుతూ.. తల్లి జన్మనిస్తే విద్య జీవితానిస్తుందన్నారు. ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఏడాది లోపు భవన నిర్మాణాల ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే గాదరి కిషోర్ మాట్లాడుతూ.. ఉన్నతరంగాల్లో పనిచేస్తున్న వివిధ స్థాయి అధికారులు సర్వేల్ పూర్వవిద్యార్థులు కావడం గొప్ప విశేషమన్నారు. కార్యక్రమంలో గురుకుల విద్యాలయాల ప్రిన్సిపల్ కార్యదర్శి సత్యనారాయణ, యాదాద్రి, సూర్యాపేట జిల్లాల కలెక్టర్లు అనితారామచంద్రన్, సురేంద్రమోహన్, డీఈవో రోహిణి, ఆర్డీవో సూరజ్‌కుమార్, జడ్పీటీసీ సభ్యులు శివశంకర్, బుచ్చిరెడ్డి, ఎంపీపీ వాంకు డోతు బుజ్జి, శ్రీనివాస్‌కుమార్, సరస్వతి పాల్గొన్నారు.


నారాయణపురంలో శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు కడియం శ్రీహరి, జగదీష్‌రెడ్డి, ఎంపీ, ఎమ్మెల్యేలు, తదితరులు

హుజూర్‌నగర్

నేత్రదానాన్ని ప్రోత్సహించాలి

మఠంపల్లి, న్యూస్‌టుడే: నేత్రదానాన్ని ప్రోత్సహించాల్సిన అవసరాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని ఎన్‌సీఎల్ కర్మాగారం వీపీ ఎస్.చక్రధర్ అన్నారు. ఇక్కడి బైసన్ బోర్డ్స్ డివిజన్ కార్మికుడు జేవీ రమణారావు తల్లి లక్ష్మీరాజ్యం(58) ఆదివారం మృతిచెందారు. ఆమె నేత్రాలను దానం చేసేందుకు కుమారుడు ముందుకు రావడం అభినందనీయమన్నారు. మృతురాలి నేత్రాలను ఖమ్మం నేత్రనిధి కార్యదర్శి పద్మనాభం ఆధ్వర్యంలో వైద్యబృందం సేకరించారు. హైదరాబాదులోని ఎల్వీప్రసాద్ నేత్ర వైద్యశాలకు వీటిని అందజేస్వామని పద్మనాభం తెలిపారు. సీనియర్ జీఎం(వైద్యసేవలు) జె.శ్రీహరిరావు, బోర్డ్స్ జీఎం గోపాల్‌రాజు, ఎస్ఎం జానకిరాంరెడ్డి, ఏఎం దస్తగిరిరెడ్డి పాల్గొన్నారు

సంక్షిప్త వార్తలు

గరిడేపల్లి, న్యూస్‌టుడే: ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు వెంటనే చెల్లించాలని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు.

పొనుగోడు(గరిడేపల్లి), న్యూస్‌టుడే: పొనుగోడులో ఆదివారం ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్థానిక మైసమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు.

గరిడేపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీ ఉద్యోగాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి గుండు రాంబాబు డిమాండ్ చేశారు. ఆదివారం గరిడేపల్లిలో విలేకరులతో మాట్లాడారు.

పల్లె కబుర్లు

నేరేడుచర్ల, న్యూస్‌టుడే:

దాసారం: పంచాయతీ పరిధిలోని ఆవాస గ్రామాలకు వెళ్లే రహదారులు అధ్వానస్థితిలో ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు.

మేడారం: ఉపాధి హామీ నిధులతో సీసీరోడ్లు వేసేందుకు అనుమతించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

దిర్శించర్ల: పంచాయతీ పరిధిలో గతేడాది నర్సిరెడ్డికుంటలో చేపట్టిన మిషన్ కాకతీయ పనులు ఇంకా అసంపూర్తిగానే మిగిలాయి.

ఎల్లారం: గ్రామ పరిధిలోని బొడ్డువానికుంట పనులు గుత్తేదారు ఇంకా పూర్తిచేయలేదు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

బిల్యానాయక్‌తండా(మఠంపల్లి), న్యూస్‌టుడే: గ్రామీణ ఒలింపిక్ అసోసియేషన్ నల్గొండ ఆధ్వర్యంలో అండర్-21 వాలీబాల్ విభాగంలో బిల్యానాయక్‌తండా


వంశీ


దివ్య

జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు బాణోతు దివ్య, ధరావత్ వంశీ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు కె.బాబు, పీఈటీ జి.సీతారాంరెడ్డి ఆదివారం తెలిపారు. ఉమ్మడి నల్గొండ జిల్లా తరఫున ఈనెల 24, 25 తేదీల్లో డాన్‌బాస్కో అకాడమీవిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు.

కూరగాయల ధరలు

(నిన్నటి ధరలు) కిలో ఒక్కంటికి రూ.ల్లో

హుజూర్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: టమాటా: 50, దోసకాయ: 30, దొండకాయ: 30, బెండకాయ: 30, కాకరకాయ: 40, గోకరకాయ: 40, బీరకాయ: 40, వంకాయ: 40, ఆలుగడ్డ: 30, చామగడ్డ: 40, క్యాబేజీ: 30, కీరా: 40, క్యారెట్: 80, బీట్‌రూట్: 40, క్యాప్సికం: 60, పచ్చిమిర్చి: 60.

నేరేడుచర్ల, న్యూస్‌టుడే: ఆలుగడ్డ 20, పచ్చిమిర్చి 40, వంకాయ 40, బెండకాయ 30, దోసకాయ 20, టమాటా 50, చామగడ్డ 40, గోకరకాయ 30, పొట్లకాయ 30, బీరకాయ 40, కాకరకాయ 40, క్యాబేజీ 30, దొండకాయ 30, కీరా 30, చిక్కుళ్లు 40, బీట్‌రూట్ 40, మునగ 60, క్యాప్సికం 60, క్యారెట్ 60.

భాజపాను బలోపేతం చేయాలి

పాలకవీడు గ్రామీణం, న్యూస్‌టుడే: క్షేత్రస్థాయిలో భాజపాను బలోపేతం చేయాలని ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొబ్బా భాగ్యారెడ్డి కోరారు. ఆదివారం పాలకవీడులో జరిగిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడిగా కొత్తూరి వెంకటేశ్వర్లును నియమిస్తున్నట్లు ప్రకటించారు. గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరినాయక్, శ్రీను, వీరబాబు, ఉపేంద్రాచారి, నాగేశ్వరరావు, శ్రీకాంత్, రఘు, లాజర్ పాల్గొన్నారు.

పెచ్చులూడుతున్న భవనాలు.. భయాందోళనలో విద్యార్థులు


హుజూర్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనం వరండాలో పైపెచ్చులు కూలి తేలిన ఇనుము

శిథిలావస్థకు చేరిన తరగతి గదులు

బిక్కుబిక్కు మంటూ కాలం వెళ్లదీస్తున్న చిన్నారులు

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే:

అసలే వర్షాకాలం.. తరగతి గదిలోనో, వరండాలోనో ప్రతిరోజు ఏదో ఒకచోట పైకప్పు పెచ్చులు ఊడిపడుతున్నాయి.. విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు.. ఏరోజు ఏమి జరుగుతుందోనని ఉపాధ్యాయులూ ఆందోళన చెందుతున్నారు.. హుజూర్‌నగర్ నడిబొడ్డున ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల దుస్థితి ఇది. సమితిలు ఉన్నపుడు ఏర్పాటైన అత్యంత పురాతనమైన పాఠశాల ఇది. ఇక్కడికి కోదాడ నుంచి వచ్చి చదువుకునే వారు. ఆనాటి నుంచి ఇక్కడ ఎందరో విద్యనభ్యసించి ఉన్నత, అత్యున్నత స్థాయిలోకి వెళ్లారు. అప్పటి నుంచి ప్రమాణాలతో నడుస్తుండటం వల్ల ప్రతి సంవత్సరం ఇక్కడ ప్రవేశాలకు కొదవ ఉండదు. గతేడాది పది


తరగతి గదిలో స్లాబు పైపెచ్చులు ఊడి తేలిన ఇనుము

సెక్షన్లతో 492 మంది విద్యార్థులతో నడిచింది. ప్రస్తుతం ఇక్కడ తెలుగు, ఆంగ్ల మాధ్యమాలలో 500 మంది విద్యార్థులు చదువుతున్నారు.

గదుల కొరత..

పాఠశాలలో గదుల కొరత వేధిస్తోంది. ఉన్న ఏడు గదులూ శిథిలావస్థకు చేరటం వల్ల విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. గతేడాది కురిసిన భారీ వర్షానికి ప్రహరీ కూలిపోయింది. ఆరోజు బడికి సెలవు కావటం వల్ల ఎలాంటి ప్రమాదం జరగలేదు. పాఠశాలకు 17 తరగతి గదులు అవసరం కాగా తొమ్మిది మాత్రమే ఉన్నాయి. వీటిలో ప్రధానోపాధ్యాయునికి, ఉపాధ్యాయులకు కలిపి ఒక గదిని కేటాయించారు. మరో గదిలో ప్రయోగశాల కొనసాగుతుంది. తరగతులు నిర్వహిస్తున్న ఏడు గదులు కూడా శిథిలావస్థకు చేరాయి. రోజూ పైకప్పు పెచ్చులు ఊడిపడుతున్నాయి. వరండాదీ ఇదే పరిస్థితి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వల్ల తరగతి గదుల గోడలు నాను తుండటంతో ఎప్పుడు కూలుతాయోననే ఆందోళన నెలకొంది. గతంలో పలుమార్లు ఉన్నతాధికారులు, మంత్రులకు విన్నవించినా నిధులు మాత్రం మంజూరు కాలేదు. పూర్వ విద్యార్థుల సహకారంతో పాఠశాలకు మంచినీటి ప్లాంటు, కళావేదిక, సౌండ్ సిస్టమ్, విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తున్నారు.

ఇలా చేస్తే బావుంటుంది..

ప్రస్తుతం ఉన్న తరగతి గదులకు మరమ్మతులు చేసేందుకు నిధులు విడుదల చేయాలి. యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయించాలి. అదనంగా ఎనిమిది గదులు కావాలి. బోధనా అవసరాలకు 5 గదులు, ఒక ఉపాధ్యాయులు, గ్రంథాలయం, వ్యాయామ సంబంధిత సామగ్రి కోసం ఒక్కో గదిని మంజూరు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

దిన దిన గండమే..

: పి.లక్‌పతినాయక్, ప్రధానోపాధ్యాయుడు

పాఠశాలలో గదుల కొరత తీవ్రంగా ఉంది. దీనికి తోడు ఉన్న గదులు శిథిలావస్థకు చేరాయి. వర్షాలు పడుతున్నప్పుడు దినదినగండంలా గడపాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ దుస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మరమ్మతులకు, కొత్త గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరాం.

రాజీవ్‌గాంధీ సేవలు చిరస్మరణీయం


హుజూర్‌నగర్‌లో రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

గరిడేపల్లి, న్యూస్‌టుడే: దేశానికి మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ అందించిన సేవలు చిరస్మరణీయమని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్మడెల్లి అంజయ్య అన్నారు. ఆదివారం గరిడేపల్లిలో రాజీవ్ జయంతి నిర్వహించారు. రాణా పక్కన ఉన్న రాజీవ్ విగ్రహానికి నివాళి అర్పించారు. కార్యనిర్వాహక అధ్యక్షుడు గుండు రామాంజి, చిలకారెడ్డి, భాస్కర్, హుస్సేన్, శ్రీనివాస్, కొండలు, వీరాంజి, లింగరాజు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ తీసుకున్న నిర్ణయాల వల్ల దేశం శాస్త్ర, సాంకేతిక రంగాలలో అభివృద్ధి చెందిందన్నారు. రాజీవ్ విగ్రహానికి నివాళి అర్పించారు. పార్టీ పట్టణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తన్నీరు మల్లికార్జున్, అరుణ్‌కుమార్‌దేశ్‌ముఖ్, భాస్కరుని రామారావు, కుక్కడపు మహేష్, గంగసాని యాల్లారెడ్డి, తేజావత్ సైదులునాయక్, బెల్లంకొండ గురవయ్య, ఎస్.కె.సైదా, గుజ్జుల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేరేడుచర్ల : నేరేడుచర్లలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ జయంతి నిర్వహించారు. ప్రధాన కూడలి వద్ద ఆయన విగ్రహానికి నివాళి అర్పించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు వల్లంశెట్ల లచ్చయ్య, భుక్యా గోపాల్, ఆకారపు వెంకటేశ్వర్లు, కుంకు శ్రీనివాసరావు, ఖాదర్‌ఖాన్, బచ్చలకూరి ఆశీర్వాదం, కొణతం చిన్నసీతారాంరెడ్డి, సయ్యద్ బాషా తదితరులు పాల్గొన్నారు. దిర్శించర్లలో జరిగిన వేడుకల్లో మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాపోలు నర్సయ్య, పి. సైదిరెడ్డి, జలీల్, నన్నెపంగ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాలకవీడు గ్రామీణం: రాజీవ్‌గాంధీ జయంతిని కాంగ్రెస్ శ్రేణులు ఆదివారం పాలకవీడులో నిర్వహించారు. ఆపార్టీ మండల అధ్యక్షుడు బచ్చలకూరి ఆశీర్వాదం, కార్యనిర్వాహక అధ్యక్షుడు సారెడ్డి శ్రీనివాసరెడ్డి ఆయన విగ్రహానికి నివాళి అర్పించారు. ప్రధాన కార్యదర్శి దేవులపల్లి జనార్దనాచారి, భుక్యా గోపాల్, వల్లభరెడ్డి, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.


నేరేడుచర్లలో..

ముక్తి మార్గాన్ని చూపేది ఆధ్యాత్మిక జీవనమే

మఠంపల్లి, న్యూస్‌టుడే: మానవాళికి ముక్తిమార్గాన్ని చూపేది ఆధ్యాత్మిక జీవనమేనని నల్గొండ మేత్రాసన పీఠాధిపతి బిషప్ గోవిందు జోజి అన్నారు. ఆదివారం మఠంపల్లి శుభవార్త ఆలయంలో నిర్వహించిన పవిత్రాత్మ ద్రువీకరణ సాంగ్యంలో విశ్వాసులనుద్దేశించి ప్రసంగించారు. క్రైస్తవులు ఆధ్యాత్మిక జీవనంలో నిలకడగా ఉండాలని ఉద్బోధించారు. ఎలాంటి ప్రలోభాలకు ప్రభావితులు కాకుండా అవసరమైన సందర్భాల్లో దేవుని సహాయాన్ని కోరాలన్నారు. పవిత్రాత్మ ద్రువీకరణ సాంగ్యం స్వీకరించేందుకు తల్లిదండ్రులు తమ బిడ్డలను తీసుకురావడం శుభపరిణామమన్నారు. ఆలయ విచారణ గురువు ఫాదర్ మార్టిన్ పసల, ఫాదర్ లూర్దుమర్రెడ్డి, ఫాదర్ అలెగ్జాండర్, చర్చి కమిటీ సభ్యులు, సంకీర్తనల గాయక బృందం పాల్గొన్నారు.


మఠంపల్లి శుభవార్త ఆలయంలో విశ్వాసులకు ఆశీస్సులు అందజేస్తున్న బిషప్ గోవిందు జోజి

సినిమాలు

హుజూర్‌నగర్: **శ్రీనివాస:** జయ జానకి నాయక, **సాయిబాబా:** నేనే రాజు నేనే మంత్రి, **నేరేడుచర్ల: వెంకట్రామా:** నేనే రాజు నేనే మంత్రి

గ్యాస్ సమాచారం

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: హుజూర్‌నగర్ వెంకటేశ్వర ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ పరిధిలో సోమవారం వేపలసింగారం, లింగగిరి, పొనుగోడు, కందిబండ, హేమ్లాతండా, మఠంపల్లి, వరదాపురం, బిల్యానాయక్‌తండా, హుజూర్‌నగర్ నగర పంచాయతీ పరిధిలో గ్యాస్ సరఫరా జరుగును.

జేసీ ప్రత్యేక పూజలు

బూరుగడ్డ(హుజూర్‌నగర్ గ్రామీణం), న్యూస్‌టుడే: బూరుగడ్డలోని ఆదివరాహ లక్ష్మీనృసింహ వేణుగోపాల స్వామి ఆలయం, గోపాలపురంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో సంయుక్త కలెక్టర్ సంజీవరెడ్డి, హైమావతి దంపతులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. యరగాని రామస్వామి, అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్, గూడెపు శ్రీనివాస్, రాగం లింగయ్య, యరగాని పూర్ణ, ఈవో లక్ష్మణ్‌రావు, ఆర్ఐ చిక్కుళ్ల నర్సయ్య, వీఆర్వో వీరస్వామి పాల్గొన్నారు.

హుజూర్‌నగర్

బోనం.. తెలంగాణ ప్రాణం


హుజూర్‌నగర్‌లో కదులుతున్న ప్రభబండ్లు


హుజూర్‌నగర్‌లో జాతర సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించబడిన అమ్మవారు


హుజూర్‌నగర్‌లో అమ్మవారి దర్శనానికి వచ్చిన నగరపంచాయతీ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కమిషనర్, కౌన్సిలర్లు

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: పాడిపంటలతో అందరూ సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం పెద్ద ముత్యాలమ్మను దర్శించుకున్న అనంతరం భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. ముత్యాలమ్మ గుళ్ల అభివృద్ధికి కృషి చేసానని తెలిపారు. యరగాని నాగన్న, తన్నీరు మల్లికార్జున్‌రావు, చిట్యాల అమర్‌నాథ్‌రెడ్డి, భాస్కరుని రామారావు, శివరాం తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: వివిధ పార్టీల నాయకులు అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చారు. వైకాపా రాష్ట్ర అధ్యక్షుడు గట్టు శ్రీకాంత్‌రెడ్డి, తెరాస జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్, నగర పంచాయతీ అధ్యక్షుడు జక్కుల వెంకయ్య, ఉపాధ్యక్షుడు దొంతగాని శ్రీనివాస్, కమిషనర్ గోపయ్య, కౌన్సిలర్లు అమ్మవారిని దర్శించుకున్నారు. పాడిపంటలతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ నియోజకవర్గ తెరాస ఇన్‌ఛార్జి కాసోజు శంకరమ్మ బోనమెత్తికొని అమ్మవారిని దర్శించుకున్నారు. పచ్చిపాల ఉపేందర్, బుడిగ పిచ్చయ్య, నరసింహచారి తదితరులు పాల్గొన్నారు. జాతర సందర్భంగా నగర పంచాయతీ సిబ్బంది పారిశుద్ధ్యం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రోటరీక్లబ్ ఆధ్వర్యంలో భక్తులకు మంచినీటిని సరఫరా చేశారు. పోలీసులు కట్టుదిట్టమైన భద్రతను కల్పించారు.

రాయినిగూడెం(గరిడేపల్లి), న్యూస్‌టుడే: రాయినిగూడెం పంచాయతీ పరిధిలోని కట్టవారిగూడెంలో బోనాల పండుగను ఆదివారం ఆనందోత్సవాల నడుమ జరుపుకొన్నారు. గరిడేపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని పరెడ్డిగూడెంలో భక్తిశ్రద్ధల నడుమ బోనాల పండుగ నిర్వహించారు. కోదండరాంపురంలో ముత్యాలమ్మ జాతరను భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు.

చింతలపాలెం (మేళ్లచెరువు), న్యూస్‌టుడే: చింతలపాలెం మండల కేంద్రంలో ముత్యాలమ్మ జాతరను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా బయలుదేరారు. అనంతరం మేళతాళాల నడుమ అమ్మవారికి సమర్పించారు. సర్పంచి గోనె లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బూరుగడ్డ(హుజూర్‌నగర్ గ్రామీణం), న్యూస్‌టుడే: బూరుగడ్డలో ముత్యాలమ్మ జాతరను ఆదివారం వైభవంగా నిర్వహించారు. సంయుక్త కలెక్టర్ సంజీవరెడ్డి దంపతులు బొడ్రాయి వద్ద కొబ్బరికాయ కొట్టి జాతరను ప్రారంభించారు. సర్పంచి రాధిక దేశ్‌ముఖ్, అరుణ్‌కుమార్, గూడెపు శ్రీనివాస్, యరగాని రామస్వామి, బిక్షం, సోమగాని లింగమ్మ, బాలమ్మ పాల్గొన్నారు.

మఠంపల్లి, న్యూస్‌టుడే: రఘునాథపాలెం పరిధిలోని వెంకటాయపాలెం, అల్లీపురం, చౌటపల్లి గ్రామాల్లో ఆదివారం ముత్యాలమ్మ జాతరను వైభవంగా జరుపుకొన్నారు. ప్రభబండ్లు, మహిళలు బోనాలతో ఆలయానికి చేరుకుని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. సర్పంచులు ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


చింతలపాలెంలో బోనాలను తీసుకెళ్తున్న మహిళలు


హుజూర్‌నగర్‌లో బోనమెత్తిన కాసోజు శంకరమ్మ


హుజూర్‌నగర్‌లో బోనాలతో అమ్మవారి దర్శనానికి బయలుదేరిన మహిళలు


హుజూర్‌నగర్‌లో అమ్మవారిని దర్శించుకుంటున్న టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి


హుజూర్‌నగర్‌లో పోలీసుల బందోబస్తు


హుజూర్‌నగర్‌లో అమ్మవారిని దర్శించుకుంటున్న మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్ తదితరులు


అమ్మవారిని దర్శించుకుంటున్న వైకాపా రాష్ట్ర అధ్యక్షుడు గట్టు శ్రీకాంత్‌రెడ్డి

వీధుల్లో అపరిశుభ్రతను తొలగించరూ..

దిర్శించర్లలో ఆరో వార్డులోని వీధుల్లో అపరిశుభ్రత నెలకొంది. చెత్తాచెదారం పేరుకుపోయింది. ఎవరూ పట్టించుకోవడం లేదు. సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలి. **పంపిన వారు: సాయి, దిర్శించర్ల**

సమాధానం: గ్రామ పంచాయతీ సిబ్బందిని పంపించి అపరిశుభ్రతను తొలగింపజేస్తాం.

– నన్నెపంగు వెంకటమ్మ, సర్పంచి

సేకరణ: దిర్శించర్ల (నేరేడుచర్ల), న్యూస్‌టుడే


దిర్శించర్ల వీధుల్లో అపరిశుభ్రత ఇలా..

మీరూ స్పందించండి..

మీరు ఎదుర్కొంటున్న సామాజిక సమస్యలపై స్పందించండి. వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు 'ఈనాడు' వేదికగా నిలుస్తుంది. మీరు చేయాల్సిందల్లా సమస్యను ఫొటో తీసి, సంబంధిత వివరాలు క్లుప్తంగా రాసి వాట్సాప్ ద్వారా మాకు పంపించండి.

వాట్సాప్ సెల్ నెంబర్లు:

హుజూర్‌నగర్: 96030 18889;
నేరేడుచర్ల: 80085 74435
మేళ్లచెరువు: 97018 21971
మఠంపల్లి: 80085 74420;
గరిడేపల్లి: 80085 74395
హుజూర్‌నగర్ గ్రామీణం: 80085 66100

విద్యుత్తు స్తంభం చుట్టూ అల్లుకున్న పిచ్చిమొక్కలు

దిర్శించర్లలో ప్రధాన రహదారి వెంట అంబేడ్కర్ విగ్రహం వద్ద గల విద్యుత్తు స్తంభం చుట్టూ పిచ్చిమొక్కలు అల్లుకుపోయాయి. అయినా విద్యుత్తుశాఖ సిబ్బంది పట్టించుకోవడం లేదు.

– వెంకటేశ్వరరావు, దిర్శించర్ల

సమాధానం: స్తంభం వద్ద పిచ్చిమొక్కలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం.

– సాయికుమార్, ఏఈ, విద్యుత్తు శాఖ

సేకరణ: దిర్శించర్ల (నేరేడుచర్ల), న్యూస్‌టుడే


దిర్శించర్లలో విద్యుత్తు స్తంభానికి అల్లుకుపోయిన పిచ్చిమొక్కలు

కళాకారులకు సమాజంలో సముచిత స్థానం

మఠంపల్లి, న్యూస్‌టుడే: సమాజంలో రంగస్థల కళాకారులకు సముచిత స్థానం ఉందని టీఎస్ఎస్ పీడీసీఎల్ ఎస్ఈ పాల్‌రాజ్ అన్నారు. కళారంగంలో సుదీర్ఘానుభవం ఉన్న ఎస్ఈకి మఠంపల్లిలో జ్యోతిప్రకాష్ యువజన నాట్యకళామండలి, యువభారతి సాహిత్య, సాంస్కృతిక కళాసమితి సంయుక్తంగా ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ నాటక రంగంలో యువతరం పాలుపంచుకునేలా కళామండళ్లు కృషిచేయాలని కోరారు. భోనగిరి ప్రకాష్ బాబు, గుంటి పిచ్చయ్య, జగన్మోహన్ రెడ్డి, జి.వెంకటేశ్వర్లు, డి.శివరాంనాయక్, షేక్ సైదులు, మస్తాన్, బి.వెంకటశివ, వినాయకరాజు పాల్గొన్నారు.


మఠంపల్లిలో ఎస్ఈ పాల్‌రాజ్‌ను సన్మానిస్తున్న రంగస్థల కళాకారులు

4వేల మంది భక్తుల తలనీలాల సమర్పణ

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో ఆదివారం నాలుగువేల మంది భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు తలనీలాలు సమర్పించడంతో కల్యాణకట్ట నిండిపోయింది. దీంతో ఆలయ ఖజానాకు రూ. 80వేలు జమయ్యాయి.

శ్రీస్వామి సన్నిధిలో భక్తుల కోలాహలం

భక్తుల శ్రావణ పూజలు

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి సన్నిధి ఆదివారం భక్తులతో కోలాహలంగా మారింది. పలు ప్రాంతాలకు చెందిన భక్తులు యాదగిరీశుడిని దర్శించి మొక్కు పూజలు చేపట్టారు. శ్రావణం ముగియనున్నందున ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో క్షేత్రానికి చేరి పూజల్లో పాల్గొన్నారు. శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాల నిర్వహణలో మండపం కిక్కిరిసిపోయింది. శ్రీ స్వామి అమ్మవార్ల నిత్యకల్యాణోత్సవ మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు. కల్యాణం జరిగిన బాలాలయ మండపం కిటకిటలాడింది. శాస్త్రోక్తంగా కొనసాగిన కల్యాణంలో గజవాహనోత్సవాన్ని నిర్వహించారు.


కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

➡ వేకువజామున సుప్రభాతవేళ భక్తులు దైవదర్శనం కోసం బారులుతీరారు. పుష్కరిణిలో పుణ్యస్నానం ఆచరించి సంకల్పం చేపట్టారు. సోమవారంతో శ్రావణం ముగియనుంది. దీంతో పలు జిల్లాల నుంచి భక్తులు అధికంగా క్షేత్రాన్ని సందర్శించారు. హరి హరులను దర్శించి మొక్కుపూజలు చేపట్టారు.

➡ దైవదర్శనం, ప్రసాదాల కొనుగోలుకు గంటలకొద్దీ క్యూ కట్టాల్సి వచ్చిందని భక్తులు అన్నారు.

యాదాద్రీశుడికి ముఖ్యుల పూజలు

యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి బాలాలయాన్ని శాసనమండలి చీఫ్ విప్ పాటూరి సుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వేర్వేరుగా ఆదివారం సందర్శించారు. శ్రావణమాసం చివరివారం సందర్భంగా శ్రీ లక్ష్మీనరసింహ స్వామిని దర్శించేందుకు వచ్చిన ముఖ్యుల శ్రీ స్వామి అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేపట్టారు. వేర్వేరుగా వచ్చిన విప్ సుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ రాజగోపాల్‌రెడ్డిలకు ఆలయ పూజారులు సంప్రదాయంగా స్వాగతించారు. శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ, నర్సింగ్, బాలనర్సయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా కన్వీనర్ వెంకటేశ్ ఎమ్మెల్సీ వెంట ఉన్నారు.

ముత్యాలమ్మ సంబరం.. భక్తుల కోలాహలం


అమ్మ వారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: పట్టణంలో ప్రత్యేక తరహాలో మూడు రోజుల పాటు జరిగే ముత్యాలమ్మ జాతర ఆదివారం ప్రారంభమైంది. ఉదయం నుంచే భక్తులు బోనాలతో కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకోవటానికి బారులు తీరారు. సాయంత్రం ప్రభ బండ్ల ఊరేగింపు ఆకట్టుకుంది. పాడి పంటలతో అందరూ సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించానని పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు.


హుజూర్‌నగర్‌లో పెద్ద ముత్యాలమ్మ ఆలయం వద్ద భక్తులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి


తరలివస్తున్న ప్రభ బండ్లు


జాతరలో హిజ్రాల నృత్యం

విస్తరణ పనుల సందర్శన

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ విస్తరణ పనులను శాసనమండలి చీఫ్ విప్ పాటూరి సుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ రాజగోపాల్‌రెడ్డి ఆదివారం సందర్శించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కృషితో యాదాద్రి క్షేత్రాభివద్ధి జరుగుతోందని భవిష్యత్‌లో ఈ క్షేత్రం విశ్వఖ్యాతిగాంచనుందని శాసనమండలి చీఫ్‌విప్ పాటూరి సుధాకర్‌రెడ్డి అన్నారు. భక్తులెందరికో ఇలవేల్పుగా విరాజిల్లుతున్న క్షేత్రం అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమేనని ఎమ్మెల్సీ రాజగోపాల్‌రెడ్డి ఆకాంక్షించారు. ముఖ్యుల వెంట ఆలయ శిల్పి ఆనందసాయి, స్తపతి సలహాదారు డాక్టర్ వేలు, ఆలయ అధికారులు ఉన్నారు.


చీఫ్‌విప్‌తో ఎమ్మెల్సీ రాజగోపాల్‌రెడ్డి, తదితరులు

సాదాబైనామా.. తిరస్కరణకు చిరునామా

(మొదటి పేజీ తరువాయి) సాదాబైనామాలకు ఉచిత రిజిస్ట్రేషన్‌తో సహా పట్టా పాసుపుస్తకాలు ఇవ్వాలని ప్రభుత్వం ఏడాదికిందట నిర్ణయించింది. ఇందుకోసం 2016 జూన్ ఒకటో తేదీ నుంచి 15వ తేదీవరకు మీసేవ కేంద్రాల ద్వారా రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించింది. ఆతర్వాత గడువును మరో వారం రోజులపాటు పొడిగించింది. ప్రచారలేమితో తొలుత సంబంధిత రైతులు దరఖాస్తుకు ముందుకు రాకపోయినా.. గడువు పొడిగింపుతో వాటి సంఖ్య రెట్టింపయిందనే చెప్పవచ్చు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారులు విచారణ ప్రారంభించే సమయానికి ప్రభుత్వం జిల్లాల పునర్వ్యవస్థీకరణను తెరపైకి తీసుకురావడంతో దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ కొంతమేర ఆలస్యమైందని అధికార వర్గాలంటున్నాయి. తర్వాత జిల్లాలు, మండలాల ఏర్పాటుతో వచ్చిన దరఖాస్తులను విభజించడం వంటి పనులను చేపట్టారు. కిందటి జనవరిలో ముఖ్యమంత్రి ఆదేశాలతో సాదాబైనామా పట్టాల ప్రక్రియలో వేగం పెరిగింది. త్వరగా పట్టాలు పంపిణీ చేస్తే బ్యాంకు రుణాలు పొందుతామన్న అన్నదాతలు ఆశగా ఎదురుచూస్తుండటం గమనార్హం. పనిభారానికి తోడు భూముల సర్వే, ధ్రువపత్రాల జారీ తదితర పనులతో కొంతమేర జాప్యం జరిగిందనే వాదన వినిపిస్తోంది.

తిరస్కరించినవే అధికం..

దశాబ్దాల తరబడి సాగు చేసుకుంటున్న రైతుల దరఖాస్తుల్లో చాలావరకు నిబంధనల సాకు, కిందిస్థాయి యంత్రాంగం పూర్తిస్థాయి పరిశీలన లేని కారణంగా తిరస్కరణకు గురవుతున్నాయనే ఆరోపణలే వినిపిస్తున్నాయి. ఉమ్మడి నల్గొండ జిల్లాలో 1,32,728 దరఖాస్తుల ద్వారా 1,68,386 సర్వేనెంబర్ల క్రమబద్ధీకరణకు అభ్యర్థనలు వచ్చాయి. ఇందులో 89,920 సర్వేనెంబర్లను తిరస్కరించినట్లుగా అధికారవర్గాలు చెబుతున్నాయి. ఇందులో చెరువు శిఖం భూములతోపాటు ప్రభుత్వం పంపిణీ చేసిన అసైన్డ్ భూములకు సంబంధించిన దరఖాస్తులు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూములకు సంబంధించిన సర్వేనెంబర్లు ఉండటంతో ఆయా సర్వేనెంబర్లతో వచ్చిన దరఖాస్తులను అధికారులు ప్రాథమిక దశలోనే విచారణ అవసరం లేకుండా తిరస్కరించారు. కొన్ని దరఖాస్తులో అర్హులుగా ఉన్నప్పటికీ విచారణ పేరిట కిందిస్థాయి అధికారులు సదరు రైతుల నుంచి ముడుపులు తీసుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

పారదర్శకంగా.. ఖర్చు లేకుండా.. అక్రమాలకు, అవినీతికి తావు లేకుండా, రైతులకు రూపాయి ఖర్చు లేకుండా సాదాబైనామాలను క్రమబద్ధీకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పట్టాదారు పాసుపుస్తకాలు, భూమి హక్కు యాజమాన్య పత్రాలను ఒకేసారి దరఖాస్తుదారులకు అందజేయాలని భావిస్తోంది. భూములు కొనుగోలు చేసి, వాటిని చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ చేయించుకునే ఆర్థిక స్థోమత లేక సాదాబైనామాలపై రాసుకున్న రైతులు ఆర్‌వోఆర్, పట్టాదారు పాసు పుస్తకాలు లేక ఇబ్బందులు పడేవారు. బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకోవడానికి, రాయితీ విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పరికరాలు పొందడానికి అర్హత ఉండేదికాదు. ప్రకృతి విపత్తులతో పంటలకు నష్టం వాటిల్లితే పరిహారం పొందే అవకాశం లేకపోయేది. గతంలో భూముల విలువలను బట్టి స్టాంపు, రిజిస్ట్రేషన్, బదిలీ రుసుములు పేరిట మొత్తం 6 శాతం వసూలు చేసేవారు. అంతమొత్తం చెల్లించినా రెవెన్యూ అధికారులకు అనధికార సొమ్ము ముట్టజెప్తే కాని రైతుకు పాసుపుస్తకాలు జారీ అయ్యేవికావు. అడిగినంత ఇవ్వకపోతే పాసుపుస్తకాలు ఇచ్చి టైటిల్‌డీలు ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టే సందర్భాలు రెవెన్యూ కార్యాలయాల్లో అనేకం ఉన్నాయి.

త్వరలో పంపిణీకి ఏర్పాట్లు: రవి, జేసీ, యాదాద్రి

సాదాబైనామా దరఖాస్తుల పరిశీలన ఇదివరకే పూర్తయింది పలుదఫాలుగా క్షేత్రస్థాయిలో చేపట్టిన విచారణ అనంతరం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిచేశాం. త్వరలో ప్రజాప్రతినిధుల సమక్షంలో దరఖాస్తుదారులకు పట్టాలు అందనున్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లాలో మొత్తం 3,247 సర్వే నెంబర్లను అర్హమైనవిగా గుర్తించాం.

'పథకం' పారలేదు.. ఫలితం అందలేదు

(మొదటి పేజీ తరువాయి) రైతులు ఆత్మహత్యలకు పాల్పడటం)ను నియంత్రించి అన్నదాతలు పూర్తిగా జీవ ఎరువుల తయారీ, జీవామృతం ద్వారానే వ్యవసాయం చేసేలా కార్యోన్ముఖుల్ని చేసి.. రాష్ట్రాల సహాయంతో ఈ పథకాన్ని అమలు చేయాలనేది కేంద్ర సర్కారు లక్ష్యం. అయితే వ్యవసాయ అధికారులు ఆ దిశగా దృష్టి సారించడం లేదన్న విమర్శలున్నాయి.



"రానున్న మూడేళ్లలో రైతుల ఆదాయం రెట్టింపు చేయాలనేదే మా ప్రభుత్వ లక్ష్యం. వ్యవసాయంలో కృత్రిమ రసాయనిక ఎరువులు విచ్చలవిడిగా వాడడం వల్ల పెట్టుబడులు పెరిగి రైతులు నష్టపోతున్నారు. అందువల్లే క్షేత్రస్థాయిలో సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నాం. ఇందులో భాగంగానే ఎన్డీఏ సర్కారు పరంపరాగ్ కృషి వికాస్ యోజన (పీకేవీవై) పథకాన్ని అమలు చేస్తోంది" - ప్రధాని మోదీ

శిక్షణతోనే మమ

పీకేవీవై కింద ఉమ్మడి నల్గొండ జిల్లాలోని మొత్తం 59 మండలాల్లో ఈ పథకం కింద 39 మండలాలను ఎంపిక చేశారు. ఒక్కో క్లస్టర్‌లో 50 ఎకరాల భూమి, 50 మంది రైతులు ఉండేలా అధికారులు కార్యాచరణ రూపొందించారు. అయితే ఈ క్లస్టర్లు 39 మండలాల్లో ఒకే గ్రామం కింద ఉండేలా ఎంపిక చేశారు. ఒక్కో క్లస్టర్‌కు ఏడాదికి రూ.14.95 లక్షలను ఖర్చుచేయాలని ప్రతిపాదించారు. ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలనే ఉద్దేశంతో పీకేవీవై కింద పథకం అమలు, రైతులకు సూచనలు, సలహాలు అందించాలనే లక్ష్యంతో వ్యవసాయ శాఖ అధికారులకు గతేడాది జూన్‌లో హైదరాబాద్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో శిక్షణ తరగతులను ఏర్పాటుచేశారు. తర్వాత జిల్లాలో పలువురు ఎంపిక చేసిన రైతులకు మొక్కుబడిగా శిక్షణనిచ్చిన వ్యవసాయ అధికారులు తిరిగి అటువైపు దృష్టి సారించలేదు. శిక్షణనిచ్చి వారిని సేంద్రియ వ్యవసాయంవైపు మొగ్గుచూపేలా చేసిన అధికారులు ఆ తర్వాత దానిని పట్టించుకోకపోవడంతో ఈ తరహా పద్ధతిపై ఆసక్తితో సాగు చేసిన రైతులకు మెలకువలు తెలియకపోవడంతో తిరిగి పాత పద్ధతులనే అనుసరించి విషపూరిత రసాయనాలు, ఎరువులనే వాడటంతో మళ్లీ కథ మొదటికొచ్చింది.

నిధుల కొరత

మూడు జిల్లాల్లోని 39 క్లస్టర్లకు.. ఒక్కో దానికి రూ.14.95 లక్షలు చొప్పున మొత్తం రూ.5.83కోట్లు విడుదల కావాల్సి ఉంది. ఇందులో సగం నిధులను కేంద్ర ప్రభుత్వం భరిస్తుండగా.. మిగిలిన సగం రాష్ట్ర ప్రభుత్వం భరించాలి. ఇప్పటివరకు ఈ పథకానికి నిధులు విడుదల కాకపోవడంతో సంబంధిత అధికారులే కొంతకాలం నిధులను సర్దుబాటు చేశారు. ఈ పథకం కింద ఇటీవలే కొంత మొత్తం నిధులు విడుదలయ్యాయని వ్యవసాయ శాఖ అధికారులు 'ఈనాడు'కు వెల్లడించారు.

అధికారులు సహకరిస్తేనే...

– టేకుల సత్తిరెడ్డి, ఉరుమడ్ల, చిట్యాల మండలం

పరంపరాగ్ కృషి వికాస్ యోజన (పీకేవీవై) పథకం కింద సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలనే లక్ష్యంతో వ్యవసాయ అధికారులు గతంలో శిక్షణ ఇచ్చారు. తీరా పంట సాగు చేసే దశలో బడ్జెట్ రాలేదని శిక్షణను అర్ధంతరంగా ఆపేశారు. సేంద్రియ వ్యవసాయం పద్ధతిలో సాగు చేయాలనే ఆసక్తి ఉన్నా మాకు తగిన దిశానిర్దేశం లేదు. అధికారులు సహకరిస్తే ఈ పద్ధతిలో సాగుకు మేం సానుకూలమే.

కార్యాచరణ ప్రారంభిస్తున్నాం

– నర్సింహారావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, నల్గొండ జిల్లా

ఈ పథకం కింద ఇటీవలే కొన్ని నిధులు విడుదలయ్యాయి. ఎంపిక చేసిన క్లస్టర్లలో రైతులకు త్వరలోనే పూర్తిస్థాయి శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేస్తాం.

అడ్డగోలుగా పని.. అడిగేవారెవరని..!

(మొదటి పేజీ తరువాయి) నాణ్యతకు తిలోదకాలిచ్చి, బిల్లులు చేయించుకొని నిధులను కాజేసే ప్రయత్నాలు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

రూ.27 కోట్లు కేటాయింపు

ఎనిమిదో డిస్ట్రిబ్యూటరీ పనులకు రూ.27 కోట్లను కేటాయించారు. అన్ని డీసీల్లో మాదిరిగా పనులు ప్రారంభం కావాల్సిఉండగా గుత్తేదారులు లేకపోవడం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా పనులు ఆలస్యమయ్యాయి. ఈ డిస్ట్రిబ్యూటరీలో మొత్తం 10 మేజర్ కాలువలున్నాయి. వీటి పరిధిలో సుమారు 60వేల ఎకరాల సాగుభూమి ఉంది. ఈ కాలువల పరిధిలో 34 కిలోమీటర్ల సిమెంట్ లైనింగ్, కాలువ కట్టలను బలంగా చేయాల్సి ఉంది. విడతల వారీగా నాణ్యమైన మట్టిని కట్టలపై పోసి గట్టిదనం కోసం రోలింగ్ చేయాలి. మేజర్ కాలువల ప్రారంభం నుంచి నిర్దేశించిన దూరం వరకూ లైనింగ్ చేయాలి. తద్వారా నీరు నిలువకుండా చివరి భూములకు కూడా త్వరగా చేరుతుంది. దీంతోపాటు డ్రాపులు, తూములు, అండర్‌టన్నెల్స్ నిర్మించాల్సి ఉంది. కానీ వీటిలో నిబంధనలు పాటించకుండానే పనులను చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి.



కోతకు గురైన కాలువకట్ట

మచ్చుకు కొన్ని...

రెడ్లకుంట మేజర్ చిలుకూరు మండల పరిధిలో కాలువ కట్టల పటిష్టత అస్తవ్యస్తంగా ఉంది. రెండేళ్ల క్రితం 9-ఆర్ సమీపంలో చేపట్టిన మట్టి తోలకం పనుల్లో కట్టపై మట్టి వేయకుండానే వేసినట్లు చూపారన్న విమర్శలున్నాయి.

బాలాజీనగర్ సమీపంలో మట్టిపోసిన ప్రాంతం ప్రస్తుతం అస్తవ్యస్తంగా మారింది. ఇంత త్వరగా దెబ్బతినడంతో నాణ్యతపై రైతులు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఆర్కేమేజర్ కాలువ పరిధిలో కాలువకట్ట కోతకు గురవుతోంది. మట్టిపోసిన సమయంలో రోలింగ్ చేయకపోవడంతో కట్ట కోతకు గురవుతోంది.

గణపవరం మేజర్‌కాలువ పరిధిలోనూ లైనింగ్ పనుల్లో లోపాలున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. లైనింగ్ జరిగిన ప్రాంతంలో ఓ చోట మూడడుగుల మేర వర్షపునీరు నిలవడం దీనికి నిదర్శనంగా చెబుతున్నారు. సాగునీరు సమయంలో తక్కువస్థాయిలో విడుదల చేస్తే లైనింగ్‌దాటి నీరు కిందకు వెళ్లే పరిస్థితి ఉండదని రైతులు వాపోతున్నారు.

గణపవరం మేజర్‌కాలువ వెంట ఉన్న మట్టినే తవ్వి అక్కడికక్కడే కాలువ కట్టలపై పోశారు. గట్టి మట్టిని తెచ్చి పోయాలి. కానీ అలా చేయలేదు. దీంతో కాలువల పక్కన భారీగా గుంతలు చేరాయి.

బీక్యాతండా సమీపంలో కాలువలపై పోసిన మట్టిని రోలింగ్‌తో చదును చేయాల్సి ఉంది. కానీ చేయలేదు.

రామలక్ష్మీపురం ప్రాంతంలో రోలింగ్ చేయకపోవడంతో చిన్నపాటి వర్షానికే కట్టలపై పోసిన మట్టి జారిపోతోంది. జారిన మట్టి కాలువల్లో పడి మళ్లీ యథాస్థితికి చేరుతోంది.



రోలింగ్ లేకపోవడంతో కాలువలోకి జారుతున్న మట్టి

బీక్యాతండా నుంచి హుజూర్‌నగర్ మధ్యలో మేజర్ కాలువపై రహదారి నిర్మించాల్సి ఉంది. ఇంతవరకూ ఈ పనులు ప్రారంభం కానేలేదు.

సీసీ లైనింగ్ పనులకు కాకుండా కాలువ కట్టలు, ఎర్త్ పనులకే ప్రాధాన్యమిస్తున్నారు. చేయని పనులకు కూడా చేసినట్లు బిల్లులు చేయించుకునేందుకు ఇదే సరైన మార్గమని భావించి అందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

తూతూమంత్రంగా పనులు

వై.వీరాంజనేయులు, రైతు సంఘం నాయకుడు

సాగర్ కాల్వల పరిధిలో మరమ్మతులకు రూ. కోట్లు మంజూరైన తూతూమంత్రంగా పనులు చేపట్టి నిధులు స్వాహా చేయడం పరిపాటిగా మారింది. వేసవిలో కాకుండా వర్షాకాలం, కాల్వలకు నీరు విడుదల చేసే సమయంలో హడావుడిగా పనులు చేపట్టి నిధుల స్వాహా చేస్తున్నారు. కొమరబండ మేజర్ కాల్వ పరిధిలో పొక్లెయిన్‌తో కాల్వ కట్టను సరిచేసి, కంప చెట్లను తొలగించారు. ఎక్కడా సిమెంటు పనులు చేపట్టలేదు. గండ్లుకూడా పూడ్చలేదు. అధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేసి చివరి ఆయకట్టుకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలి.

అక్రమాలకు తావు లేకుండా చూస్తున్నాం

– యలమందయ్య, డీఈఈ, ఎన్నెస్పీ

సాగర్ కాల్వల ఆధునీకరణ పనుల్లో అక్రమాలకు తావులేకుండా చూస్తున్నాం. పనులను సిబ్బంది ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. లోపాలుంటే సూచనలు చేసి మళ్లీ చేసేలా చూస్తాం. గణపవరం మేజర్‌లో గతంలో చేసిన పనులకు ఎలాంటి బిల్లులు చెల్లించలేదు. ఇప్పుడు సక్రమంగా చేస్తున్నాం. కాలువ కట్టల వెంట మట్టిని తవ్వి కట్టలపై పోస్తున్న విషయాన్ని పరిశీలిస్తాం. కట్టలపై రోలింగ్‌ను చేసేలా చర్యలు తీసుకుంటాం.



హుజూర్‌నగర్‌లో హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ తోటి కళాకారులతో ప్రదర్శన (పాతచిత్రం)



పోతనామాత్యుడులో దొంతగాని (మధ్యలో ఉన్న వ్యక్తి)

విరామం విశ్రాంతి లేదు

అలుపెరగని కళాకారుడు దొంతగాని

అయిదు దశాబ్దాలుగా కళారంగంలో సేవలు

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: అయిదు దశాబ్దాలుగా కళా రంగంలో.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనేక వేదికలపై ఆయన చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నవే.. ప్రజా చైతన్యం కల్పించి నిజాం రాక్షస పాలనను అంతమొందించటానికి గజ్జ కట్టి ఆడి, పాడి అనేక ప్రదర్శనలు ఇచ్చారు.. ప్రజానాట్యమండలి సహచర్యంతో మొదలైన ఆయన కళాప్రస్థానం అయిదు దశాబ్దాలుగా కొనసాగుతూనే ఉంది. ప్రజాకవి వంగపండు రాసిన భూ బాగోతం నృత్య నాటికను నల్గొండ, ఖమ్మం, కృష్ణా, గుంటూరు, మహబూబ్‌నగర్, హైదరాబాద్ జిల్లాల్లో 2 వేల ప్రదర్శనలు ఇచ్చిన బృందంలో కీలక పాత్ర ఆయనదే... ఎన్నో అవార్డులు.. మరెన్నో ప్రశంసలు వరించాయి. ఇప్పటికీ వర్ధమాన కళాకారులను ప్రోత్సహిస్తున్నారు.. కళలు సామాజిక ప్రయోజనం, ప్రగతి కోసం అంటూ కృషి చేస్తున్న అలుపెరుగని కళాకారుడు దొంతగాని సత్యనారాయణ. హుజూర్‌నగర్‌కు చెందిన సత్యనారాయణను అందరూ దొంతగాని గానే పిలుస్తుంటారు. తాజాగా ఆయనకు ప్రజానాట్యమండలి జిల్లా గౌరవ అధ్యక్ష పదవి ఇచ్చి ఆయన కళారంగానికి చేసిన సేవలను గౌరవించారు.

ఏ వేషమేసినా...

1968లో హుజూర్‌నగర్‌లో ప్రదర్శించిన పరవర్తన నాటిక ద్వారా ఆయన తన కళా ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఇక వెనుదిరిగి చూడలేదు. దీనికితోడు ప్రజానాట్యమండలి అనుబంధం ఆయనను ప్రజాజీవితంలో కళాకారుడిగా నిలబెట్టింది.

30 నాటకాలలో వేషాలు వేసి ప్రదర్శనలు ఇచ్చారు.

42 నాటికలలో తనదైన శైలిలో నటించి ప్రశంసలు అందుకున్నారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఒక్క భూ బాగోతం నృత్య నాటకాన్నే దాదాపు 2వేలకు పైగా ప్రదర్శించారు.

గొల్ల సుద్దులు, జానపద నృత్యాలలో ఆయన దిట్ట.

రాష్ట్రంలో వివిధ ప్రాంతాలలో దాదాపు 50 నాటకాలకు దర్శకత్వం వహించారు.

ఆరు నాటికలను స్వయంగా రచించి, దర్శకత్వం వహించి నటించారు.

హుజూర్‌నగర్‌లో 1985 నుంచి 1988 వరకు రాష్ట్ర స్థాయి సాంస్కృతిక పోటీలు నిర్వహించి అనేక మంది రాష్ట్రస్థాయి కళాకారులను జిల్లా ప్రజలకు పరిచయం చేసిన ఘనత దొంతగానిదే.

ఎందరో కళాకారులకు గురువుగా..

శ్రీలలితా కళానాట్యమండలి, అంబేడ్కర్ లైన్స్‌యూత్, ఇండియన్ డ్యాన్స్ అకాడమి, వైఎంసీఏ సంస్థల ఆధ్వర్యంలో ఎందరో వర్ధమాన కళాకారులకు శిక్షణ ఇచ్చారు.

హుజూర్‌నగర్ హోప్ కల్చరల్ అసోసియేషన్ స్థాపించి ప్రదర్శనలు ఇచ్చారు.

ఇప్పటికీ పలు పర్వదినాలలో పౌరాణిక ప్రదర్శనలు ఇచ్చి పట్టణ ప్రజల మన్ననలు పొందుతున్నారు.

రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం స్థాపించి వారి సంక్షేమానికి కృషి చేస్తున్నారు.

నియోజకవర్గ కళాకారుల సమాచారంతో ఒక ప్రత్యేక సంచిక (సావనీర్) ప్రచురించి ప్రముఖ దర్శకుడు శంకర్‌తో కలిసి ఆవిష్కరించారు.

సినిమా రంగంలో..

అయ్యప్ప మహిమలు సినిమాలో(విడుదలైంది) నటించారు.

విడుదలకు సిద్ధంగా ఉన్న, కొన్ని షూటింగ్‌లు నడుస్తున్న సినిమాలు త్యాగాల వీణ, అతను వస్తున్నాడు, నేటి సీత, రామాతాదేవి మహత్యం, పేర్లు ఖరారు చేయని మరో రెండు సినిమాలలో నటిస్తున్నారు.

పోతనామాత్యుడు టెలిఫిల్మ్‌లోనూ నటించారు.



తాను నటించిన సినిమాకు డబ్బింగ్ చెబుతున్న దొంతగాని సత్యనారాయణ

'యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం' అనే నినాదాన్ని స్ఫూర్తిగా తీసుకొని యోగా విద్యలో ప్రతిభను చాటుతున్నారు రామన్నపేటలోని ఎస్సీ బాలుర వసతి గృహ సంక్షేమ అధికారి రెమిడాల భిక్షం. ఉద్యోగిగా విధులు నిర్వహిస్తూనే ఖాళీ సమయాన్ని వృథా చేయకుండా యోగా సాధనపై దృష్టి సారించారు. దశాబ్దకాలం క్రితం శిక్షణ పొంది తాను నేర్చుకున్న యోగాసనాలను పదిమందికి నేర్పించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. తాను పనిచేస్తున్న వసతి గృహంలో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో పాల్గొని విజయం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. -రామన్నపేట, న్యూస్‌టుడే:

ఆసనం.. ఆరోగ్యం

యోగాలో ప్రతిభ చాటుతున్న రెమిడాల భిక్షం

సెప్టెంబరులో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



మయూర ఆసనం చేస్తున్న రెమిడాల భిక్షం

ప్రస్తుతం మారిన ఆహారపు అలవాట్లు, జీవన విధానం మనిషి శరీరంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. కేవలం ఇరవై ఏళ్ల వయస్సులోనే ఆరుపదుల వయస్సు వారి మాదిరిగా అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్న తరుణంలో సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా యోగా సాధనపై దృష్టి సారించానంటారు భిక్షం. యోగా విద్యపై ఆసక్తితో దశాబ్ద కాలం క్రితమే నల్లగొండలోని యోగా భారత్‌లో శివ పర్యవేక్షణలో ప్రత్యేక శిక్షణ పొందారు. సూర్య నమస్కారాలు, ఇతర యోగాసనాలు, ధ్యానంలో ప్రావీణ్యం సాధించారు. ప్రతి రోజు ఇంటి వద్ద నిరంతరం సాధన కొనసాగిస్తున్నారాయన.



రామన్నపేటలోని వసతి గృహ విద్యార్థులకు యోగాలో శిక్షణ ఇస్తున్న భిక్షం

విద్యార్థులకు శిక్షణ..

విద్యార్థి దశలోనే యోగా విద్యపై అవగాహన కల్పిస్తే వారు సంపూర్ణ ఆరోగ్య వంతులవుతారని గుర్తించిన భిక్షం తాను పనిచేస్తున్న వసతి గృహంలో రోజూ విద్యార్థులకు యోగాపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. వివిధ రకాల ఆసనాలు, ధ్యానంపై శిక్షణ ఇస్తున్నారు. రోజూ ఉదయం 5గంటల నుంచి 6గంటల వరకు విద్యార్థులు యోగ సాధన చేస్తుంటారు. ఇలా ఇప్పటి వరకు 200 మంది వరకు విద్యార్థులకు శిక్షణ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

జాతీయ పోటీలకు ఎంపిక....

నల్లగొండలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో రెమిడాల భిక్షం పాల్గొని ప్రతిభను చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. హైదరాబాద్‌లో జులై 28న జరిగిన రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొని మెరుగైన ప్రదర్శనతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ పోటీలు మహారాష్ట్రలోని నాసిక్‌లో సెప్టెంబరు 1, 2, 3 తేదీలలో జరుగనున్నాయి.

సంపూర్ణ ఆరోగ్యానికి యోగా అవసరం

–రెమిడాల భిక్షం, ఎస్సీ బాలుర వసతిగృహ సంక్షేమ అధికారి, రామన్నపేట

ప్రస్తుతం మనిషి జీవనం యాంత్రికంగా మారింది. శారీరకంగా శ్రమ లేకపోవటం, ఆహారం అలవాట్లు చాలామందిని అనారోగ్యానికి గురిచేస్తున్నాయి. ఇలాంటి సమస్యల నుంచి విముక్తి కల్పించటానికి యోగా సాధన చేయటం తప్పనిసరి. ఆసక్తి గలవారికి శిక్షణ ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నాను. ప్రస్తుతం మా వసతి గృహంలో యోగా శిక్షణ కార్యక్రమం కొనసాగుతోంది.



రాష్ట్ర స్థాయి పోటీలలో గెలుపు ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న భిక్షం

బిల్యానాయక్‌తండా..

కూరగాయల సాగే వారికి అండ

ఊరంతా జీవనోపాధికి ఎంచుకున్న మార్గం ఇదే

ఆకు కూరలతో ఏడాది పొడవునా ఆదాయం | దశాబ్దాలుగా కరవు ఎరుగని గ్రామం

మఠంపల్లి, న్యూస్‌టుడే: దశాబ్దాలుగా ఆ గ్రామంలో రైతులు కూరగాయలనే సాగు చేస్తున్నారు. ప్రతి కుటుంబంలో కనీసం ఎకరం భూమిలోనైనా వివిధ రకాల ఆకు కూరలతో పాటు అన్ని రకాల కూరగాయలను పండిస్తారు. ఏడాది పొడవునా తమకు జీవనోపాధి చూపే పంట ఇదేనని చెబుతారు. ఎన్నెస్పీ కాల్వల చివరి భూములు కావడంతో ఎక్కువ శాతం బావులు, బోర్ల ద్వారా 10 రకాలకు పైగా ఆకు కూరలు, కూరగాయలు పండించి పరిసర గ్రామాల్లోనే సైకిళ్లు, ద్విచక్ర వాహనాలపై తిరిగి అమ్ముకుంటారు. గిట్టుబాటు ధరలు ఉంటేనే సమీప పట్టణాల్లోని మార్కెట్లకు తరలిస్తారు. మరో విశేషమేంటంటే ఈ గ్రామ పంచాయతి పరిధిలోని 10వరకు ఉన్న ఆవాస గ్రామల్లోనూ అధిక శాతం కూరగాయల సాగే చేపడతారు.



గ్రామస్థులు సాగు చేసిన గోంగూర



బీర సాగు

ఇదీ సాగు నేపథ్యం

సుమారు 3,600 జనాభా, 12 వందల వరకు ఇళ్లు ఉన్న బిల్యానాయక్‌తండాలో సగానికి పైగా కుటుంబాలు మూడొందల ఎకరాల్లో కూరగాయలు, ఆకు కూరలు పండిస్తారు. సగటున ఎకరానికి రూ.20వేలు నుంచి రూ.25వేలు పెట్టుబడి పెట్టి సంవత్సరాంతం వరకు రూ.50వేల నుంచి రూ.60వేలు ఆదాయాన్ని గడిస్తారు. కలుపులు తీయడం, కాయలు తెంచడం వంటి పనులు సొంతంగా చేసుకోవడంతో పాటు మరికొంత మందికి ఉపాధి చూపుతారు. ప్రతి రైతు ఎకరం భూమిని రెండు భాగాలుగా చేసి ఏడాది పొడవునా కాలానికి తగినట్లు పాలకూర, చుక్కకూర, బచ్చలకూర, తోటకూర, మెంతి కూర, గోంగూర, పుదినా, కొతిమేర వంటి ఆకు కూరలు, బెండ, బీర, దోస, టమాటా, గోరుచిక్కుడు, వంకాయ, కాకర, సొర, జ్వాల మిరప తదితర కూరగాయలు పండిస్తారు. ఉదయం పరిసర గ్రామాల్లో తిరిగి వాటిని అమ్ముకుంటారు. రోజు రూ.400 నుంచి రూ.500 వరకు లాభాలు ఆర్జిస్తారు.

జీవనోపాధికి లోటుండదు.. –బాణోతు శివ, రైతు



అర ఎకరంలో కూరగాయలు, ఆకు కూరలు సాగు చేశాను. పరిసర గ్రామాల్లో వీటిని అమ్మడం ద్వారా రోజుకు రూ.500వరకు ఆదాయం ఉంటుంది. ప్రస్తుతం బెండ, బీర, గంగూర, తోటకూర, బచ్చలికూర, వంగ పంటకు వచ్చాయి. దాదాపు ఆర్నెల్లు వీటితో కుటుంబం గడుస్తుంది. మరో అరెకరంలో వివిధ రకాల కూరగాయలు, ఆకు కూరల విత్తనాలు వేశాను. వేసవి కాలం వరకు జీవనానికి ఇబ్బంది ఉండదు. ఇక్కడి వేములూరి వాగుపై ఎత్తిపోతల నిర్మిస్తే బోర్లు, బావులపై ఆధారపడాల్సిన అవసరం ఉండదు.

సంవత్సరం పొడవునా ఆదాయం..

–బాణోతు సైద, రైతు



కూరగాయల సాగుతో సంవత్సరం పొడవునా ఆదాయం ఉంటుంది. నిత్యం చేతిలో డబ్బులు ఉంటాయి. గిట్టుబాటు ధరలు ఉంటే సమీప మార్కెట్‌కు, లేకుంటే గ్రామాల్లోనే తిరిగి అమ్ముకుంటాం. శ్రమ పడినా ఫలితం ఉంటుంది. కష్టపడి కూరగాయలు పండించుకునే వారికి కుటుంబ పోషణకు ఇబ్బంది ఉండదు. బావి కింద అర ఎకరంలో ఆకు కూరలు, బెండ, దోస వంటి కూరగాయలు పండిస్తున్నాను. తిండి గింజల కోసం కొంత భూమిలో వరి వేసుకుంటాను. కూరగాయలే ప్రధాన జీవనాధారం.

అధిక శాతం కూరగాయల సాగే..

–ధీరావత్ నాగమణి, సర్పంచి



మా గ్రామంలో ఎక్కువ మంది రైతులు కూరగాయలనే పండిస్తారు. దశాబ్దాలుగా ఇక్కడి రైతులు ఆకు కూరల సాగుపైనే దృష్టి సారిస్తున్నారు. సంవత్సరమంతా ఆదాయం ఉండటంతో గ్రామంలో కరవు ఛాయలు కనిపించవు. స్థానికులకు కూలీ పనులు దొరుకుతాయి. గతంలో క్యారెట్, క్యాబేజీ, కాలీఫ్లవర్ వంటివి సాగు చేసినా గిట్టుబాటు ధరలు లభించక ప్రస్తుతం వాటిని పండించడం లేదు. ఈ యేడాది కొంతమంది వీటిని పండించేందుకు మొగ్గు చూపుతున్నారు.

కేవలం విద్యా బోధనతోనే కళాశాల బాధ్యత పూర్తి కాదు.. వివిధ పోటీ పరీక్షలను ఎదుర్కొనేలా విద్యార్థులకు తర్ఫీదునివ్వాలి.. కలెక్టర్ సురేంద్రమోహన్ మార్గదర్శకత్వంలో కేఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు ఉచిత పోటీ పరీక్షల శిక్షణ ఇస్తున్నారు.. టీఎస్‌పీఎస్‌సీ నిర్వహించే పరీక్షలపై తర్ఫీదు ఇచ్చేందుకు రాష్ట్రంలోనే మొదటి సారిగా శిక్షణ కేంద్రాన్ని కోదాడలో ఏర్పాటు చేశారు.. 14 అంశాలను ఎంచుకుని 90 రోజుల్లో 270 తరగతులు బోధించాలని లక్ష్యంగా నిర్ణయించారు.. ఉచిత స్టడీ మెటీరియల్ అందజేస్తున్నారు. అన్ని రకాల పబ్లికేషన్లతో కూడిన మినీ గ్రంథాలయానికి మంత్రి జగదీష్‌రెడ్డి తన తల్లి జ్ఞాపకార్థం పుస్తకాలు సమకూర్చారు.. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు రూ.45వేల విలువ చేసే ఉచిత పుస్తకాలను అందించనున్నారు. విద్యార్థులకు ఉచిత బస్సుపాస్ సౌకర్యం కోసం రూ.1.48లక్షలు మంజూరు చేశారు. శిక్షణలో భాగంగా ప్రతి వారం, ప్రతినెల నమూనా పరీక్ష నిర్వహిస్తున్నారు. నల్గొండ, హైదరాబాద్, సూర్యాపేట, కోదాడ, వరంగల్ ప్రాంతాలకు చెందిన నిపుణులు శిక్షణలో భాగస్వాములు అవుతున్నారు.

-కోదాడ పట్టణం, న్యూస్‌టుడే



శిక్షణ కేంద్రంలో మాట్లాడుతున్న కలెక్టర్ సురేంద్రమోహన్ (పాతచిత్రం)

విజేతలుగా నిలవాలి విద్యార్థులు

నిరుద్యోగులకు అండగా నిలుస్తున్న కేఆర్ఆర్ డిగ్రీ కళాశాల

రాష్ట్రంలోనే మొదటిసారిగా పోటీపరీక్షలకు ఉచిత శిక్షణ

కేఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో బీఏ తృతీయ సంవత్సరం చదువుతున్న సురేష్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిర్వహించిన క్విజ్ పోటీల్లో ప్రథమ బహుమతి సాధించారు. కానీ కమిషనర్ అందించిన ధ్రువ పత్రంలో కలెక్టర్ సంతకం లేకపోవడంతో కళాశాల ప్రిన్సిపల్ అర్వపల్లి శంకర్‌తో కలిసి రెండు నెలల క్రితం కలెక్టర్ కార్యాలయానికి సురేష్ వెళ్లారు. అక్కడ సురేష్ కుటుంబ పరిస్థితిని కలెక్టర్ సురేంద్రమోహన్ అడిగి తెలుసుకున్నారు. తన తల్లిదండ్రులు రాడ్ బెండింగ్ పనులు చేస్తారని.. సెలవు దినాల్లో నేను ఆ పని చేస్తేనే కుటుంబం గడుస్తుందని సురేష్ చెప్పారు.. డిగ్రీ తర్వాత ఏం చేస్తావని ప్రశ్నిస్తే రాడ్‌బెండింగ్ పనులు చేస్తానని బదులిచ్చారు.. దీంతో కలెక్టర్‌కు ఓ ఆలోచన వచ్చింది.. మీ కళాశాలలో టీఎస్‌పీఎస్సీ పోటీ పరీక్ష శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని ప్రిన్సిపల్‌కు కలెక్టర్ హామీ ఇచ్చారు. శిక్షణకు అయ్యే ఖర్చు భరిస్తానని తెలిపారు. 15 రోజుల్లో ప్రణాళిక, ప్రతిపాదనలు రూపొందించి కలెక్టర్‌కు పంపించారు. కోదాడలోని కేఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో ఉచిత పోటీ పరీక్షల శిక్షణ కేంద్రం జులై 17న ప్రారంభమైంది.

ఎంపిక విధానం ఇలా..

ఉచిత శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసిన విషయం నిరుద్యోగులకు తెలిసింది. 360 మందికి ప్రవేశపరీక్ష నిర్వహించి 100 మందిని మాత్రమే ఎంపిక చేశారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఉచితంగా బస్సు పాస్ సౌకర్యం కల్పించారు. 90 రోజుల పాటు కొనసాగే శిక్షణకు సరిపడే అన్ని సౌకర్యాలు కలెక్టర్ కల్పించారు. మంత్రి జగదీష్‌రెడ్డి తన తల్లి జ్ఞాపకార్థం పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను కళాశాల గ్రంథాయానికి సమకూర్చారు. కేంద్రానికి కలెక్టర్ తన క్రూసియల్ బ్యాలెన్సింగ్ నిధుల నుంచి రూ.2,67, 820 మంజూరు చేశారు. రూ.65 వేల విలువైన పోటీ పరీక్షల పుస్తకాలను అందజేశారు.



గ్రంథాలయంలో చదువుకుంటున్న విద్యార్థులు

పేదలకు ఉపయోగకరం..


–లక్ష్మీనారాయణ, శోభనాద్రిగూడెం



కోదాడ పట్టణంలో ఉచిత శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయటం వల్ల పేద విద్యార్థులు, నిరుద్యోగులకు మేలు జరుగుతుంది. పోటీ పరీక్షలకు కావాల్సిన పుస్తకాలనూ అందుబాటులో ఉన్నాయి. శిక్షణను సద్వినియోగం చేసుకుంటాం. ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించేందుకు నిరంతరం కృషి చేస్తాను.

కలెక్టర్ చొరవ అభినందనీయం..

–గూడెపు వెంకటనారాయణ, బూరుగడ్డ



శిక్షణ కోసం దూర ప్రాంతాలకు వెళ్లకుండా మేం నివసించే ప్రాంతాలకు దగ్గరగా కేంద్రాన్ని కలెక్టర్ సురేంద్రమోహన్ ఏర్పాటు చేయటం అభినందనీయం. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఉచితంగా బస్సు పాసుసౌకర్యం కల్పించటం వల్ల ఎంతోమందికి ప్రయోజనం చేకూరుతోంది.

నైపుణ్యం కలిగిన శిక్షకులతో కూడిన బోధన..

–లీలా, కూచిపూడి



వివిధ ప్రాంతాల నుంచి నైపుణ్యం కలిగిన శిక్షకులను తీసుకరావడం వల్ల మాకు అన్నీ పాఠ్యాంశాలు అవలీలగా అర్థమవుతున్నాయి. వేల రూపాయలు ఖర్చు చేసి నగరాల్లో శిక్షణ తీసుకోవటం కంటే ఇక్కడ మెరుగైన శిక్షణను అందిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగం సాధించి పలువురికి ఆదర్శంగా నిలుస్తాను.

ఉచిత బస్సు పాసులు నిరుద్యోగులకు వరం..


–లక్ష్మి, అనంతగిరి



శిక్షణ సమయంలో ఉచిత బస్‌పాస్ సౌకర్యం, ఉచితంగా స్టడీ మెటీరియల్, గ్రంథాలయ వసతి కల్పించడంతో ఆర్థికంగా ఎంతో మేలు జరుగుతుంది. నిరుపేదలకు ఇది గొప్ప వరం. శిక్షణలో ఎల్‌సీడీ ప్రొజెక్టర్లతో అర్థమయ్యే రీతిలో బోధన సాగటం వల్ల మాలో నూతన ఉత్సాహం కలుగుతుంది. ఇలాంటి శిక్షణను ఏర్పాటు చేసిన కలెక్టర్, ప్రిన్సిపల్‌కు కృతజ్ఞతలు.

14 అంశాల్లో శిక్షణ..

–రావిరాల నరేష్, శిక్షణ కేంద్రం సమన్వయకర్త



కేఆర్ఆర్ కళాశాలలో వివిధ పోటీ పరీక్షల కోసం ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణ శిబిరానికి అన్ని రకాల విద్యార్థులు హాజరవుతారు. 14 అంశాలను గుర్తించి శిక్షణ ఇస్తున్నాం. టీఎస్‌పీఎస్సీ పోటీ పరీక్షలకు సంబంధించి విద్యార్థులను మెరికల్లా తీర్చిదిద్దుతాం. వీలైనంత ఎక్కువ మంది విజేతలుగా నిలిచేందుకు అహరహం శ్రమిస్తాం.

గర్వకారణం..

–అర్వపల్లి శంకర్, కళాశాల ప్రిన్సిపల్



ఉచిత పోటీ పరీక్షల శిక్షణ కేంద్రాన్ని మా కళాశాలకు ఇవ్వడం గర్వకారణం. కలెక్టర్ సురేంద్రమోహన్ మాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం. కోదాడ పట్టణానికి 30- 40 కి.మీ. దూరం నుంచి పేద విద్యార్థులు ఈ శిక్షణ శిబిరానికి హాజరవుతున్నారు. కలెక్టర్ సహకారంతో పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపటమే మా లక్ష్యం.


నిలిచిన ఎస్‌ఎల్‌బీసీ బహిరంగ కాల్వ పనులు

నిధులు దండి..
పనులు మొండి

సమీపిస్తున్న గడువు త్వరితగతిన ముందుకు సాగని భూసేకరణ ప్రక్రియ

నెలరోజులుగా నిలిచిన ఎస్‌ఎల్‌బీసీ బహిరంగ కాల్వ పనులు

నల్గొండ జిల్లాలోని భూములను సస్య శ్యామలం చేసేందుకు, జంట నగరాల తాగునీటి అవసరాలు తీర్చేందుకు మూడుదశాబ్దాల కల శ్రీశైలం ఎడమ గట్టు కాల్వ సొరంగ మార్గ పథకం(ఎస్‌ఎల్‌బీసీ) పనులు మూడడుగులు ముందుకు ఆరడుగులు వెనక్కు అన్న చందంగా కొనసాగుతున్నాయి. పథకం పూర్తికి భూసేకరణ ప్రధాన సమస్యగా మారడంతో ప్రాజెక్టు ఎప్పటికిపూర్తవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. పనులు ప్రారంభమై దశాబ్దకాలం గడిచినా ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణలో అధికారగణం పూర్తిగా విఫలమైంది.

పెద్దఅడిశర్లపల్లి, న్యూస్‌టుడే:

జలయజ్ఞంలో భాగంగా 2006లో అప్పటి ప్రభుత్వం రూ. 1,925 కోట్లతో ఎస్‌ఎల్‌బీసీ (సొరంగమార్గం) పనులకు శ్రీకారం చుట్టింది. సొరంగమార్గంతో పాటు అనతికాలంలోనే నక్కలగండి, పెండ్లిపాకల జలాశయాలు, బహిరంగ కాల్వ పనులు ప్రారంభమైనా భూసేకరణ సమస్యతో సకాలంలో ముందుకు సాగడంలేదు. ముఖ్యంగా సొరంగ మార్గం నుంచి వచ్చేనీటిని జీరో పాయింట్ నుంచి 24.095 కిలోమీటర్ల దూరం వరకు చేరవేసే బహిరంగ కాల్వ, పెండ్లిపాకల జలాశయాలకు భూసేకరణ ప్రధాన సమస్యగా మారింది. ఈ కాల్వ నిర్మాణం, పెండ్లిపాకల జలాశయం సామర్థ్యం పెంచేందుకు తెలంగాణ ప్రభుత్వం 2014 అక్టోబరులో రూ. 343.35 కోట్లతో టెండర్ల ప్రక్రియను పూర్తిచేసి ఏజెన్సీతో 2017 అక్టోబర్ 15 నాటికి పనిని పూర్తిచేసేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. కానీ, ఇందుకు అవసరమైన భూసేకరణను విస్మరించడంతో లక్ష్యం నెరవేరడం కష్టంగా మారింది. 34 నెలల్లో ఏజెన్సీ కేవలం 30 నుంచి 33 శాతమే పూర్తిచేసినట్లు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. ఈ ప్యాకేజీ పరిధిలో 2,353 ఎకరాలు సేకరించాల్సి ఉండగా ఇప్పటికి కేవలం 928 ఎకరాలు మాత్రమే సేకరించారు. దేవరకొండ మండలం గాజీనగర్‌లో 509 ఎకరాలు, షాకేల్లిలో 226, పీఏపల్లిలో 479, నేరెడుగొమ్ములో 226, పెండ్లిపాకల, దోనియాల, చింతకుంట్ల, నేరెడుగొమ్ములలో గతంలో నష్టపరిహారం మంజూరైనా రైతులు అంగీకరించని 80 ఎకరాలతో మొత్తం 1425 ఎకరాలు సేకరించాల్సి ఉంది. ప్రారంభంలో సేకరించిన భూములకు తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన 123 జీవో ప్రకారం నష్టపరిహారం చెల్లించారు. కానీ, మిగిలిన రైతులు ఈ జీవో ప్రకారం చెల్లించే నష్టపరిహారానికి అంగీకరించకపోవడంతో సేకరణ త్వరితగతిన ముందుకు సాగడంలేదు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం భూములకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

నెలరోజులుగా నిలిచిన పనులు

భూసేకరణ సమస్యతో పనులు నత్తనడకన చేపట్టిన ఏజెన్సీ ఇటీవల గత నెలరోజులుగా చేతులెత్తేసింది. జులై 23 నుంచి పనులు చేపట్టే అన్ని శిబిరాలను మూసివేసింది. దీంతో కాల్వ పనులు ముందుకు సాగడంలేదు. భూసేకరణ కొలిక్కి వస్తే తప్ప పనులు సజావుగా ముందుకు సాగే పరిస్థితులు కనిపించడంలేదు. మరో రెండునెలలు గడిస్తే ఏజెన్సీ ఒప్పదం గడువూ ముగుస్తుండటంతో ఈ బహిరంగ కాల్వపనుల పురోగతి ప్రశ్నార్థకంగా మారింది. పనులు నత్తనడకన చేపడుతున్నందుకు సంబంధిత ఏజెన్సీకి అధికారులు ఇప్పటికి ఎనిమిది సార్లు నోటీసులూ అందించారు. భూసేకరణ చేపట్టిన భూములలో సిమెంటు నిర్మాణం, ఇతర పనులు చేపట్టాలని సూచించినా ఏజెన్సీ ముందుకు రావడంలేదని తెలుస్తోంది.

కౌలు దక్కక ఆందోళనలో రైతులు

కాల్వ కోసం భూములిచ్చిన రైతులు ఆందోళనలో పడ్డారు. గత మూడేళ్లక్రితం ప్రారంభమైన కాల్వ పరిధిలో చింతకుంట్ల, పీఏపల్లి రెవెన్యూ గ్రామాల పరిధిలోని రైతులకు అధికారులు, ఏజెన్సీలు నచ్చజెప్పి త్వరితగతిన నష్టపరిహారం ఇప్పిస్తామనడంతో వారు పనులు చేపట్టేందుకు అంగీకరించారు. వీరికి రెండేళ్లపాటు ఏజెన్సీ కౌలూ చెల్లించింది. గత ఏడాదిగా ఇదీ ఇవ్వడంలేదు. ఇప్పటికీ మూడేళ్లు సమీపిస్తున్నా ఇంకా నష్టపరిహారం రాకపోవడంతో రైతులు దిక్కుతోచనిస్థితిలో పడ్డారు. వీరు కనిపించిన అధికారులందరికీ సమస్యను విన్నవించినా అదిగోవచ్చే ఇదిగోవచ్చే సమాధానాలు తప్ప త్వరితగతిన నష్టపరిహారం ఇప్పించే నాథుడు కరవయ్యాడని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


పీఏపల్లి సమీపంలో సేకరించాల్సిన భూములు

రెండేళ్ల క్రితం తవ్వినా రూపాయి రాలేదు



–కొర్ర రాములు, కొర్రోనితండా

మా నలుగురన్నదమ్ములకున్న పదెకరాల భూములలో రెండేళ్ల క్రితం ఎస్‌ఎల్‌బీసీ కాల్వ తవ్వారు. ఇప్పటికీ నష్టపరిహారం చెల్లించలేదు. అధికారులు వస్తున్నారు.. సర్వేలు చేస్తున్నారు.. అదిగోవచ్చే ఇదిగో వచ్చే అంటూ మాటాలు చెబుతున్నారు. తప్ప మా భూములకు పరిహారం చెల్లించడంలేదు. నమ్ముకున్న భూమి పోవడంతో పొట్టకూటికి ఏమిచేయాలో దిక్కుతోచడంలేదు.

ముప్పైఆరు ఎకరాలు కోల్పోయాం

–మేఘావత్ లస్కర్, బాలాజీనగర్



మా కుటుంబానికి చెందిన నలుగురన్నదమ్ములకు చెందిన 36 ఎకరాలు కాల్వలో కోల్పోయాం. ఇప్పటివరకూ నష్టపరిహారానికి సంబంధించి అధికారుల నుంచి స్పందన కొరవడింది. ఇప్పటి వరకు ఏ జీవో ప్రకారం చెల్లిస్తారో స్పష్టతలేదు. ఎలాంటి నోటీసులూ ఇవ్వలేదు. మాప్రాంతంలో ఏడాదిక్రితం గుత్తేదారు పనులు నిలిపివేసి శిబిరం ఎత్తేశాడు. పనులు నడిస్తేనన్న డబ్బులు తొందరగా వస్తాయన్న నమ్మకం, పనులు ఆగిపోవడంతో డబ్బులు ఎప్పుడువస్తాయో తెలియని పరిస్థితి నెలకొంది.

భూసేకరణ పూర్తికి చర్యలు తీసుకుంటున్నాం

–జి.లింగ్యానాయక్, ఆర్డీవో, దేవరకొండ



ఎస్‌ఎల్‌బీసీ బహిరంగ కాల్వ, పెండ్లిపాకల జలాశయాల పరిధిలో చేపట్టాల్సిన భూసేకరణ ప్రక్రియ త్వరితగతిన పూర్తిచేసేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నాం. ఇటీవల ప్రాథమిక ప్రకటన(నోటిఫికేషన్) విడుదల చేశాం. త్వరలో ఫారం-డీ ప్రకటననూ జారీచేసి రైతుల నుంచి అంగీకారం తీసుకోవాల్సి ఉంది. ఈ ప్రక్రియ మూడునెలల్లో పూర్తిచేసి రైతులకు నష్టపరిహారం చెల్లిస్తాం.

కందకాల తవ్వకంతో నీటి సంరక్షణ

నామవరం(మోతె రూరల్), న్యూస్‌టుడే: వ్యవసాయ భూముల్లో కందకాలు తవ్వడం వల్ల భూగర్భ జలాలను పెంపొందించుకోవచ్చని తెలంగాణ విశ్రాంతి ఇంజినీర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్యాంసుందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని నామవరం గ్రామంలో తెలంగాణ విశ్రాంతి ఇంజినీర్ల సంఘం ఆధ్వర్యంలో వాన నీటి సంరక్షణపై గ్రామ ప్రజలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఎకరం వ్యవసాయ భూమిలో కందకం తీయడం వల్ల 28 లక్షల లీటర్ల నీటిని నిల్వ చేసుకోవచ్చన్నారు. రైతులు బోర్లు వేసే బదులు కందకాలు తీసుకుంటే తక్కువ ఖర్చుతో బోరు, బావులలో భూగర్భ జలాలు పెరిగి రైతుకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సుంకర నర్సయ్య, రమణ నాయక్, దామోదర్ రెడ్డి, సురేందర్ రెడ్డి, మల్సూర్, తదితరులు పాల్గొన్నారు.


నామవరంలో మాట్లాడుతున్న శ్యాంసుందర్‌రెడ్డి

నిత్యావసర సరకులకు బయోమెట్రిక్ తప్పనిసరి

బూరుగడ్డ(హుజూర్‌నగర్ గ్రామీణం), న్యూస్‌టుడే: చౌక ధరల దుకాణాల్లో నిత్యావసర సరకుల పంపిణీకి బయోమెట్రిక్ విధానాన్ని అక్టోబర్ నుంచి ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సంయుక్త కలెక్టర్ సంజీవరెడ్డి తెలిపారు. ఆదివారం బూరుగడ్డ ఆలయానికి వచ్చిన సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. చౌకధరల దుకాణాల ద్వారా బియ్యం కిరోసిన్, గోధుమలు అందిస్తున్నామని చెప్పారు. అంత్యోదయ, అన్నపూర్ణ కార్డులున్న వారికి పంచదార సరఫరా చేస్తున్నామన్నారు.

మౌలిక దృష్టితో రాసే ఏక పద రచనలకు ప్రజాదరణ: గోరటి వెంకన్న

రెడ్డికాలనీ(మిర్యాలగూడ), న్యూస్‌టుడే: తనదైన ఆలోచనలను మౌలిక దృష్టితో రాసే ఏకపద రచనలకు ఎల్లప్పుడూ ప్రజాదరణ లభిస్తుందని ప్రజాకవి గోరటి వెంకన్న అన్నారు. ఆదివారం మిర్యాలగూడ పట్టణానికి చెందిన కవి మోహన్‌రుషి రచించిన దిమాక్ ఖరాబ్ అనే పుస్తకాన్ని నమస్తే తెలంగాణ పత్రిక ఎడిటర్ కట్టా శేఖర్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. నేడు అనే పడవను రేపు అనే తీరానికి చేర్చేది కవిత అని, సులభతరమైన, వాడుక భాషలో రుషి చేసిన రచనలు అద్భుతంగా ఉన్నాయన్నారు. తెలంగాణ ప్రాంతంలో నల్గొండ జిల్లాకు పోరాటాల గడ్డగా పేరుండగా మిర్యాలగూడకు ఎందరో మహనీయులను ఆదరించిన గుర్తింపుందన్నారు. టెలివిజన్ చరవాణి అంతర్జాల మోజులో పడుతున్న యువత రచనలు, పుస్తక పఠనానికి ఆసక్తి చూపడం లేదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మన ఆలోచనలను మౌలిక దృష్టితో ప్రపంచానికి పరిచయం చేసేలా ఏక వాఖ్య రచనలు ఎంతో ఉపయుక్తమన్నారు. రచయిత ఎంచుకున్న పద సరళి సూటిగా నిక్కచ్చిగా వ్యంగ్యంగా సాగిందన్నారు. సమాజంలో చోటుచేసుకుంటున్న సమకాలీన రాజకీయ ప్రజా సరళిని ప్రస్ఫుటించిన తీరు పాఠకులకు సులభంగా అర్థమయ్యేలా స్వీయ అనుభవాలకు చాలా దగ్గరగా ఉందన్నారు. ప్రముఖ కార్టూనిస్ట్ శంకర్ మాట్లాడుతూ వ్యంగ్య చిత్రాల ద్వారా ప్రజాభిమానం పొందే కార్టూనిస్టుల మనసు దోచుకునేలా రాసిన వ్యంగ్యమైన ఏక పద వాక్యాలు మనసును హత్తుకునేలా ఉన్నాయన్నారు. సామాజిక బాధ్యత అందరికి ఉండాలి, కవులకు ఉండాలంటూ ఆయన చేసిన రచన ప్రజాభిమానం పొందాలని సమాజ హితం కోరే మరిన్ని రచనలు ఆవిష్కరించాలని వక్తలు ఆకాంక్షించారు. స్వార్థపూరిత విధానాలతో లోకం పోకడను ఆవిష్కరించేలా గోరటి వెంకన్న పాడిన పిట్ట పాట ఆహూతులను ఆలోచింప చేసింది. కార్యక్రమంలో యువ కేంద్రసాహితీ అకాడమి అవార్డు గ్రహీత పసునూరి రవీందర్, పి. సుబ్బారావు, నోముల సత్యనారాయణ, సూరేంద్రరాజు, కృష్ణ మూర్తి, వేనేపల్లి పాండురంగారావు, కేతెనపల్లి శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్, అశోక్, సైదులు, చేగో, మురళి తదితరులు పాల్గొన్నారు.


దిమాక్ ఖరాబ్ పుస్తకావిష్కరణ సభలో మాట్లాడుతున్న ప్రజా కవి గోరేటి వెంకన్న

ఉద్దీపన రాష్ట్రానికే ఆదర్శం: ఎమ్మెల్యే

నకిరేకల్, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో ఎల్‌కేజీ, యూకేజీ బోధన అందించే ఉద్దీపన కార్యక్రమం రాష్ట్రానికే ఆదర్శమని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం చెప్పారు. ఒక్క నియోజకవర్గంలోనే అమలవుతున్న ఈ కార్యక్రమాన్ని ఇతర ప్రాంతాల వారు అమలు చేసేందుకు ముందుకు వస్తున్నారని, వారికి తోడ్పాటు అందిస్తామన్నారు. ఆదివారం హైదరాబాద్ కర్మన్‌ఘాట్ ఆనంద్‌హాలులో ఎన్జీవో ప్రతినిధులు, ఎన్‌ఆర్ఐ ప్రతినిధులు, విద్యాశాఖ అధికారులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఇతర జిల్లాలో ఈ ఉద్దీపన అమలుకు ఎన్జీవో ప్రతినిధులు ముందుకు వస్తుండటం అభినందనీయమని ఎమ్మెల్యే చెప్పారు. సమావేశంలో ఆర్జేడీ రమేష్, నార్కట్‌పల్లి ఎంపీపీ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, కట్టంగూరు జడ్పీటీసీ సభ్యుడు మాద యాదగిరి, డైట్ అధ్యాపకుడు మంగారెడ్డి, ఎన్‌ఆర్ఐ ప్రతినిధి జి.రవిందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ప్రతినిధి తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీరేశం



అలవాట్లు మారాలి.. ఆచరణ ఉండాలి..

ఈనాడు, హైదరాబాద్

ఐటీ కొలువులు.. రెండు పదుల వయస్సులోనే ఐదంకెల జీతం.. వారాంతాల్లో రెండు రోజులు సెలవులు.. విదేశాల్లో పనిచేసే అవకాశం.. ఇవన్నీ పైకి కన్పించేవైతే.. వేళాపాళా లేని పనివేళలు.. ఎప్పటికప్పుడు మారిపోయే బాధ్యతలకు తోడు..అంతర్గత లక్ష్యాలతో తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్నారు.. తట్టుకోలేక కొందరు చిత్తవుతున్నారు.. ఇది ఉత్పాదకతపై ప్రభావం చూపుతుండటంతో ఐటీ సంస్థలు తమ ఉద్యోగులకు ఎప్పటికప్పుడు ఆరోగ్యకర జీవనశైలిపై చైతన్యం కల్పిస్తున్నాయి.

నగరంలో దాదాపు నాలుగు లక్షల మంది ఐటీ, ఐటీ ఆధారిత సంస్థల్లో పనిచేస్తున్నారు. పెద్ద కంపెనీలే కాదు.. ఎన్నో చిన్న సంస్థలూ ఇక్కడ కొలువుదీరాయి. కళాశాల చదువులు ముగియగానే ప్రాంగణ నియామకాల్లో చాలా మంది కుర్రకారు ఉద్యోగాలు సాధిస్తున్నారు. పాతికేళ్ల లోపే తాము కోరుకున్న జీవితాన్ని అనుభవిస్తున్నారు. ఈ క్రమంలో మారిన జీవనశైలితో శారీరకంగా, మానసికంగా పలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఒత్తిడి నుంచి బయటపడేందుకు వారాంతాల్లో పార్టీలతో మొదలై మత్తు పదార్థాలు తీసుకునే వరకు పరిస్థితి వెళుతోందని ప్రచారం జరుగుతోంది. కొలువుపైనే కాదు.. ఇది కుటుంబ సంబంధాలపైనా తీవ్ర ప్రభావం చూపుతోంది. బయట ఆహారం ఎక్కువగా తినడం.. ఎప్పుడంటే అప్పుడు లాగిస్తుండటం.. ఇలా ఒకదానికి ఒకటితోడై ఉద్యోగుల శారీరక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. ఇలాంటి అలవాట్ల నుంచి మంచి జీవనశైలి దిశగా అడుగులు పడేలా బడా ఐటీ సంస్థలు ఫిట్‌నెస్‌పై పలు కార్యక్రమాలను చేపడుతున్నాయి.

ఒత్తిడి.. ఆరోగ్య సమస్యల నుంచి బయటపడేందుకు మార్గమిదే

ఉద్యోగులకు జీవన కళ అలవరుస్తున్న ఐటీ సంస్థలు

ఉద్యోగులు దారుఢ్యంగా ఉండేందుకు కార్యాలయాల్లోనే వ్యాయామ కేంద్రాల ఏర్పాటు, యోగా శిక్షణ తరగతులు నిర్వహించడం, వాకింగ్ ట్రాక్ నెలకొల్పడం, సైకిల్‌పై కార్యాలయానికి వచ్చేవారికి ప్రోత్సాహకాలు అందించడం వంటివి చేస్తున్నాయి. వారాంతాల్లో నడక, పరుగుల్లో సిబ్బంది పాల్గొనేలా చొరవ చూపుతున్నాయి. నడకను ప్రోత్సహించేందుకు రోజూ ఎన్ని అడుగులు వేశారో తెలుసుకునేందుకు పెడో మీటర్లను అందిస్తున్నాయి. ఎక్కువ దూరం నడిచిన వారికి నజరానాలను ప్రకటిస్తున్నాయి. వారంలో ఒకరోజు ప్రజారవాణాను వినియోగించేలా ప్రోత్సహిస్తున్నాయి.

ఫిట్‌నెస్ క్యాలండర్.. ఇలా ఒక్కో సంస్థ తమ ఉద్యోగులు జీవనశైలి సమస్యలను దీటుగా ఎదుర్కొనేలా చర్యలు చేపడుతున్నాయి. టీసీఎస్ తమ ఉద్యోగుల కోసం ఫిట్‌నెస్ క్యాలండర్‌ను రూపొందించింది. ఐటీ ఉద్యోగులే కాదు దాదాపు ప్రతి రంగంలోని వారు.. వయస్సుతో సంబంధం లేకుండా వేర్వేరు రూపాల్లో ఒత్తిడికి గురవుతున్నారు. దీన్ని సమర్థంగా ఎదుర్కొంటూ శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండేందుకు క్యాలండర్‌లోని అంశాలు అందరూ తప్పక ఆచరించ తగ్గవే. వీటిలో చాలావరకు మనకు తెలిసినవే అయినా పాటించడంలో అలక్ష్యం ప్రదర్శిస్తుంటాం. ముఖ్యంగా మూడు పదులు దాటిన వారు కొన్ని అలవాట్లను మార్చుకోవడంతో పాటు.. మరికొన్నింటిని ఆచరణలోకి పెట్టాల్సిన తరుణం వచ్చేసింది.

1 ప్రతిరోజూ అరగంట వ్యాయామం తప్పనిసరి. నడక, పరుగు, జిమ్, యోగా.. ఇలా ఏదైనా కావొచ్చు. ఉదయాన్నే త్వరగా నిద్రలేచి వ్యాయామం చేస్తే రోజంతా ఉత్సాహంగా ఉంటుంది.



2 ఉదయం లేవగానే నీరు తాగాలి. చాలామంది అల్పాహారం తీసుకొనే వరకు నీళ్లు ముట్టుకోరు. నిత్యం 3 లీటర్లు తాగాలి. కేవలం నీళ్లే కాదు పండ్ల రసాలు, సూప్‌లు, ఆరోగ్యానికి మేలు చేసే ఇతర ద్రవాలు ఏవైనా తీసుకోవచ్చు.



3 ఆలస్యమైందని ఉదయం పూట పిల్లలు, పెద్దలు అల్పాహారం మానేసి పాఠశాల, కళాశాల, కార్యాలయాలకు వెళుతున్నారు. ఉదయం లేచాక ఎక్కువ సమయం ఖాళీ కడుపుతో ఉండటం మంచిది కాదని వైద్యులు సూచిస్తున్నారు.




4 ఉరుకులు పరుగుల నగర జీవనంలో కుటుంబ సభ్యులు కలిసి భోజనం చేయడం లేదు. రోజులో ఒక పూటైనా కలిసి భోంచేయాలి. దీంతో ఒకరితో ఒకరు మాట్లాడుకోవడానికి, బంధాల బలోపేతానికి దోహదం చేస్తాయి.




5 మన శరీరానికి కావాల్సిన విటమిన్లు, పోషకాల కోసం కాలానుగుణంగా దొరికే పండ్లను రోజుకు రెండు తినడం మేలు. ఆకలైనప్పుడు స్నాక్స్‌కు బదులు వీటిని తీసుకోవచ్చు.



6 రోజంతా ఉత్సాహంగా ఉండాలంటే తగినంత నిద్ర తప్పనిసరి. రోజులో కనీసం 7-8 గంటలు నిద్రపోవాలి. మరీ ఎక్కువైనా.. తక్కువైనా ఇబ్బందులు తప్పవు.



7 ఇంట్లో ఏసీ, కార్యాలయాల్లోనూ ఏసీ.. బయటికి రాగానే కార్లో ప్రయాణం.. కాసేపైనా ఎండలో, వెలుతురులో గడపడం లేదు. రోజులో తగినంత సేపు ఎండలో సహజ వెలుతురులో ఉండటం అవసరం.



8 పడుకునే సమయంలో కాఫీలు వంటివి తాగొద్దు. కెఫైన్, నికోటిన్ పదార్థాలు నిద్రను దూరం చేస్తాయి.



9 ఇంట్లో చేసుకునే తీరిక లేక కొందరు, నచ్చక కొందరు బయట ఆహారాన్ని ఎక్కువగా తింటున్నారు. ప్యాకేజ్డ్ ఆహారానికి ప్రాధాన్యమిస్తున్నారు. వీటికి దూరంగా ఉండాలి.



10 ఒత్తిడి నుంచి బయటపడేందుకు ఎక్కువగా కాఫీలు, టీలు తాగుతున్నారు. రోజూ ఏదైనా ఒకటి ఒకసారి మాత్రమే తాగడానికి పరిమితం కావాలి.




11 కడుపు నిండిందనే సంకేతాలు అందగానే తినడం ఆపేయాలి. రుచిగా ఉందని చాలాసార్లు ఎక్కువ తిని భుక్తాయాసంతో బాధపడుతుంటారు. ఆయాసమే కాదు.. అధిక క్యాలరీలతో బరువూ పెరుగుతారు.



12 పడుకునే సమయంలో మొబైల్ వంటి ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ దగ్గర ఉండకుండా చూసుకోవాలి. కొందరు పక్కనే పెట్టుకొంటారు. ఈ అలవాటు మంచిది కాదు.



13 క్రమంతప్పక వ్యాయామం చేస్తే సరి.. కుదరని వారు కార్యాలయాల్లో, నివాసాల్లో లిఫ్ట్‌లు కాకుండా మెట్లను ఉపయోగించాలి. ఇంట్లో చిన్నచిన్న పనులు చేయాలి.



14 రాత్రిపూట ఆలస్యంగా ఇంటికి చేరుకోవడం, నిండుగా తిని ఆ వెంటనే నిద్రకు ఉపక్రమిస్తున్నారు. పడుకోవడానికి కనీసం రెండు గంటల ముందు రాత్రి భోజనం ముగించాలి.



15 రుచిగా ఉంటాయని వేపుళ్లు ఎక్కువగా తింటున్నారు. ఈరోజు నుంచి వీటిని తిననని నియమం పెట్టుకొని పాటించాలి.



16 వేళాపాళా లేకుండా తినడం కూడా చాలారకాల ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. ఎప్పుడో ఒకసారి మినహా రోజూ ఒకే సమయానికి తినేలా చూసుకోవాలి.



17 మనోవ్యాకులత(డిప్రెషన్)తో ఉంటే మౌనంగా ఉండకుండా.. ఎవరితోనైనా ఆలోచనలు పంచుకోవాలి. దీంతో మనసుకు కొంత ఊరట, ధైర్యం లభిస్తాయి.



18 ఆహారంలో తాజా కూరగాయాలు ఉండేలా చూసుకోవాలి. కావాల్సిన ప్రొటీన్లు వీటి నుంచే సగం అందేలా తీసుకోవాలి. ఆకుకూరలకు ప్రాధాన్యం ఉండాలి. ఇష్టం లేదని తినని కూరగాయలను ఇప్పటినుంచైనా రోజుకొకటి తినే ప్రయత్నం చేయాలి.



19 సహజంగా దొరికే ఆహార పదార్థాలను ఎక్కువగా తినాలి. నిల్వ ఉండే వాటిని, మైదాతో తయారు చేసే వాటిని దూరం పెట్టాలి.







రాజీవ్ సేవలు చిరస్మరణీయం

సూర్యాపేట (తాళ్లగడ్డ), న్యూస్‌టుడే: రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకొని ఆదివారం యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో స్థానిక ప్రాంతీయ వైద్యశాలలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు చకిలం రాజేశ్వరరావు, బైరు వెంకన్నగౌడ్ మాట్లాడారు. దేశ ప్రధానిగా రాజీవ్ చేసిన సేవలు చిరస్మరణీయంగా నిలుస్తాయన్నారు. నల్గొండ పార్లమెంట్ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కుమ్మరికుంట్ల వేణుగోపాల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్దుల్ రహీం, జనపాల ఎల్లయ్య, షాహిద్‌బేగం, వెంపటి సురేష్, కెక్కిరేణి సత్యనారాయణ, అంజద్‌అలీ, ఈద ప్రవీణ్, కృష్ణయాదవ్, చెరుకు మణికుమార్, శివనాయక్, మల్లేపాక అనిల్, ఎస్.కె.జహీర్, సాజిత్‌ఖాన్, బైరు సాయి, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.



ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బతుకులు బాగుపడే తెలంగాణే టీమాస్ లక్ష్యం

కుడకుడరోడ్డు, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్రంలో బడుగుల బతుకులు బాగుపడే తెలంగాణ సాధించడమే తెలంగాణ సామాజిక, ప్రజా సంఘాల ఐక్య వేదిక (టీమాస్) ప్రధాన లక్ష్యమని ఆ సంఘం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు తాటి రమేష్ అన్నారు. ఆదివారం సూర్యాపేటలోని పబ్లిక్‌క్లబ్ ఆడిటోరియంలో జరిగిన టీమాస్ జిల్లా సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కోటి ఆశల ఆకాంక్షలతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో నియంతృత్వ పరిపాలన జరుగుతోందని ఆరోపించారు. ప్రాణాలు తెగించి సాధించుకున్న ప్రత్యేక రాష్ట్రంలో ప్రజలు అనేక కష్టాలను ఎదుర్కొంటున్నారని అన్నారు ఆ సంఘ రాష్ట్ర నాయకుడు బి.వి. రాఘవులు మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రంలో ప్రశ్నించే గొంతులను నొక్కుతూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని విమర్శించారు. టీమాస్ ఫోరం జిల్లా సమన్వయ కర్త ధీరావత్ రవి నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలు ప్రజా సంఘాల నాయకులు ములకలపల్లి రాములు, వసంత సత్యనారాయణ పిళ్లే, తల్లమల్ల హస్సేన్, కోట రమేష్, అంగిరేకుల నాగార్జున, ఖాలేద్ అహ్మద్, కడారు స్టాలిన్, కొమురయ్య, మల్లు లక్ష్మి, సీహెచ్.రాములు, నెమ్మాది వెంకటేశ్వర్లు, మల్లు నాగార్జున్‌రెడ్డి, కోట గోపి, మట్టిపల్లి సైదులు, లింగిడి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



సూర్యాపేటలో మాట్లాడుతున్న తాటి రమేష్

పీఆర్సీ ఆధారంగా వేతనాలు పెంచాలి

సూర్యాపేట విద్యావిభాగం, న్యూస్‌టుడే: కేజీబీవీ ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 28న జిల్లా కలెక్టరేట్ ఎదుట చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి సీహెచ్.రాములు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక జిల్లా కార్యాలయంలో సమస్యల కరపత్రం విడుదల చేసి మాట్లాడారు. పదో పీఆర్సీ ఆధారంగా ప్రత్యేక అధికారులు, ఉపాధ్యాయులు, ఉద్యోగుల వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. మహిళా ఉపాధ్యాయులకు వేతనంతో కూడిన ఆరు నెలల ప్రసూతి సెలవులు మంజూరు చేసి, ఆరోగ్య కార్డులు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్.ధనమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శులు సీహెచ్.వీరారెడ్డి, ఎన్.వి.సత్యనారయణ, జి.వెంకటయ్య పాల్గొన్నారు.



కరపత్రం విడుదల చేస్తున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు



TENTH English

PREPOSITIONS

A Preposition is a word such as in, on, at or beside that is used before a noun or a noun phrase or a pronoun to show a link with another word or phrase.

★ Study the prepositions under lined in the following sentences:

1. Vaccination protects us from many diseases.
2. A man is known by the company the keeps.
3. Foundation of a house lies below the ground level.
4. Srinidhi has no appetite for sweets.

The words from, by, below and for are prepositions.

Kinds Of Prepositions

Prepositions have different functions: to indicate time, place, movement, direction, means, manner, purpose, source, concession, etc.

Examples: 1. The train arrived on time. (Time)
2. I met Sahithi at the theatre. (Place)
3. Shirisha went to the market for fruits. (Purpose)
4. Rishita drove along the main road in a hurry. (Direction)

A. Simple Prepositions: in ★ on ★ at ★ to ★ for ★ from ★ of ★ off out ★ by ★ till ★ with ★ through, etc.

Study the following sentences and observe the prepositions used in each sentence and note the function of the prepositions given in the brackets.

1. Vaishnavi waited for the doctor till he returned. (Time)
2. Naveen left Boath for Dubai. (Place)
3. Inspite of the hurdles, Kavya succeeded in her efforts. (Concession)

B. Compound Prepositions

about ★ above ★ across ★ along ★ amidst ★ among ★ around ★ before ★ behind ★ below ★ beneath ★ beside ★ between ★ beyond ★ inside ★ out side ★ within ★ with out

Examples: 1. A narrow path ran in between the two houses.
2. The moon moves around the Earth.
3. Inside the box was a diamond studded watch.
4. I cannot allow the work to continue beyond the end of December.

It goes without saying that language is the dress of thought. As such, we express our feelings and thoughts through words. The words we use in a sentence need to be precise, accurate and forceful. So to say, prepositions are such forceful, nay powerful words which govern the entire sentence. Therefore, a thorough practice of using correct prepositions is needed for the learner.

ప్రతిభ

Nithin is fond *of* eating..

Exercise - 1

✪ *Fill in the blanks with suitable Simple Prepositions.*

1. Nithin is fond .... eating sweets.
2. English is quite different .... Telugu.
3. Malavika fell ... her bicycle and broke her leg.
4. Ashwini drove her car .... the side gate.
5. I'll return your book .... a week.

Exercise - 2

✪ *Fill in the blanks with suitable Compound prepositions.*

1. Apple and banana are .... the most popular fruits.
2. Moiz usually sits .... Saikumar in the class.
3. There is something special .... our Headmaster.
4. A new bridge is being built .... the river.
5. She looks nice .... make-up.

C. Compound Prepositional Phrases

Compound Prepositional Phrases consist of two or more words, such as due to, because of, together with, etc,

Examples:

1. The rowdy was arrested according to IPC 420.
2. I cannot see the film because a tall man is sitting infront of me.
3. Vijayendra Prasad goes to school along with Vamsi Krishna daily.
4. Ring the alarm bell in case of emergency.

✪ *Study the following compound Prepositional Phrases and note the meanings given to each of them*

Comp.Prep.Phrases	Meanings
along with	together with
on account of	because of
by means of	through the agency of
apart from	separate from
ahead of	earlier than something/ somebody
in front of	located before
in place of	as a substitute for
inspite of	disregarding the difficulty
in case of	in the event of
by way of	via
due to	on account of
for the sake of	for the good of
in addition to	added to
in accordance with	in agreement with

Examples: The thief entered the house by means of a broken window.
2. Shruthi attends special classes on Sundays in addition to regular practice.
3. We postponed our trip to Ramoji Film City due to bad weather.
4. Inspite of being rich, my neighbour is not happy.

Exercise - 3

✪ *Fill in each blank with the correct Compound Prepositional Phrases from those given under each sentence.*

1. .... his injury, Umesh will play in Sunday's match.
a) Due to b) For the sake of c) In spite of
2. He sent me some flowers .... an apology.
a) by way of b) in case of c) apart from
3. Is there parking space .... the hotel?
a) ahead of b) in front of c) along with
4. She lost her way when she went into the jungle .... firewood.
a) for the sake of b) in addition to
c) in search of

Answers

Ex-1: 1) of 2) from 3) off 4) through 5) in
Ex-2: 1) among 2) beside 3) about 4) across 5) without
Ex-3: 1-c 2-a 3-b 4-c.



రచయిత
డి.నారాయణ,
విషయ నిపుణులు

జనరల్ స్టడీస్

ఫిజిక్స్

గాలిలో ధ్వని వేగం దేనిపై ఆధారపడదు?

1. ఒక వాహనం తన ప్రయాణ దూరంలోని మూడు సమ దూరాలను వరుసగా 80, 60, 30 కి.మీ. / గంట వేగంతో ప్రయాణిస్తే దాని సగటు వేగం ఎంత? (కి.మీ./గంటల్లో)
1) 60 2) 50 3) 48 4) 24

2. ఖగోళశాస్త్రంలో 'పార్‌సెక్' దేనికి ప్రమాణం?
1) దూరం 2) కాలం 3) వేగం 4) పౌనఃపున్యం

3. ట్రాన్స్‌ఫార్మర్ మార్చలేని AC విద్యుత్‌కి సంబంధించిన అంశం?
1) వోల్టేజీ 2) కరెంట్ 3) పౌనఃపున్యం 4) పైవన్నీ

4. భూస్థావర (జియోస్టేషనరీ) ఉపగ్రహం భూమి కేంద్రం నుంచి సుమారు ఎంత ఎత్తులో ఉంటుంది?
1) 36000 కి.మీ. 2) 6,400 కి.మీ.
3) 21,000 కి.మీ. 4) 42,400 కి.మీ.

5. రేడియో రిసీవర్లలో ఉపయోగించే వలయం ఏది?
1) శుద్ధ నిరోధ వలయం 2) LC - ట్యాంక్ వలయం
3) శుద్ధ ప్రేరక వలయం
4) శుద్ధ కెపాసిటర్ వలయం

6. టెఫ్లాన్ పూత పూసిన లోహ పరికరాలను ఉపయోగించి అధిక వోల్టేజీ విద్యుత్ ప్రసారాలను నిలిపివేయకుండానే వాటిని తీసుకుని వెళ్లే తీగలను ముట్టుకుంటారు. ఎందుకంటే టెఫ్లాన్ ఒక...
1) విద్యుత్ బంధకం 2) అర్ధ వాహకం
3) విద్యుత్ వాహకం 4) అతివాహకం

7. గాలిలో ధ్వని వేగం దేనిపై ఆధారపడదు?
1) పీడనం 2) ఆర్ద్రత
3) గాలి (పవన) వేగం 4) ఉష్ణోగ్రత

8. ప్రతిపాదన **(A):** పాలీవినైల్ క్లోరైడ్‌తో తయారైన రెయిన్ కోట్లను వర్షం నీరు తడపదు.
కారణం (R): పాలీవినైల్ క్లోరైడ్, నీటి మధ్య స్పర్శ కోణం 90° కంటే ఎక్కువ.
1) A, R రెండూ సరైనవి. A కి R సరైన వివరణ.
2) A, R రెండూ సరైనవి. A కి R సరైన వివరణ కాదు.
3) A, R రెండూ సరైనవి కావు.
4) A సరైంది. కానీ, R సరైంది కాదు.

9. శక్తి నిత్యత్వ నియమానికి ప్రతిరూపం -
1) లెంజ్ నియమం
2) ఉష్ణగతిక శాస్త్ర మొదటి నియమం
3) కిర్కాఫ్ రెండో నియమం 4) పైవన్నీ

10. శూన్య కెల్విన్ ఉష్ణోగ్రతకు సంబంధించి కిందివాటిలో సరైంది ఏది?
1) శూన్య కెల్విన్ ఉష్ణోగ్రతను చేరిన వాయువు ఘన పరిమాణం శూన్యం అవుతుంది.
2) శూన్య కెల్విన్ ఉష్ణోగ్రతను చేరిన వాయువు పీడనం శూన్యం అవుతుంది.
3) శూన్య కెల్విన్ ఉష్ణోగ్రతను పొందడం అసాధ్యం.
4) పైవన్నీ సరైనవే

11. కేంద్రక బలాలు....
1) ఆకర్షణ బలాలు 2) స్వల్ప అవధి బలాలు
3) అత్యంత బలమైన బలాలు 4) పైవన్నీ

12. రాకెట్ ఏ సూత్రం ఆధారంగా పని చేస్తుంది?
1) ద్రవ్యరాశి నిత్యత్వ నియమం
2) శక్తి నిత్యత్వ నియమం
3) ద్రవ్యవేగ నిత్యత్వ నియమం 4) పైవన్నీ

13. ఉష్ణశక్తిని విద్యుత్‌శక్తిగా మార్చేది ఏది?
1) థర్మోకపుల్ 2) ఎలక్ట్రిక్ హీటర్
3) ఎలక్ట్రిక్ బల్బు 4) ఫొటో సెల్

14. స్వేచ్ఛగా కిందపడే వస్తువు...
1) మొత్తం యాంత్రిక శక్తి స్థిరం
2) స్థితిజ శక్తి క్రమంగా పెరుగుతుంది
3) గతిజ శక్తి క్రమంగా పెరుగుతుంది
4) 1, 3



రచయిత
డి. అనంత రామకృష్ణ
విషయ నిపుణులు

15. ఎత్తయిన ప్రదేశం (విమానం) నుంచి చూస్తే ఇంద్రధనస్సు ఏ ఆకారంలో కనిపిస్తుంది?
1) అర్ధ వృత్తం 2) వృత్తం
3) పరావలయం 4) ఏదీకాదు

16. 40°C వద్ద ఉన్న 500 మి.లీ. నీటిని అంతే పరిమాణంలో, 70°C వద్ద ఉన్న నీటికి కలిపితే ఫలిత ఉష్ణోగ్రత విలువ ఎంత?
1) 110° C 2) 55°C 3) 40°C 4) 65°C

17. ఒక వ్యక్తికి సరైన దృష్టి కోసం డాక్టర్ +2D కటకం వాడమని సలహా ఇచ్చారు. అది ఏ రకమైన కటకం? దాని నాభ్యాంతరం ఎంత?
1) కుంభాకార, 100 సెం.మీ.
2) పుటాకార, 10 సెం.మీ.
3) కుంభాకార, 50 సెం.మీ.
4) పుటాకార, 50 సెం.మీ.

18. కాంతి విరళ యానకం నుంచి సాంద్రతర యానకంలోకి ప్రసరిస్తే, దాని తరంగదైర్ఘ్యం (λ), పౌనఃపున్యం (υ) విలువలు ఏ విధంగా ఉంటాయి?
1) λ, υ రెండూ పెరుగుతాయి
2) λ పెరుగుతుంది, υ స్థిరం
3) λ తగ్గుతుంది, υ స్థిరం
4) λ, υ రెండూ తగ్గుతాయి

19. వస్తువు గతిజ శక్తి వేటిపై ఆధారపడుతుంది?
1) ద్రవ్యరాశి, ఎత్తు 2) వేగం, కాలం
3) ఎత్తు, త్వరణం 4) ద్రవ్యరాశి, వేగం

20. సమ వేగంతో వెళ్లే వస్తువు ....
1) చలన దిశ స్థిరం, వడి అస్థిరం
2) వడి స్థిరం, చలన దిశ అస్థిరం
3) వడి, చలన దిశ రెండూ అస్థిరం
4) వడి, చలన దిశ రెండూ స్థిరం

21. మానవుడి గుండె సగటున నిమిషానికి 75 సార్లు కొట్టుకుంటుంది. అయితే దాని స్పందన పౌనఃపున్యం ఎంత? (హెర్ట్‌జ్‌లలో)
1) 1.25 2) 3.25 3) 4.25 4) 2.25

22. R నిరోధం ఉన్న n నిరోధాలను సమాంతరంగా కలిపితే, ఫలిత నిరోధం...
1) nR 2) n^2 R 3) $\frac{R}{n^2}$ 4) $\frac{R}{n}$

23. వర్షాకాలంలో రోడ్లపై నూనె పొరలు రంగుల్లో కనిపించడానికి కారణం?
1) ధ్రువణం 2) వ్యతికరణం
3) పరిక్షేపణం 4) విక్షేపణం

24. పౌనఃపున్య మాడ్యులేషన్‌లో (FM) వాహక తరంగం పౌనఃపున్యం దేనికి అనుగుణంగా మారుతుంది?
1) సంకేత తరంగ తక్షణ పౌనఃపున్యం
2) సంకేత తరంగ తక్షణ దశ
3) సంకేత తరంగ తక్షణ కంపన పరిమితి
4) సంకేత తరంగ తక్షణ వేగం

25. నక్షత్రం నుంచి వెలువడే కాంతి క్రమంగా ఎరుపు రంగుకి మారితే, అది దేన్ని సూచిస్తుంది?
1) నక్షత్రం భూమి వైపు రావడాన్ని
2) నక్షత్రం విరామ స్థితిలో ఉండటాన్ని
3) నక్షత్రం భూమికి దూరంగా వెళ్లడాన్ని
4) నక్షత్రం ఉష్ణోగ్రత క్రమంగా తగ్గడాన్ని

జవాబులు

1-3	5-2	9-4	13-1	17-3	21-1	25-3
2-1	6-1	10-4	14-4	18-3	22-4	
3-3	7-1	11-4	15-2	19-4	23-2	
4-4	8-1	12-3	16-2	20-4	24-1	

కరెంట్ అఫైర్స్

ప్రతిభ



క్రీడలు టెస్ట్ సిరీస్ నెగ్గిన భారత్ ఆగస్టు 14

శ్రీలంకలో శ్రీలంకతో జరిగిన మూడు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌ను టీమిండియా 3-0 తో క్లీన్‌స్వీప్ చేసింది. విదేశీ గడ్డపై మూడు టెస్టుల సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన తొలి భారత జట్టుగా కోహ్లీ సేన ఘనత సాధించింది. మ్యాన్ ఆఫ్ ద సిరీస్‌గా శిఖర్ ధావన్ నిలిచాడు.

జీవించదగిన అత్యుత్తమ నగరం ఏది..?

జాతీయం

ఆగస్టు 13: కీలక బిల్లులకు రాష్ట్రపతి ఆమోదం

రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ బాధ్యతలు చేపట్టిన మూడు వారాల్లో ఆరు కీలక బిల్లులపై సంతకాలు చేశారు. ఆయన ఆమోదం లభించడంతో ఇకపై అవి చట్టాలుగా రూపుదాల్చనున్నాయి.

★ బ్రిటిష్ కాలంనాటి రెండు చట్టాల స్థానంలో రూపొందించిన ది అడ్మిరాలిటీ (పరిధి, మారిటైమ్ క్లెయిమ్‌ల చెల్లింపు) బిల్లు; బాలల ఉచిత, నిర్బంధ విద్యాహక్కు (సవరణ) బిల్లు; జమ్మూ-కశ్మీర్‌కు వర్తించే గణాంకాల సేకరణ (సవరణ) బిల్లు; ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం) బిల్లు; నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ, సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (సవరణ) బిల్లు; ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ బిల్లులపై రామ్‌నాథ్ సంతకాలు చేశారు.

ఆగస్టు 14: భారతీయ భాషల్లో గూగుల్ వాయిస్ సెర్చ్

టెక్నాలజీ దిగ్గజ సంస్థ గూగుల్ తన వాయిస్ సెర్చ్ ఫీచర్‌కు కొత్తగా 8 భారతీయ భాషలను జోడించింది. ఇప్పటివరకు హిందీ, ఇంగ్లిష్ భాషల్లోనే గూగుల్ వాయిస్ సెర్చ్ సౌలభ్యం అందుబాటులో ఉంది. ఇప్పుడు తెలుగు, బెంగాలీ, మలయాళం, తమిళం, గుజరాతీ, కన్నడ, మరాఠీ, ఉర్దూ భాషల్లోనూ దీన్ని అందించనున్నామని సంస్థ తెలిపింది.

★ గూగుల్ యాప్‌లో వాయిస్ సెట్టింగ్స్‌లో కావాల్సిన భాషను ఎంచుకోవాలని సూచించింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 149 భాషలకు ఈ వెసులుబాటు ఉంది.

ఆగస్టు 15: 71వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

దేశవ్యాప్తంగా 71 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ఎర్రకోటపై జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం జాతినుద్దేశించి చేసిన ప్రసంగంలో ఆధార్ నుంచి అంతరిక్షం దాకా అన్ని అంశాలను స్పృశించారు.

★ 75 ఏళ్ల స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకునే 2022 నాటికి ప్రతి పేద వ్యక్తికి పక్కా ఇల్లు నిర్మించేలా పని చేయాలని పిలుపునిచ్చారు. పెద్దనోట్ల రద్దు, జీఎస్‌టీ అమలు, నల్లధనంపై కొరడా సహా తన ప్రభుత్వం చేపట్టిన అనేక సంస్కరణలు, పథకాలను ప్రస్తావించారు. స్వాతంత్ర్య సాధన కోసం 'భారత్ ఛోడో' అని నినదించినట్లు ఇప్పుడు 'భారత్ జోడో' నినాదంతో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు.

★ సమష్టి సంకల్ప శక్తి ద్వారా 2022 నాటికి స్వాతంత్ర్య సమరయోధుల కలలను సాకారం చేసే దిశగా నవభారతాన్ని ఆవిష్కరించాలని మోదీ పేర్కొన్నారు.

★ ప్రధాని హోదాలో మోదీ చేసిన నాలుగు స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగాల్లో ఇదే అత్యంత చిన్న ప్రసంగం (సుమారు 56 నిమిషాలు) కావడం విశేషం.

ఆగస్టు 16: రికార్డు స్థాయిలో ఆహారధాన్యాల ఉత్పత్తి

గత జూన్‌తో ముగిసిన 2016-17 పంట సంవత్సరంలో దేశవ్యాప్తంగా రికార్డు స్థాయిలో 27.56 కోట్ల టన్నుల ఆహారధాన్యాల ఉత్పత్తి జరిగినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అంచనా వేసిన దానికంటే 20.30 లక్షల టన్నులు అధిక దిగుబడి వచ్చినట్లు పేర్కొంది.

★ 2015-16 (జులై - జూన్)లో 25.17 కోట్ల టన్నుల దిగుబడి వచ్చింది. 2013-14 లో వచ్చిన 26.50 కోట్ల టన్నుల దిగుబడే ఇంతవరకు రికార్డు.

★ వరి దిగుబడులు 10.41 కోట్ల టన్నుల నుంచి 11.01 కోట్ల టన్నులకు, గోధుమలు 9.29 కోట్ల టన్నుల నుంచి 9.83 కోట్ల టన్నులకు, తృణధాన్యాలు 3.85 కోట్ల టన్నుల నుంచి 4.41 కోట్ల టన్నులకు, పప్పుధాన్యాలు 1.63 కోట్ల టన్నుల నుంచి 2.29 కోట్ల టన్నులకు పెరిగాయి.

★ కంది, మినపప్పుల దిగుబడులు చాలా బాగుండటం గమనార్హం. పత్తి ఉత్పత్తి 3.01 కోట్ల బేళ్ల నుంచి 3.30 కోట్ల బేళ్లకు పెరిగింది. చెరకు ఉత్పత్తి 11.98 శాతం మేర పడిపోయింది.



ఆగస్టు 17: అమెరికా నుంచి అపాచీ హెలికాప్టర్లు

సైన్యం కోసం అమెరికా నుంచి ఆరు అధునాతన అపాచీ హెలికాప్టర్ల కొనుగోలుకు రక్షణ మంత్రి అరుణ్ జైట్లీ అధ్యక్షతన దిల్లీలో సమావేశమైన రక్షణ కొనుగోళ్ల మండలి (డీఏసీ) ఆమోదం తెలిపింది. రూ.4,168 కోట్ల విలువైన ఈ ప్రతిపాదన దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉంది. దీనికి తోడు అధునాతన గ్రిగోరోవిచ్ శ్రేణి స్టెల్త్ యుద్ధనౌకలకు రూ.490 కోట్లతో రెండు జోర్యా గ్యాస్ టర్బైన్ ఇంజిన్లు కొనుగోలు చేయడానికి కూడా డీఏసీ ఆమోదం తెలిపింది

అంతర్జాతీయం

ఆగస్టు 12: కెన్యా అధ్యక్షుడిగా మళ్లీ ఉహురు కెన్యట్టా



ఆఫ్రికా దేశమైన కెన్యా అధ్యక్షుడిగా ఉహురు కెన్యట్టా రెండోసారి ఎన్నికయ్యారు. తాజాగా జరిగిన ఎన్నికల్లో 54.27 శాతం ఓట్లు దక్కించుకున్న కెన్యట్టా విజయం సాధించినట్లు కెన్యా ఎన్నికల సంఘం ప్రకటించింది.

★ ప్రతిపక్ష నేత రైలా ఓడింగా 44.74 శాతం ఓట్లు పొందారు. అయితే ఎన్నికలు సక్రమంగా జరగలేదని, రిగ్గింగ్, ఓటింగ్ యంత్రాల ట్యాంపరింగ్ జరిగిందని ఓడింగా ఆరోపించారు. ఈ నేపథ్యంలో ప్రతిపక్ష పార్టీ మద్దతుదారులు నిర్వహించిన ఆందోళనలు హింసాత్మకంగా మారి, 11 మంది మరణించారు.

ఆగస్టు 14: కలరా బారిన యెమన్

యెమన్‌లో కలరా విజృంభిస్తున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) వెల్లడించింది. 2017 ఏప్రిల్ నుంచి 5 లక్షలకుపైగా ప్రజలు దీని బారినపడగా 1975 మంది మృతి చెందినట్లు పేర్కొంది.

వార్తల్లో ప్రదేశాలు

ఆగస్టు 14:

హైదరాబాద్‌లో ప్రపంచ పారిశ్రామికవేత్తల సదస్సు

ప్రపంచ పారిశ్రామికవేత్తల (వ్యవస్థాపకుల) వార్షిక శిఖరాగ్ర సదస్సును 2017 నవంబరు 28 నుంచి 30 వరకు మూడు రోజులపాటు హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు. ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభం కానున్న ఈ సదస్సుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుమార్తె ఇవాంకా ట్రంప్ హాజరుకానున్నారు. అగ్ర రాజ్యమైన అమెరికా ఈ సదస్సును నిర్వహిస్తుండటం విశేషం.

ఆగస్టు 16: అత్యుత్తమ నగరంగా మెల్‌బోర్న్

ఎకనామిస్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్ రూపొందించిన గ్లోబల్ లివబిలిటీ నివేదిక ప్రకారం ప్రపంచంలో జీవించదగిన అత్యుత్తమ నగరంగా ఆస్ట్రేలియా రాజధాని మెల్‌బోర్న్ ప్రథమస్థానంలో నిలిచింది. తర్వాతి స్థానాల్లో వియన్నా (ఆస్ట్రియా), వాంకోవర్ (కెనడా) ఉన్నాయి.

రాష్ట్రీయం - ఆంధ్రప్రదేశ్, తెలంగాణ

ఆగస్టు 17:

స్వచ్ఛ విద్యాలయ పురస్కారాలు



తెలుగు రాష్ట్రాల్లోని 35 ప్రభుత్వ పాఠశాలలు జాతీయ స్థాయి స్వచ్ఛ విద్యాలయ పురస్కారాలకు ఎంపికయ్యాయి. దేశవ్యాప్తంగా 24 రాష్ట్రాల నుంచి 172 పాఠశాలలు ఈ పురస్కారాలకు ఎంపికకాగా వీటిలో 35 పాఠశాలలు తెలుగు రాష్ట్రాలకు చెందినవి కావడం విశేషం (ఏపీ నుంచి 21, తెలంగాణ నుంచి 14 ప్రభుత్వ పాఠశాలలు).

★ స్వచ్ఛ భారత్‌లో భాగంగా కేంద్రం ఈ పురస్కారాలను అందిస్తోంది. పారిశుద్ధ్య నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, తాగునీరు, విద్యార్థులు చేతులు శుభ్రం చేసుకునేందుకు ఉన్న సౌకర్యం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని కేంద్రం వీటిని ప్రకటించింది.

★ తమిళనాడు నుంచి అత్యధికంగా 25 పాఠశాలలు ఈ పురస్కారాలకు ఎంపికయ్యాయి. అత్యుత్తమ ఆరోగ్య-పరిశుభ్రత ప్రమాణాలు పాటిస్తున్న ఒక్కో పాఠశాలకు రూ.50 వేల చొప్పున నగదు బహుమతి అందిస్తారు.

రాష్ట్రీయం - ఆంధ్రప్రదేశ్

ఆగస్టు 15: తిరుపతిలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 71 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను తిరుపతిలోని తారకరామ మైదానంలో ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు జాతీయ జెండాను ఎగురవేశారు. రాష్ట్రంలోని నీటి ప్రాజెక్టుల కోసం రూ.43 వేల కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమర యోధుల పింఛనును రూ. 7 వేల నుంచి రూ. 15 వేలకు పెంచుతున్నట్లు పేర్కొన్నారు. 2019 నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాలని భావిస్తున్నట్లు ప్రకటించారు.

పురుషోత్త పట్నం ఎత్తిపోతల ప్రారంభం

✪ గోదావరి నదిని ఏలేరుతో అనుసంధానించే పురుషోత్త పట్నం ఎత్తిపోతల పథకాన్ని సీఎం చంద్రబాబు ప్రారంభించారు.

ఆగస్టు 16: ఐయూఐహెచ్ శంకుస్థాపన

రాజధాని అమరావతిలో ప్రతిష్ఠాత్మక ఇండో-యూకే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ (ఐయూఐహెచ్), అమరావతి మెడిసిటీ ప్రాజెక్టుకు సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టుపై ఐయూఐహెచ్ రూ.1600 కోట్లు వెచ్చించనుంది.

వార్తల్లో వ్యక్తులు

ఆగస్టు 11:

సెన్సార్ బోర్డు నూతన ఛైర్మన్ ప్రసూన్ జోషి



సెన్సార్ బోర్డు నూతన ఛైర్మన్‌గా కవి, పద్మశ్రీ ప్రసూన్ జోషి నియమితులయ్యారు. వచ్చే మూడేళ్ల కాలానికి ప్రసూన్ ఈ పదవిలో కొనసాగుతారు. పహ్లాజ్ నిహ్లానీ స్థానంలో ప్రసూన్ నియమితులయ్యారు. సెన్సార్ బోర్డు సభ్యులుగా విద్యాబాలన్, గౌతమి, జీవిత తదితరులు నియమితులయ్యారు.

✪ నాటి తరం పరుగుల వీరుడు మిల్కాసింగ్ ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) సౌహార్ద్ర రాయబారిగా నియమితులయ్యారు. దక్షిణాసియా ప్రాంతంలో శారీరక శ్రమ పెంపుదల ఆవశ్యకతపై ప్రచారం చేయడానికి డబ్ల్యూహెచ్ఓ ఆయన్ను ఎంపిక చేసింది.

ఆగస్టు 14:

ఎంతోమంది పేదలకు ఉచిత వైద్య సేవలు అందించి, డాక్టర్ 'దీదీ'గా ప్రఖ్యాతిగాంచిన భక్తియాదవ్ (91) ఇండోర్‌లో మరణించారు. మధ్యప్రదేశ్ తొలి మహిళా వైద్యురాలిగా గుర్తింపు పొందిన భక్తియాదవ్ గైనకాలజిస్టుగా అందించిన సేవలకు కేంద్రం పద్మశ్రీతో సత్కరించింది.

అవార్డులు

ఆగస్టు 14:

శంకర్‌రావుకు రాష్ట్రపతి పోలీస్ శౌర్య పతకం

కేంద్ర ప్రభుత్వం 71వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ రాష్ట్రాల్లో ప్రతిభావంతమైన సేవలు అందించిన 990 మందికి అత్యున్నత పోలీసు పతకాలు ప్రకటించింది. వామపక్ష తీవ్రవాదులతో జరిగిన పోరులో ప్రాణాలర్పించిన ఛత్తీస్‌గఢ్ పోలీసు జవాను కమాండర్ శంకర్‌రావుకు మరణానంతరం రాష్ట్రపతి పోలీస్ శౌర్య పతకాన్ని ప్రకటించారు. కీర్తిచక్ర పురస్కారాన్ని అయిదుగురికి ప్రకటించారు. హవల్దార్ గిరిష్ గురుంగ్, మేజర్ డేవిడ్ మన్లుం, కమాండెంట్ ప్రమోద్ కుమార్ మరణానంతరం కీర్తిచక్రకు ఎంపికయ్యారు. మిగిలిన ఇద్దరిలో మేజర్ ప్రీతం సింగ్ కున్వార్, చేతన్ కుమార్ చీతా ఉన్నారు.

రాష్ట్రీయం - తెలంగాణ

ఆగస్టు 15: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

తెలంగాణ ప్రభుత్వం 71 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను హైదరాబాద్‌లోని గోల్కొండ కోటలో ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ జాతీయ జెండాను ఆవిష్కరించి, అనంతరం ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ ఏడాది కొత్తగా 84,876 ఉద్యోగ నియామకాలు చేపట్టనున్నట్లు కేసీఆర్ చెప్పారు.

★ 1936 లో నిజాం కాలంలో భూసర్వే జరిగిందని, ఆ తర్వాత మళ్లీ తమ ప్రభుత్వమే సమగ్ర భూ సర్వేను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. బడ్జెట్‌లో సింహభాగాన్ని సంక్షేమానికే వెచ్చిస్తున్నట్లు చెప్పారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలను పరిపుష్టం చేసేందుకు నడుం బిగించినట్లు చెప్పారు.

★ 2016-17 ఆర్థిక సంవత్సరంలో 21.7 శాతం ఆదాయ వృద్ధి రేటుతో తెలంగాణ దేశంలోనే అగ్రభాగాన నిలిచిందని పేర్కొన్నారు.

సిద్దిపేటకు ఐఎస్ఓ 9001-2015 ధ్రువపత్రం

✪ అభివృద్ధి, సంస్కరణలతో దూసుకెళ్తున్న సిద్దిపేట పురపాలిక మరో ఘనత సాధించింది. ఐఎస్ఓ 9001-2015 ధ్రువపత్రానికి ఎంపికై, రాష్ట్రంలో ఈ ఘనత సాధించిన తొలి పురపాలికగా నిలిచింది.

ఆగస్టు 16: తెలంగాణ పదాలతో నిఘంటువు

పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం తెలంగాణ ప్రజల భాష, యాస చిరకాలం ఉండేలా లక్ష పదాలతో నిఘంటువు తయారీకి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా అరుదైన పదాలన్నింటినీ సేకరించి అక్షరబద్ధం చేయాలనేది ప్రణాళిక. పదాల అన్వేషణకు అమరేశం రాజేశ్వర్ శర్మ, కట్టా శేఖర్ రెడ్డి, రవ్వా శ్రీహరి, ఘంటా చక్రపాణి, డాక్టర్ నలిమెల భాస్కర్‌లతో కమిటీ ఏర్పాటు చేశారు.

'ఓడీఎఫ్'గా హైదరాబాద్

✪ హైదరాబాద్ మహా నగరాన్ని బహిరంగ మలమూత్ర విసర్జన రహితంగా (ఓడీఎఫ్) ప్రకటిస్తూ జీహెచ్ఎంసీ ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసింది.



రచయిత
- సీహెచ్. కృష్ణప్రసాద్
విషయ నిపుణులు

హాయ్! బుజ్జీ!!

ఎదుటివారిని చూసి ప్రేమ పూర్వకంగా నవ్వగలిగితే అదే మనం వారికిచ్చే అందమైన బహుమతి

– మదర్ థెరెసా

పదసంపద!

రోజుకు రెండు పదాలు చదివితే పదసంపద మీదే!

- Produce = ఉత్పత్తిచేయు
- మధుకరం = తుమ్మెద


సరదా పదాలు

ఆధారాలతో తెలుగు పదాలు రాయండి

1. Summer	వే	5. Pay	వే
2. Flute	వే	6. God	వే
3. Speed	వే	7. Function	వే
4. Heat	వే	8. Dawn	వే

- డీ దయామతి, హన్మకొండ

దారేది?



చుట్టూ జంతువులు... మధ్యలో మనం!



హాయ్ నేస్తాలూ! బాగున్నారా? నేనీమధ్య ఓ జూ కాని జూకెళ్లొచ్చా. ఊపిరి బిగబట్టుకుని కాలం గడిపొచ్చా. తలుచుకుంటేనే ఈ పర్యటన ఎంతో వింతగా.. గమ్మత్తుగా.. అనిపిస్తోంది. ఆ భలే భలే విశేషాలన్నీ మీతో పంచుకోకుంటే ఎలా? అందుకే ఇలా వచ్చేశా.



చిన్నూ కబుర్లు



చుట్టూ పులులు తిరుగుతుంటే మధ్యలో కూర్చుని భోజనం చేశా. సింహం దగ్గరగా వస్తుంటే కాలు మీద కాలేసుకుని ఐస్‌క్రీంలు తింటూ ఆనందించేశా. జంతువులన్నీ భయంకరంగా అరుస్తుంటే రాత్రివేళ మెత్తని పక్కపై పడుకుని ఓ కునుకేసేశా. 'కోతల రాయుడు కోతలు కోస్తున్నాడు. అన్నీ అబద్ధాలే' అనుకుంటున్నారా? అదేం కాదు. ఇదంతా నిజంగా నిజమే.

* మామూలుగా మనం ఎప్పుడైనా జూకి వెళ్లామనుకోండి. జంతువులన్నీ బోనుల్లో ఉంటాయి. మనం బయట స్వేచ్ఛగా తిరుగుతూ వాటిని చూస్తుంటాం. అంతేకదూ!

* మరి నేనెళ్లిన చోటు మాత్రం దీనికి పూర్తిగా భిన్నం. యూకేలోని కెంట్ దగ్గరుందిది.

* ఓ అద్దాల ఇంట్లో తలుపులేసుకుని నేనుంటే ఆ బయట అంతా పులులు, బోలెడు అడవి జంతువులూ తిరుగుతున్నాయి. లోపల నుంచి దగ్గరగా వాటిని చూస్తూ నేను ఆనందించేసానన్నమాట.

ఒక్కసారైతే నేనున్న అద్దం దగ్గరకి పెద్ద పులి వచ్చేసింది. అప్పుడు చాలా భయమేసి పక్క గదిలో ఉన్న అమ్మ దగ్గరికి పరిగెట్టేశా.

* అసలు ఈ చోటు ఏంటంటే..? ఇదో సఫారీ. మొత్తం 600 ఎకరాల్లో చిక్కగా చెట్లుంటాయి. వాటిలో రకరకాల జంతువులు స్వేచ్ఛగా తిరుగుతుంటాయి.

* మామూలుగా సఫారీల్లో వీటిని చూసేందుకు మనల్ని జీపుల్లాంటివాటిపై ఎక్కించుకుని తిప్పి తీసుకొస్తారంతే. ఇక్కడ అదొక్కటే కాకుండా అద్దాలతో ఉన్న ఓ చక్కని ఇల్లుంది. దాంట్లో రెండు పడకగదులు, వంటిల్లు, హాలూ ఉన్నాయి. ఎవరైనా అద్దెకు తీసుకుని కొన్ని రోజులక్కడ బస చేయొచ్చు. నాలా వింత అనుభవాల్ని ఆస్వాదించొచ్చు. కావాలంటే మీరూ ఓసారి వెళ్లిరండి మరి. బైబై.

నవ్వుల జల్లులు!

టీచర్: రాముా! ఎన్ని సార్లు పిలుస్తున్నా పలకవేంటి?

రాము: మీరే కదా టీచర్ అనవసరమైన విషయాలు పట్టించుకోవద్దన్నారు!

టీచర్: 30 + 30 ఎంత అవుతుంది?

రఘు: ఆరు టీచర్...

టీచర్: కాస్త బుర్ర పెట్టి చెప్పు!

రఘు: నా జవాబు సరైనదే టీచర్. 0కి విలువ లేదని మీరే కదా చెప్పారు!

- బరాటం రామారావు, నిజామాబాద్

చిలిపి ప్రశ్న

నీళ్లు ఎందుకు తాగుతాం?

- జీ రమేష్, పెనుబర్తి

ఏది భిన్నం?



పరివర్తన

కథ

'నాన్నా! రేపు మా తరగతిలోని పిల్లలంతా పరీక్ష ఫీజు చెల్లించాలని హెడ్మాస్టారు చెప్పారు.' ఇంట్లోకి అడుగు పెడుతూనే అన్నాడు రఘు.

అప్పుడే కూలి పని ముగించుకుని ఇంటికి వచ్చిన కేశవులు కొడుకు మాటలు విని 'అలాగా! ఫీజు ఎంతేమిటి?' అని అడిగాడు.

రెండు వందలని మెల్లగా చెప్పాడు రఘు.

'అవునా! రెండు వందలా? ఈ సారి బాగా పెంచేశారే! సర్లే. రేపు బడికి వెళ్లేప్పుడు ఇస్తాలే' అంటూ పెరట్లోకి నడిచాడు కేశవులు.

మరుసటి రోజు ఉదయం రఘు బడికి వెళ్లేందుకు తయారవుతుండగా కేశవులు అతని వద్దకి వచ్చి 'ఇదిగోరా రెండు వందలు. జాగ్రత్త మరి. వెళ్లగానే టీచరుకి ఇవ్వు'. అంటూ జేబులో డబ్బులు పెట్టాడు. 'సరే నాన్నా!' అంటూ బయటకు నడిచాడు రఘు. రఘు కాస్తంత దూరం నడవగానే అతని స్నేహితుడు అమర్ ఎదురయ్యాడు.


'ఏరా మీ నాన్న ఫీజు డబ్బులిచ్చారా?' ఆత్రుతగా అడిగాడు అమర్.

'ఇచ్చార్రా. మరి మీ నాన్నా?' అమర్ కళ్లలోకి సూటిగా చూస్తూ అడిగాడు రఘు.

'నేను ఫీజు రెండు వందల యాభై రూపాయలని చెబితే మారు మాట్లాడకుండా ఇచ్చేశార్రా మానాన్న' గొప్పగా చెప్పాడు అమర్.

ఇంతకీ అసలు విషయం ఏమిటంటే వాళ్లు చెల్లించవలసిన ఫీజు వంద రూపాయలే. తమ తల్లిదండ్రుల నుంచి ఎక్కువ డబ్బు తీసుకుని, వాటితో సినిమాకి వెళ్లాలని పథకం వేసుకున్నారు రఘు, అమర్. ఇద్దరిదీ ఒకే తరగతి. ఒకే బెంచీలో కూర్చుంటారు. కలసి తిరుగుతుంటారు. తల్లిదండ్రుల్ని నమ్మించి భలేగా డబ్బులు తీసుకున్నామని ఇద్దరూ మురిసిపోయారు. చెరో వంద వారి తరగతి ఉపాధ్యాయుడికి ఫీజు చెల్లించారు.

మరునాడు ఆదివారం కావడంతో ఇద్దరూ ఆడుకోవడానికి వెళుతున్నామని చెప్పి టౌనుకు బయలుదేరారు. సినిమా చూసి, ఆ తర్వాత మిఠాయి దుకాణానికి వెళ్లి తమకు ఇష్టమైన తినుబండారాలెన్నో కొనుక్కుని తిన్నారు. ఆనందంగా గడిపారు. చీకటి పడే వేళకు ఇంటికి చేరుకున్నారు. రఘు ఆట నుంచి ఇంటికి వస్తున్నట్లుగా నమ్మించేందుకు ఒక క్రికెట్ బ్యాటు చేతిలో పట్టుకుని



మెల్లగా ఇంట్లోకి అడుగు పెట్టాడు. అదే సమయంలో పక్క గదిలో తల్లిదండ్రులు మాట్లాడుకుంటున్న మాటలు విని ఆగిపోయాడు. కిటికీలోంచి లోపలికి చూశాడు. మంచం మీద కేశవులు జ్వరంతో వణికిపోతూ ఉన్నాడు. అతని భార్య సపర్యలు చేస్తూ 'వచ్చిన కూలి డబ్బులన్నీ పిల్లాడి ఫీజు కోసం ఇచ్చేశావు. మందులు తెద్దామంటే ఇంట్లో రూపాయి కూడా లేదు' అంది. అందుకు కేశవులు 'సమయానికి ఫీజు కట్టకపోతే రఘును పరీక్షలకు అనుమతించరు. నాకు మామూలు జ్వరమేగా వచ్చింది. రేపటికి తగ్గిపోతుందిలే' అన్నాడు మూలుగుతూ.

'అలా అంటే ఎలా? నేను పక్కింటి వాళ్ల దగ్గరకెళ్లి ఓ యాభై రూపాయలు అడిగి మందులు కొని తెస్తాను' అంటూ లేవబోయిన ప్రమీల చేయి పట్టుకుని ఆపి 'నా మాట విను రేపు చూద్దాంలే. ఇప్పుడు అప్పు చేయడం ఎందుకు?' అన్నాడు కేశవులు.

అదంతా చూస్తున్న రఘుకు బాధగా అనిపించింది. తన విలాసాల కోసం ఖర్చు చేసిన ఆ వంద రూపాయలు ఎంత విలువైనవో తెలిసి వచ్చింది. అదీగాక రోజు వారీ కూలికి వెళ్లి డబ్బు సంపాదించే తన తండ్రి శ్రమ విలువను అర్థం చేసుకోలేకపోయానని బాధపడ్డాడు. తన ఫీజు కోసం ఉన్న డబ్బులన్నీ ఇచ్చిన తండ్రి మంచితనాన్ని తలుచుకోగానే దుఃఖం తన్నుకు వచ్చింది. గదిలోకి పరుగున వెళ్లి తండ్రిని అమాంతం కౌగిలించుకున్నాడు. వెక్కివెక్కి ఏడుస్తూ జరిగిన సంగతంతా చెప్పాడు. తన తప్పును క్షమించమని విలపించాడు. వాస్తవాన్ని చెప్పినందుకు రఘును తల్లిదండ్రులు కోపగించుకోలేదు. పైగా 'చూడు రఘూ! నువ్వే మా సర్వస్వం. నీ కోసం, నీ చదువు కోసం ఏమైనా చేస్తాం. నువ్వు మాలా కూలి బతుకు బతక కూడదన్నదే మా కోరిక. జరిగింది మరిచిపో. చేసిన తప్పు తెలుసుకున్నావు కదా. అదే చాలు. ఇక మీదట నీకేం కావాలన్నా సంకోచం లేకుండా మమ్మల్ని అడుగు. మేం తెచ్చిపెడతాం. మళ్లీ ఇలాంటి పొరపాటు చేయకు' అంటూ అక్కున చేర్చుకున్నారు. ఆ ఘటన రఘులో గొప్ప మార్పు తెచ్చింది. ఎప్పుడూ మంచి ప్రవర్తనతో మెలుగుతూ, తన మిత్రుడిలోనూ అలాంటి పరివర్తన తీసుకొచ్చాడు.

- పెండెం జగదీశ్వర్

జవాబులు: ఏది భిన్నం: a చిలిపిప్రశ్న: తినలేం కాబట్టి! సరదా పదాలు: 1.వేసవి 2.వేణువు 3.వేగము 4.వేడిమి 5.వేతనం 6.వేలుపు 7.వేడుక 8. వేకువ

అలుగుపోస్తున్న శాలిగౌరారం ప్రాజెక్టు

ఆయకట్టుకు జలకళ

శాలిగౌరారం, న్యూస్‌టుడే: జిల్లాలో మధ్యతరహా ప్రాజెక్టులో ఒకటైన శాలిగౌరారం ప్రాజెక్టుకు పూర్తిస్థాయిలో నిండి అలుగుపోస్తుంది. దీంతో ఆయకట్టు కింద జలకళ సంతరించుకుంది. మూసీనది నుంచి రాచకాల్వ ద్వారా వరదనీరు చేరుతుండడంతో ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 21 అడుగులకు చేరింది. ప్రాజెక్టు పూర్తిగా నీటితో నిండడంతో నిండుకుండలా కళకళలాడుతుంది. ఖరీఫ్, రబీ సీజన్లకు గాను ఆయకట్టు కింద 7వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. ప్రాజెక్టు అలుగుపోస్తుండడంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పూర్తిగా నిండిన శాలిగౌరారం ప్రాజెక్టు

ఈటీవీలో ఈనాడు

ఉదయం

05-45: స్పెషల్ ఆరాధన, 06-30: అన్నదాత, 07-00: ఈటీవీ న్యూస్, 07-30: శుభమస్తు: శ్రీ మహాలక్ష్మి అనుగ్రహం కోసం పోలాల అమావాస్యరోజు ఏం చేయాలి? ఇంట్లో పూజించే విగ్రహాల ఎత్తు ఎంత ఉండాలి? 08-30: టాలీవుడ్ టైమ్, 09-00: ఈనాడు సినిమా: ఆమె (శ్రీకాంత్, ఊహ).

మధ్యాహ్నం

12-00: స్పెషల్ అభి'రుచి': ఘుమఘుమలు 'పుదీనా వాంగీబాత్', మీచేతివంట 'మునగాకు జీడిపప్పువేపుడు', 'పాలకూరపచ్చడి', జస్ట్ ఎమినిట్ 'ఉప్మాబోండా' తయారు చేసే విధానం. ఇంటింటి వంటింటి చిట్కాలు.., 01-00: స్టార్ మహిళ (మెగా గేమ్ షో), 02-00: అభిషేకం (డైలీ సీరియల్), 02-30: అత్తారింటికి దారేది (డైలీ సీరియల్), 03-00: సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (విధి 2) (డైలీ సీరియల్), 03-30: ఆడదే ఆధారం (డైలీ సీరియల్).

సాయంత్రం

04-00:వసంతం(డైలీ సీరియల్), 04-30: ఢీ 10 (సుప్రీండాన్స్‌షో) (రిపీట్), 06-00: శ్రీభాగవతం (భక్తిరసాత్మక దృశ్యకావ్యం) (డైలీ సీరియల్), 06-30: ఒకరికి ఒకరు (డైలీ సీరియల్).

రాత్రి

07-00: సావిత్రి (డైలీ సీరియల్), 07-30: మనసు మమత (డైలీ సీరియల్), 08-00: స్వాతి చినుకులు (డైలీ సీరియల్), 08-30: నా పేరు మీనాక్షి (డైలీ సీరియల్), 09-00: ఈటీవీ న్యూస్, 09-30: ఆలీతో సరదాగా: క్రియేటివ్ డైరెక్టర్ కృష్ణవంశీతో.., 10-30: సినీవారం: (స్పెషల్ ప్రోగ్రాం).

ఈటీవీ ప్లస్

ఉదయం 11:00 కిక్ రిపీట్
మధ్యాహ్నం 12:00జబర్దస్త్ రిమిక్స్
01:00 మైకేల్ మదన్ కామరాజు రిపీట్
01:15 ది బ్రేకప్ కన్సల్టంట్ రిపీట్
01:30 పటాస్ రిపీట్
02:00 అల్లరే అల్లరి రిపీట్
02:30 సరదాగా కాసేపు రిపీట్
03:00 తారక్ మామా అయ్యో రామ రిపీట్
03:30 హంగామా రిపీట్
సాయంత్రం
04:30 నా షో నా ఇష్టం
05:00 జిల్ జిల్ జిగా
06:00 అమృతం రిపీట్
06:30 ఎక్స్‌ప్రెస్ రాజా
రాత్రి
07:30 తారక్ మామా అయ్యోరామ
08:00 ఈ-జంక్షన్
09:00 పటాస్
09:30 అల్లరే అల్లరి
10:00 సరదాగా కాసేపు
10:30 తారక్ మామా అయ్యో రామ రిపీట్
11:00 పటాస్ రిపీట్
11:30 ఎక్స్‌ప్రెస్ రాజా రిపీట్

ఈటీవీ లైఫ్

మానస (ఉ.6:00, సా. 6.00, రా. 11.00)
డా.ఈటీవీ – (ఉ.6:30, 11:00, మ.3:30, సా.7:30)
యోగమంత్ర (ఉ.7:00, సా.5:30, రా. 11:30)
గెట్‌సెట్‌ఫిట్ (ఉ.7:30, సా.5:00, రా. 10:30)
అమృతం (ఉ.8:00, మ.12:30, రా. 8:00)
హెల్దీ & టేస్టీ – (ఉ.8:30, మ.01:00, రా. 8:30)
ఆరోగ్యమస్తు (ఉ.9:00, మ.03:00, సా. 4:00, రా. 9:00)
ఆయుష్ (ఉ.9:30)
లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్ (ఉ.10:00)
అందరికి ఆరోగ్యం (ఉ.10:30)
విహారి (మ. 12:00, సా. 6:30, రా. 10:00)
హెల్దీ డయాబెటిక్ - (మ. 1:30)
జీవనరేఖ – విమెన్స్ హెల్త్ (మ. 2:00, రా. 7:00)
బాడీ మైండ్ & సోల్– అంతరంగం (మ. 2:30, రా. 9:30)

ఈటీవీ సినిమా

ఉదయం: 6-00: మధురిమలు, 7-00: సన్‌రైజ్ సినిమా: బందీ (కృష్ణంరాజు విజయశాంతి), 10-00: మార్నింగ్ షో: గృహప్రవేశం (ఎల్.వి.ప్రసాద్, భానుమతి), మధ్యాహ్నం: 1-00: మాట్నీ: సందడే సందడి (జగపతిబాబు, శ్రీకాంత్), సాయంత్రం: 4-00: ఈవినింగ్ షో: ఇందు (ప్రభుదేవా, రోజా), రాత్రి: 7-00: ఫస్ట్‌షో: పెద్దక్కయ్య (హరనాథ్, కృష్ణకుమారి), 10-00: సెకండ్‌షో: అసెంబ్లీ గూండా (దేవరాజ్, అరుంధతినాగ్).

ఈటీవీ అభిరుచి

ఉ.6.00: బ్రేక్ ఫాస్ట్ షో - చికెన్ మసాలా ఇడ్లీ సాండ్విచ్ & హార్స్‌గ్రామ్ ఫ్రైడ్ రైస్, ఉ.8.00, రా.9:00: బ్రేక్ ఫాస్ట్ షో – స్పినాచ్ & చీజ్ స్టఫ్డ్ క్రిప్స్ & తెలగపిండి రవ్వ పులిహోర, ఉ.9:30: వావ్ ఏమి రుచి – అఖిడీ టుకో అష్యక్ & బోహేమనియన్ డ్రెస్సింగ్, ఉ.10.00: పిండివంటలు, ప్రసాదాలు – జీలు & చిలకడదుంప గులాబ్ జామ్, ఉ.11.00: గోరు ముద్దలు – ఆప్రికాట్ చికెన్ బ్రౌన్ రైస్, ఉ.11.15, రా.8:30: డైట్ మెనూ – ఫ్రూటీ ఓట్స్, ఉ.11.30, రా.8:00: బాబాయ్ హోటల్ - పెసరట్టు ఉప్మా & అల్లం పచ్చడి, మ.12.00: టేస్ట్ ఆఫ్ ఇండియా - సార్సో బాత్ ఇర్షాన్ మచ్ (బెంగాలీ క్యూసైన్), మ.12.15, రా.10:15: మమ్మీస్ కిచెన్ – ఓట్స్ మసాల పూరీ, మ.12.30, రా.8.45: "కౌ అండ్ కాఫ్" సూపర్ చెఫ్ - ఫ్రై ఆనియన్ ఎగ్ ఫ్రైడ్ రైస్, మ.12.45, సా.6.15: సూప్స్ & స్టార్టర్స్ - డ్రమ్ స్టిక్ లీఫ్ & హార్స్ గ్రామ్ సూప్, మ.1.00, రా.7.00: వావ్ ఏమి రుచి – గ్రిల్డ్ ప్రాన్స్ విత్ యుజు సాస్ (జపాన్ క్యూసైన్), మ.1.30, రా.10.00: చట్‌పట్ (అత్తమ్మ రుచుల స్పెషల్) - ఆ కాకరకాయ పుల్ల బెల్లం పెట్టిన కూర, మ.1.45, రా.7.30: ట్రెండీ ట్రీట్స్ – చాక్లెట్ కప్ కేక్ & ఫిష్ ఫింగర్స్, మ.2.15, రా.10.30: ఛెఫ్స్ స్పెషల్ – బీన్స్ ఉసిలి, మ.2.30, సా.6.00: చోటా షెఫ్ – సాబుదాన చుడ్వా, మ.2.45, రా.10.45: జిల్ – నట్టీ క్యారెట్ స్మూతీ & సిట్రస్ మింట్ ఫిజ్, మ.3.00: ఛాయ్ బిస్కెట్ – కాల్ జోన్స్ & చాక్లెట్ ఆల్మండ్ కాఫీ, మ.3.15: సూప్స్ & స్టార్టర్స్ - ఎగ్ డ్రాప్ సూప్.

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 ప్రార్థనా సమయం, 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360°, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 సుఖీభవ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతీ, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 కమర్షియల్ స్లాట్, 01-00 ఈటీవీ 360°, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 సుఖీభవ: **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 తీర్థయాత్ర: **శ్రీ భోగేశ్వర స్వామి ఆలయం, పామిడి, అనంతపురం జిల్లా,** 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి, 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360°, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్)

ఈటీవీ తెలంగాణ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 యువ (రిపీట్), 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360°, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 ఈటీవీ టాకీస్, 10-00 ఘంటారావం, 10-30 సుఖీభవ, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతీ!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 ప్రత్యేక వాణిజ్య కార్యక్రమం, 01-00 ఈటీవీ 360°, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 తీర్థయాత్ర: **శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం, కందూరు మహబూబ్‌నగర్ జిల్లా,** **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 సుఖీభవ, 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి, 06-00 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360°, 09-00 ప్రతిధ్వని, 09-30 **యువ,** 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్).

ఏ ఛానల్లో ఏముంది.. 21-08-2017

SVBC — **ఉదయం:** 05-30 సుప్రభాత వైభవం, 06-30 శుభోదయం + నిత్య పూజలివిగో, 07-00 విష్ణు సహస్రనామ స్తోత్రం, 07-30 శ్రీవారి సేవలు (తోమాలసేవ), 08-00 శతమానం భవతి, 08-30 పూజకు వేళాయె - శివుడు, 09-00 ఆధ్యాత్మిక విశేషాలు, 09-30 భక్తిగీత మాలిక, 10-00 ఆధ్యాత్మిక విశేషగలు - కన్నడ, 10-30 లైవ్ పద్మావతి అమ్మవారి కల్యాణం - తిరుచానూరు, 11-30 ప్రత్యేక వార్తలు - ఆముక్తమాల్యద, **మధ్యాహ్నం:** 12-00 లైవ్ కల్యాణోత్సవం, 01-00 ఆధ్యాత్మిక విశేషాలు, 01-30 విష్ణు సహస్ర నామామృతం, 02-00 లైవ్ ఆర్జిత బ్రహ్మోత్సవం, 02-30 లైవ్ వసంతోత్సవం, 03-00 పంచభూత లింగాలు, 03-30 విష్ణుపురాణం, **సాయంత్రం:** 04-30 క్షేత్ర దర్శిని, 05-00 లైవ్ ఎస్.డి.సేవ - తిరుమల + ప్రత్యేక వార్తలు, అళ్వార్ శ్రీసూక్తి, 06-00 లైవ్ నాదనీరాజనం - తిరుమల, **రాత్రి:** 07-30 లైవ్ ఘంటానాదం + శ్రీనివాసగద్యం + శివపంచాక్షరి + లింగాష్టకం, 08-00 భక్తిచైతన్యం, 08-30 ధర్మసోపానాలు - శ్రీ చాగంటి, 09-00 ఆలయ దర్శనం - మహారాష్ట్ర, 09-30 దేవిసప్తసతి - శ్రీసామవేదం, 10-00 ఆధ్యాత్మిక విశేషాలు, 10-30 మహాభారతం - అనుశాసనికపర్వం.

భక్తి TV — **ఉదయం:** 06-00 శ్రీ శివ సహస్రం, 06-30 నమకంచమకం, 07-00 అర్చన, 07-30 శ్రావణలక్ష్మీ నమోస్తుతే, 08-00 పుణ్యక్షేత్రం, 08-30 శ్రావణసోమవార వైభవం (లైవ్), 09-00 సంపూర్ణ రామాయణం, 11-00 ధర్మసందేహాలు, **సాయంత్రం:** 04-30 పుణ్యక్షేత్రం, 05-00 శివస్తోత్రం, 05-30 శ్రీశివసహస్రం, 06-00 నమకంచమకం, **రాత్రి:** 07-00 భక్తివిశేషాలు, 07-30 అమృతకలశం, 08-00 పరిహారం, 08-30 రామాయణ తరంగిణి, 09-00 లక్ష్మీ కటాక్షం, 09-30 లక్ష్మీ వైభవం, 10-00 ధర్మసందేహాలు, 10-30 భక్తివిశేషాలు.

జీ తెలుగు — **ఉదయం:** 07-30 ఓంకారం, 08-00 సినిమా: కృష్ణ, 11-00 కామెడి ఖిలాడీలు రిపీట్, **మధ్యాహ్నం:** 12-00 గోల్డ్‌రష్, 01-00 బతుకు జట్కాబండి, 02-00 గృహప్రవేశం, 02-30 నా కోడలు బంగారం, 03-00 సూర్యవంశం రిపీట్, 03-30 వారెవా, **సాయంత్రం:** 04-00 కామెడి ఖిలాడీలు, 05-00 జై కృష్ణా ముకుంద మురారి, 05-30 కుంకుమభాగ్య, 06-00 పక్కింటి అమ్మాయి, 06-30 రామా సీతా.., **రాత్రి:** 07-00 అమెరికా అమ్మాయి, 07-30 ముద్ద మందారం, 08-00 దట్ ఈజ్ మహాలక్ష్మీ, 08-30 పున్నాగ, 09-00 కళ్యాణ వైభోగం, 09-30 ముత్యాల ముగ్గు, 10-00 సూర్యవంశం, 10-30 ఇన్‌స్పెక్టర్ కిరణ్, 11-00 సినిమా: **రాక్షసుడు.**

మా — **ఉదయం:** 06-30 సిల్వర్ స్క్రీన్, 07-00 మహాభారతం, 08-00 రాశి ఫలాలు, 08-30 శ్రీవినాయక చరితం, 09-00 సినిమా: బన్ని, **మధ్యాహ్నం:** 12-00 కోడలా కోడలా కొడుకు పెళ్లామా, 12-30 చిన్నారి పెళ్లికూతురు, 01-00 కుంకుమపువ్వు, 01-30 బిగ్‌బాస్, 02-30 బిగ్‌బాస్ రిపీట్, **సాయంత్రం:** 04-00 బిగ్‌బాస్ రిపీట్, 05-30 ఒకె జాను, 06-00 ఉయ్యాలా జంపాలా, 06-30 చిన్నారి పెళ్లికూతురు, **రాత్రి:** 07-00 లక్ష్మీ కళ్యాణం, 07-30 అష్టాచమ్మా, 08-00 కోయిలమ్మ, 08-30 కుంకుమ పువ్వు, 09-00 మల్లీశ్వరి, 09-30 బిగ్‌బాస్, 10-30 బిగ్‌బాస్ రిపీట్.

GEMINI — **ఉదయం:** 06-00 టెలీ షాపింగ్, 07-00 సకలసిద్ధి, 07-30 అనుగ్రహం, 08-00 శ్రీ ఆంజనేయం రిపీట్, 08-30 నాటు వైద్యం, 09-00 సినిమా: **రాజాబాబు, మధ్యాహ్నం:** 12-00 నువ్వు నాకు నచ్చావు (రిపీట్) 12-30 చక్రవాకం, 01-00 నందిని (రిపీట్), 01-30 మొగలి రేకులు, 02-00 అమ్మ నేను ఓ అమ్మాయి, 02-30 నాగిని 2 (రిపీట్), 03-00 సినిమా: రైడ్, **సాయంత్రం:** 06-00 ప్రతిఘటన, 06-30 శ్రీ ఆంజనేయం, **రాత్రి:** 07-00 నాతిచరామి, 07-30 నాగిని 2, 08-00 నువ్వునాకు నచ్చావ్, 08-30 శనీశ్వరుని దివ్య చరిత్ర, 09-00 నందిని, 09-30 అగ్నిపూలు. 10-00 సినిమా: కితకితలు.

HBO — ఉదయం: 06-00 ఆల్మోస్ట్ హీరోస్, 07-21 10,000 బీసీ, 09-20 ద గాడ్‌ఫాదర్, **మధ్యాహ్నం:** 12-29 ద హ్యాంగోవర్ పార్ట్-2, 2-15 ట్యాక్సీ 4, **సాయంత్రం:** 04-15 ద డార్క్ నైట్ రైజెస్, **రాత్రి:** 07-16 ఫైనల్ డెస్టినేషన్ 5, 9-00 టీనేజ్ మ్యూటెంట్ నింజ టర్టల్స్: ఔట్ ఆఫ్ ది షాడోస్, 11-03 పారానార్మల్ ఆక్టివిటి 4.

అన్నదాతలో... రేపు ఉదయం 6.30 గం.లకు

1. పత్తిలో గులాబీరంగు పురుగు - సమగ్ర నివారణ
2. దక్షిణ మండలంలో సాగు చేసుకోదగ్గ ప్రత్యామ్నాయ పంటలు
3. డ్రమ్‌సీడర్ యంత్రంతో వరి నాట్లు, కలుపు నివారణ పద్ధతులు

ఉచిత హెల్ప్‌లైన్ నెం.1800-425-4085కు ఉ.10-11 గం.ల మధ్య ఫోన్ చేయవచ్చు.

రైతేరాజు

జైకిసాన్‌లో... ETV తెలంగాణ — నేటి సాయంత్రం 6.30 గంటలకు

1. పత్తిలో పెరుగుతున్న చీడపీడల ఉధృతి- ఆందోళనలో కరీంనగర్ కర్షకులు
2. రైతులకు దక్కని ఉల్లి గిట్టుబాటు ధర- సామాన్యులకు కన్నీరు తెప్పిస్తున్న ఉల్లిగడ్డ

జైకిసాన్ కార్యక్రమాన్ని www.youtube.com/etv2jaikisan ద్వారా కూడా వీక్షించవచ్చు.

పుదీనా సాగు వివరాలు

పుదీనా సాగు గురించి కంపసాగర్ కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త హారిక సూచించారు. పుదీనా ఔషధ మొక్క. దీని ఆకులను ఎక్కువగా వంటలలో సువాసన కోసం సుగంధ ద్రవ్యం గాను వివిధ రకాల పచ్చళ్ల తయారి లోను, సలాడ్‌ల లోను వాడతారు. ఈ మొక్క 40 సె.మీ. ఎత్తు వరకు పెరుగుతుంది. ఆకులు గుండ్రంగా ఆకుల పైభాగం మందంగా ముదురాకుపచ్చ రంగులో ఉంటాయి. ఇందులో మెంథాల్ అనే సుగంధ నూనే చాలా తక్కువ పరిమాణంలో ఉంటుంది. కానీ కార్వోస్ అనే సుగంధ పదార్థం ఎక్కువగా ఉండి సువాసనను, ప్రత్యేకమైన రుచిని కలిగిస్తుంది. పుదీనా ఆకుల కాండం నుండి తీసే నూనెను మెంథాల్ అంటారు. మెంథాల్‌ను ఎక్కువగా ఔషధాల తయారిలో, షేవింగ్, టూత్‌పేస్ట్ తయారిలోను వాడుతుంటారు. మెంథాల్ నూనె శాతం ఆకుల్లో 0.3.నుండి 0.8 వరకు, కాండంలో 0.1 శాతం వరకు ఉంటుంది. అయితే ఈ మెంథాల్ నూనె కోసం సాగు చేసే పుదీనా జాతులు ప్రధానంగా నాలుగు రకాలుంటాయి.

జపనీస్ మెంట్, పిప్పర్ మెంట్, స్పేయర్ మెంట్, బెర్గా మెంట్. వీటిలో గుర్తింపు పొందిన



శివాలిక్, హిమాలయ, కోసి, సిక్టమ్ రకాలు మాత్రమే నూనె కోసం సాగు చేస్తారు.

వాతావరణం: ఆకుకూరగా సాగుకు సమశీతోష్ణ, ఉష్ణ ప్రాంతాలు అనువైనవి. ఉష్ణోగ్రత 20-25 డిగ్రీలు ఉంటే ఆకు పెరుగుదల ఉంటుంది. నూనె కోసం అయితే ఎత్తైన చల్లని ప్రాంతాలు సాగుకు అనుకూలం.

నేలలు: సారవంతమైన అధిక సేంద్రియ పదార్థాలు గల తేలికపాటి ఇసుక నేలలు, మురుగునీరు పోయే వసతి గల తేలికపాటి ఒండ్రు నేలలు అనుకూలం నీరు నిలిచే నల్లరేగడి నేలలు పనికిరావు.

విత్తనం: పుదీనాను కాండం ముక్కలు నాటుకోవడం ద్వారా సాగు చేయవచ్చు. 2-3 కణుపులు కలిగిన ముక్కలు ఎన్నుకోవాలి. ఎకరాకు 3-4 క్వింటాళ్ల తీగ ముక్కలు అవసరం అవుతాయి.

విత్తనశుద్ధి: కాండం ముక్కలను లీటర్ నీటికి కార్బండిజమ్ 1 గ్రా. లేదా కాప్టాన్ లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. కలిపిన ద్రావణంలో పది నిమిషాలు ముంచి నాటుకోవడం వల్ల వేరుకుళ్లను అరికట్టవచ్చు.

నాటే విధానం: వరుసల మధ్య 30 లేదా 45 సె.మీ. వరుసల్లో మొక్కల మధ్య 10 సెం.మీ. ఎడంతో 1-2 సెం.మీ. లోతులో ఒక కణుపు తప్పనిసరిగా భూమిలో ఉండేలా నాటాలి.

నాటే సమయం: ఆకుకూర కోసం సంవత్సరం పొడవునా నాటుకోవచ్చు. నూనె కోసం సాగు చేస్తే నవంబర్ 15 నుంచి డిసెంబర్ 15 లోపు నాటుకోవాలి. లేదా నూనె దిగుబడి తగ్గుతుంది.

ఎరువులు: ఆఖరి దుక్కిలో 5 టన్నుల పశువుల ఎరువు, 50 కిలోల నత్రజని, 85 కిలోల భాస్వరం, 15 కిలోల పొటాష్ వేయాలి. నత్రజని 3 దఫాలుగా అనగా ఆఖరి దుక్కిలో సగం, మిగతా సగం 40 రోజులకు, 80-90 రోజులకు వేసుకోవాలి.

–న్యూస్‌టుడే, త్రిపురారం.

పంటమార్పిడి-అంతరపంటలు

ఒకే పంటను ఒకే పొలంలో వరుసగా పండించడం వల్ల చీడపీడల ఉధృతికి అనుకూల పరిస్థితులు ఏర్పడుతాయని, తద్వారా దిగుబడులపై ప్రభావం పడుతుందని కనుక పంటల మార్పిడి పాటించాలని మండల వ్యవసాయ విస్తరణాధికారి శ్యాం సూచించారు. పురుగు జీవిత చక్రం ముగించుకొని హాని కల్గించే స్థితికి చేరుకుంటుంది. ఒక పంటపై ఆశించే పురుగులు మరో పంటను ఆశించడం తక్కువ. పంట మార్పిడి చేస్తే పురుగు జీవితచక్రం ఛేదింపపడుతుంది. అవి వృద్ధి చెందడానికి ప్రతికూల పరిస్థితులు ఏర్పడుతాయి.



కందిలో అంతరపంటగా పెసర

సాధారణంగా పాటించే పంటల సరళి అంతరపంటలు: పప్పుధాన్యపు పంట ఆహారపంట-పప్పుధాన్యపు పైరు, చిరుధాన్యాలు ఆహారపంట-చిక్కుడు జాతి పచ్చిరొట్ట పైరు, వరి-పప్పుధాన్యపు పంట/వేరుశనగ/మొక్కజొన్న, పత్తి-జొన్న/మొక్కజొన్న, పొగాకు-మిరప/కూరగాయలు, చెరకు వరి/వేరుశనగ/కంది/ఆముదం/సజ్జ/జొన్న/

పంట మార్పిడి క్రమం: ఆహార వాణిజ్యపంటలు ఒకసారి, పప్పుజాతి పంటలు మరోసారి మార్పిడి చేయాలి. అవసరమైతే గడ్డిజాతి పైర్లు వేసుకోవాలి. భూసారాన్ని పెంచడానికి పచ్చిరొట్ట పైర్లు వేయాలి. పప్పుజాతి పంటల వేర్ల బుడిపెల్లో రైజోబియం సూక్ష్మజీవులు గాలి లోని నత్రజనిని స్థిరీకరించి మొక్కలకు అందిస్తాయి.

–న్యూస్‌టుడే, ఖానాపురం.

బోన భాగ్యం

సూర్యాపేట పట్టణం తాళ్లగడ్డలో ఉన్న ఇంద్రవెల్లి ముత్యాలమ్మ బోనాల పండగను స్థానిక ప్రజలు ఆదివారం వైభవంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి మహిళలు, యువతులు బోనాలు నెత్తిన ఎత్తుకొని భజనలు, డప్పుల చప్పుళ్లతో ఊరేగింపుగా ఆలయానికి తరలి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.

సూర్యాపేట అర్బన్, న్యూస్‌టుడే



బోనంతో మహిళ



పూజలు నిర్వహిస్తున్న మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి



బోనాలు సమర్పించడానికి వస్తున్న మహిళలు



ముత్యాలమ్మకు వస్త్రాలు సమర్పిస్తున్న డీఎస్పీ దంపతులు సునీత, చంద్రమోహన్



ముత్యాలమ్మకు నమస్కరిస్తున్న చిన్నారులు





ఆలయంలో భక్తుల వరుస



ముత్యాలమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



ముత్యాలమ్మ ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణ చేస్తున్న మహిళలు

ఆర్యవైశ్యులకు సముచిత స్థానం

రాష్ట్ర విద్యుత్తు మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

వనమహోత్సవానికి మంత్రి, ఎంపీ, ముగ్గురు ఎమ్మెల్యేలు హాజరు



మార్కెట్‌యార్డు ఆవరణలో మొక్క నాటుతున్న మంత్రి జగదీష్‌రెడ్డి, ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ,న్యూస్‌టుడే: రాష్ట్రంలో ప్రజల కష్టాలను తెలుసుకుని అడగకుండానే వరాలిచ్చే సీఎం కేసీఆర్ ఆర్య వైశ్యులకు సముచిత స్థానం కల్పిస్తారని రాష్ట్ర విద్యుత్తు మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి భరోసా ఇచ్చారు. మిర్యాలగూడ మండలం అవంతీపురం మార్కెట్ యార్డులో ఆదివారం ఆర్యవైశ్య వనమహోత్సవంలో ఆయన పాల్గొని ఆత్మీయ సమ్మేళన సభలో మాట్లాడారు. వ్యాపారులు నష్టపోతే సమాజం నష్టపోతుందని వ్యాపారులు మంచిగా ఉంటేనే అంతా సుభిక్షంగా ఉంటారన్నారు. ప్రతి ఒక్కరు వ్యాపారం చేయటంతో పాటుగా తమతో పాటుగా మరికొందరికి ఉద్యోగాలు సృష్టించాలన్నారు. సీఎం కేసీఆర్ కోటి ఎకరాలకు నీరు అందించే ఉద్దేశంతో పథకాలు ప్రవేశపెడుతున్నారన్నారు. వ్యవసాయం అభివృద్ధి చెందితే రైస్ మిల్లులకు పూర్వ వైభవం వస్తుందని, మరిన్ని పరిశ్రమలు స్థాపిస్తే ఉపాధి పెరుగుతుందన్నారు. ఆర్యవైశ్యులది పెట్టే చేయి అని, వారు అడగకూడదని అన్నారు. సంఘాల్లో రాజకీయ జోక్యం సరికాదని స్వేచ్ఛగా వ్యాపారులు వ్యాపారాలు చేసుకునే పరిస్థితి తెరాస ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. ఎంపీ గుత్తాసుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ మిర్యాలగూడ వ్యాపారుల గొప్పతనం ఫలితంగా దేశంలో బియ్యపు ధాన్యాగారంగా పేరుగాంచిందన్నారు. 15 ఏళ్లుగా తాను ఎంపీగా అన్నివర్గాల సహకారంతో పనిచేస్తున్నానన్నారు. ఎమ్మెల్యే నలమోతు భాస్కర్‌రావు మాట్లాడుతూ 40 ఏళ్లుగా తనకు వైశ్యులతో సన్నిహితం ఉందని, వారి సహకారంతోనే గతఎన్నికల్లో తాను గెలిచానన్నారు. వ్యాపారుల నుంచి ఎలాంటి చందాలు తీసుకోనని ప్రకటించానని, 3 ఏళ్లుగా ఒక్కరి వద్ద ఏ విషయంలో విరాళాలు అడగలేదన్నారు. దీంతో మిర్యాలగూడ ప్రాంత వ్యాపారులు చాలా ఆనందంగా ఉన్నారన్నారు. యాదాద్రి ప్రాజెక్టు పూర్తి అయితే మిర్యాలగూడలో 50 వేల జనాభా పెరుగుతుందని అన్నారు. నిజామాబాద్ ఎమ్మెల్యే బిగాల గణేష్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే తనకు ఒక్కడికే కేసీఆర్ పార్టీ టికెట్ ఇచ్చి గెలిపించారన్నారు. వైశ్యులంతా పార్టీలకతీతంగా పనిచేయాలన్నారు. జగ్గయ్యపేట శాసనసభ్యుడు శ్రీరామ్ రాజగోపాల్ మాట్లాడుతూ ఆర్యవైశ్యులంతా నిరుపేదలను గుర్తించి వారికి తగిన సాయం అందించి వారి ఎదుగుదలకు సహకరించాలన్నారు. సమావేశంలో పురపాలిక అధ్యక్షురాలు తిరునగరు నాగలక్ష్మి, కన్వీనర్ తిరునగరు మారుతీరావు, మీలా సత్యనారాయణ, తిరునగరు గంగాధర్, సోమా భరత్ కుమార్, రేపాల శ్రీనివాస్, కవకుంట్ల గోపాల్, కొండూరు వెంకటాద్రి, తిరునగరు భార్గవ, కర్నాటి రమేష్, ధనమల్లయ్య, తిరునగరు శ్రవణ్, చీదళ్ల శ్రీనివాస్, శరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మీలా సత్యనారాయణకు జీవిత సాఫల్య పురస్కారం అందజేత

ఆర్యవైశ్య వన మహోత్సవం కార్యక్రమంలో సుధాకర్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ మీలా సత్యనారాయణకు జీవిత సాఫల్య పురస్కారం మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎంపీగుత్తా, ఎమ్మెల్యే భాస్కర్ రావు, గణేష్, శ్రీరాంరాజగోపాల్ చేతుల మీదుగా అందజేశారు. ఆయనకు శాలువా పూలదండలతో సన్మానించి ప్రత్యేకంగా తయారు చేయించిన సన్మాన పత్రం అందించారు. ఈ సందర్భంగా పలువురు ఆర్యవైశ్య ప్రతినిధులు ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆయన జీవిత చరిత్ర పుస్తకాలను అందరికీ పంపిణీ చేశారు.



వనమహోత్సవానికి తరలివచ్చిన ఆర్యవైశ్య కుటుంబాలు



నల్గొండలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి జగదీష్‌రెడ్డి

అంబేడ్కర్ అన్ని వర్గాల వారికి ఆరాధ్యుడు

నల్గొండ అర్బన్, న్యూస్‌టుడే: రాజ్యాంగ రూపకర్త అంబేడ్కర్‌కు దేశం రుణపడి ఉంటుందని విద్యుత్తు, ఎస్సీ అభివృద్ధి శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి అన్నారు. ఆదివారం నల్గొండలోని దుర్గా శ్రీనివాస్‌కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అంబేడ్కర్ కేవలం దళితులకు మాత్రమే సంబంధించిన వ్యక్తి కాదని అన్ని వర్గాల వారికి ఆరాధ్యుడని పేర్కొన్నారు. దేశంలో పుట్టిన ప్రతి ఒక్కరికి సమాన హక్కులు సంక్రమించేలా మార్పులు తీసుకొచ్చారన్నారు. ఎంపీ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం ఆధారంగానే చిన్న రాష్ట్రాలు ఏర్పడ్డాయని అభిప్రాయపడ్డారు. బోధించు, సమీకరించు, పోరాడు అని చెప్పిన వ్యక్తి అంబేడ్కర్ అని ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ అన్నారు. అంతకుముందు నిర్వహించిన కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నియోజకవర్గ తెరాస ఇన్‌ఛార్జి దుబ్బాక నర్సింహారెడ్డి, గ్రంథాలయ ఛైర్మన్ రేఖల భద్రాద్రి, శిశు సంక్షేమ ఆర్గనైజర్ శరణ్యారెడ్డి, జేబీ రాజు, విగ్రహ దాత గౌరిదేవి కృష్ణ, చింతమళ్ల పరశురాం, ఎంఎన్ భూషి, అనుమోజు పద్మ పాల్గొన్నారు.